# కల్వరి యోధులు

(25 మంది మిషనెరీల, భక్తుల జీవిత చరిత్రలు)





Dr. N. జయపాల్

## ఇందులో...


1. “నా తల్లి కన్నీటి ప్రార్థనా ప్రవాహంలో నేను దేవుని రాజ్యంలోనికి కొట్టుకొని వచ్చితిని” అనిన -అగస్టీన్ 11



2. తన శరీరాన్ని ‘గాడిద’ అని పిల్చుకొంటూ, క్రీస్తుకొరకు దానిని లొంగదీసి క్రీస్తువలె జీవించుటకు ఆశించి జీవించిన -ఫ్రాన్సిస్ 13



3. “నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును” అంటూ సంఘసంస్కరణ చేసి, “లూథరన్‌లని గాక క్రైస్తవులనిపించు కోండి” అనిన -మార్టిన్ లూథర్ 16



4. “నేను ఇంగ్లీషులోనికి తర్జుమా చేసిన మొదటి క్రొత్త నిబంధనను కాల్చినట్లే, మీరు నన్ను కూడా కాల్చెదరు” అని తాను అన్నట్లే క్రీస్తుకొరకు హతసాక్షి అయిన -విలియం టిండేల్ 20



5. “ప్రభువా! స్కాట్లాండ్ దేశమును నా కిమ్ము! లేని యెడల నా ఆత్మను తీసుకొనుము” అని ప్రార్థించి అనేక ఆత్మలను రక్షించిన -జాన్‌నాక్స్ 22



6. సువార్తను ప్రకటించినందున 12 సం॥లు చెఱసాలలో గడిపి, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ‘యాత్రికుని ప్రయాణము’ అను పుస్తకమును వ్రాసిన -జాన్‌బన్యన్ 25



7. “లోకమే నా సేవా స్థలం” అంటూ గుఱ్ఱంపై సంచరిస్తూ గొప్ప ఉజ్జీవం రగుల్కొల్పి అనేక ఆత్మలను సంపాదించిన -జాన్‌వెస్లీ 28




8. "క్రీస్తు సువార్తను ప్రకటించుటకు నాకు వేయి జన్మలు, వేయి శరీరాలు, వేయి నోళ్ళు ఉండిన ఎంత బాగుండును?" అంటూ జీవితమంతా క్రీస్తుకొరకు ప్రయాసపడిన
-జార్జివిట్‌ఫీల్డ్ 32



9. "నేనెంత బలహీనుడనైనా, ఎన్ని శ్రమల నెదుర్కొన్నా మరణం వరకు ఆత్మలను సంపాదించగల్గితే నా కదే పది వేలు" అని ఎఱ్ఱ ఇండియన్ల రక్షణకొరకు పాటుపడిన
-డేవిడ్ బ్రెయినార్డు 35



10. "నేను చనిపోయిన తర్వాత నా రక్షకుని గురించే మాట్లాడండి. మంటి పురుగునైన నా గురించి కాదు" అనిన
-విలియంకేరి 38



11. "క్రీస్తు ప్రభువు సిలువప్రేమను బర్మాలో సంపూర్ణంగా ప్రకటించే వరకు ఎన్ని కష్టనష్టములు కల్గినా ఈ ప్రాంతం విడువనని" బర్మా బైబిలు సిద్ధపరచి, ఆత్మలను సంపాదించిన
-అథోనిరామ్ జడ్సన్ 42



12. "లోకమంతా ఎదురుతిరిగినా పిశాచాలన్నీ చుట్టుముట్టినా నేను మోకాళ్లపై నుండి లేవను" అని గొప్ప ఉజ్జీవ జ్వాలలు రగుల్కొల్పిన
-ఛార్లెస్. జి. ఫిన్నీ 45



13. "నేను 200 సార్లు బైబిలు చదివితిని, అనేక వేల సార్లు ప్రార్థనకు జవాబు పొందితిని, రక్షింపబడి 70 సం॥లు ప్రభువు కొరకు బ్రదికితిని. అయినను నేను దేవుని దృష్టిలో చిన్నవాడినే" అని తగ్గించుకొన్న
-జార్జిముల్లర్ 48




14. "నా జీవిత సర్వస్వాన్ని ఆఫ్రికాకు అంకితం చేయడంలో త్యాగం చేసానని ప్రజలు నన్ను ఎంతో పొగడుచున్నారు గాని నేను దేవునికి ఎంతో ఋణపడి యున్నానని అంగలార్చుచున్నాను" అనిన -డేవిడ్ విలింగ్‌స్టన్ 54



15. "నేను చనిపోయిన తర్వాత నా శరీరాన్ని ఎలాగూ పురుగులు తింటాయి. నేను సువార్త నిమిత్తం వెళ్ళినప్పుడు నరమాంస భక్షకులు తింటే మాత్రం ఏమి?" అంటూ అట్టివారి మధ్య సేవచేసిన -జాన్. జి. పేటన్ 57



16. "ప్రజలకు సువార్త అందించుటయేగాక వారి శరీర అవసరతను, ఆకలి బాధను తీర్చుట కూడా అవసరమే" అని దిక్కులేని వారికి దిక్కుగా, తండ్రి లేని వారికి తండ్రిగా పరిచర్యచేసిన -విలియంబూత్ 60



17. "నేను దేవుని చిత్తంలో చేసిన దేవుని సేవకు దేవుని సహాయం తక్కువ కాదు" అంటూ చైనా ఇన్-లాండ్ మిషన్ స్థాపించి గొప్ప పరిచర్య చేసిన -హడ్సన్ టేలర్ 63



18. "ఆత్మల సంపాదనే నా పని" అంటూ అహర్నిశలు శ్రమపడి కోటిమందిని సువార్త వెలుగులోనికి తెచ్చిన -డి. యల్. మూడీ 66



19. "ఆఫ్రికా అరణ్యంలో ప్రజలు క్రీస్తు శిష్యులయ్యారంటే ఇది నా ప్రజ్ఞ కాదు, ప్రభువు కృపే!" అంటూ ఆ అనాగరికుల మధ్య వారి రక్షణకై పాటుపడిన -మేరీ స్లెస్సర్ 70



20. "ప్రభువే నా ఆదరణ, సహాయకర్త; ప్రార్థన, వాక్యధ్యానమే నా నిధి" అని అనేకమంది విధవరాండ్రను, దిక్కులేని వారిని పోషించిన భారతీయ వనిత -పండిత రమాభాయి 74



21. "ప్రతి 15 ని.లకు బైబిల్ చదవకుండా, ప్రతి 30 ని.లకు మోకరించి ప్రార్థన చేయకుండా నేనుండలేను" అంటూ పరిశుద్ధాత్మ శక్తితో పరిచర్య చేసిన -స్మిత్ విగ్గిల్స్ వర్త్ 77



22. "ఒక జూదగాడు జూదంలో ఉన్నదంతా కోల్పోయినట్లే క్రీస్తు కొరకు మనం ఉన్నదంతా ఎందుకు త్యాగం చేయకూడదు" అంటూ సర్వస్వం త్యాగం చేసిన -ఛార్లెస్ టీ. స్టడ్ 80



23. "అయ్యా! భోజనానికి వస్తారా?" అంటే "నన్ను ఇంక కొంచెం సేపు ఆత్మల కోసం అలమటింప నీయండి" అని ప్రార్థించి ప్రార్థించి, ఆత్మలను సంపాదించిన -జాన్‌హైడ్ 84



24. "ఆర్థిక అవసరతలకు కూడా నేను దేవున్నే అడిగెదను" అంటూ భారతదేశములో దగా పడిన స్త్రీలను, అనాథలను క్రీస్తుకొరకు సంపాదించి, శిష్యురాండ్రుగా చేసిన -అమీకార్ మైఖేల్ 88



25. "క్రీస్తుని లోకానికి ప్రకటించుటయే నా ధ్యేయం" అంటూ రక్తము కారుచున్న పాదాలతో నడచి సువార్తను ప్రకటించిన భారతీయ మిషనరీ -సాధు సుందర్‌సింగ్ 91



(1)

# అగస్టీన్

[354-431]



**పూర్తి పేరు :**
అగస్టీన్

**జన్మ స్థలం :**
ఉత్తర ఆఫ్రికాలోని 'తగస్టీ'

**తల్లిదండ్రులు :**
ప్యాట్రిక్, మోనికా

**జననం :**
క్రీ.శ. 354వ సంవత్సరము

**మరణము :**
క్రీ.శ. 431 వ సంవత్సరము

**రక్షణానుభవం :**
34 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
'ఒప్పుకోలు', 'దేవుని పట్టణము' అనే చక్కటి ఆధ్యాత్మిక పుస్తకాలను రచించెను. సంఘ సంస్కరణకు, తప్పుడు సిద్ధాంతాలను దిద్దుటకు ఇతని పుస్తకములు, ప్రసంగములు ఎంతో తోడ్పడెను.

అగస్టీన్ 354 వ సంవత్సరములో ఉత్తర ఆఫ్రికాలోని 'తగస్టీ' అనే స్థలములో ప్యాట్రిక్, మోనికా అనే దంపతులకు జన్మించెను. ఇతని తండ్రి ఆస్తిపరుడైనప్పటికి అన్యుడు, కోపిష్ఠి, అపవిత్రమైన జీవితం కలిగినవాడు. అయితే, ఇతని తల్లి అయిన మోనికా రక్షించబడిన విశ్వాసి, ప్రార్థనాపరురాలు. తన కుమారుడు దేవుని సేవకుడవ్వాలని ఆశించి ప్రార్థించెడిది.

అగస్టీన్ వారికి దగ్గరలో ఉన్న రోమ్ నగరంలో విద్యనభ్యసించెను. మంచి విద్యావంతుడు, పుస్తకములు చదువుట ఇతనికి బహు ప్రీతి. లాటిన్, గ్రీకు భాషలను కూడా నేర్చుకొనెను. గాని ఆ భాషలలో ఉన్న కట్టు కథలను, అపవిత్రమైన కథలను చదివినందున తన హృదయమును పాడుచేసుకొనెను. అతని హృదయము అపవిత్రమైన తలంపులతో నిండి యుండినందున చాలా అపవిత్రమైన జీవితమునకు అలవాటు పడెను. కనుక బైబిల్‌ను తృణీకరించెను, క్రీస్తును నెట్టివేసెను.

ఈయన తల్లియైన మోనికా తన కుమారుని జీవితం మారవలెనని కన్నీటితో ప్రార్థించెడిది. అగస్టీన్ తన తల్లి ప్రార్థనను అపహసించి, ఒక పని పిల్లతో అక్రమ సంబంధము పెట్టుకొని అనేక సంవత్సరములు రోత జీవితము జీవించెను. అయితే, ఎటువంటి సమాధానము, తృప్తి అతనికి దొరకక ఆ పాప జీవితమునకు కుమిలిపోతూ రక్షణ మార్గము వెదకుచుండెను. తన స్వశక్తి ద్వారా తన పాపములనుండి విడుదల పొందగోరి విఫలుడాయెను.

ఒక రోజున ఒక భిక్షగాడు సంతోషంతో నవ్వుకోవడం చూచి 'నాకంటె అతడే మెరుగుగా ఉన్నాడే' అని ఆశ్చర్యపడెను. ఆ సమయంలో ఒక క్రైస్తవ స్నేహితుడు 'ఆంబ్రూస్' అనే ఒక బిషప్పు గారి యొద్దకు అతనిని తీసికొని వెళ్ళగా; అయన పాపము యొక్క పుట్టుకను గురించి, దాని అంతమును గురించి, సువార్త లేఖనములలో కొన్ని భాగములను ఎత్తి చూపించి; యేసుక్రీస్తు సిలువను గూర్చి బోధించగా అగస్టీన్ దేవుని ఆత్మచే ముట్టబడి ఎంతో పశ్చాత్తాపపడి కన్నీటితో ప్రార్థించుట మొదలు పెట్టెను.

ఆలాగున ఒక రోజు ప్రార్థించుకొనుచుండగా "పరిశుద్ధ గ్రంథము తీసికొని చదువు" అన్న ఒక చిన్న బిడ్డ వంటి స్వరమును వినెను. అతడు బైబిల్ తీసి చదువగా "మోసకరమైన దురాశలవలన చెడిపోయిన మీ ప్రాచీన స్వభావము విడిచిపెట్టి క్రీస్తు యేసును ధరించుడి" అన్న వాక్యముపై అతని దృష్టిపడెను. (ఎఫెసీ 4:22-24) చదివి లోతైన పశ్చాత్తాపముతో ప్రార్థించిన అగస్టీన్ మారు మనస్సు పొందెను. 388వ సంవత్సరములో 'ఈస్టర్' రోజున బాప్తిస్మము పొందెను. 13 సంవత్సరములుగా అగస్టీన్ మార్పు కొరకు అతని తల్లి చేసిన ప్రార్థన నెరవేరెను. అగస్టీన్ ఆధ్యాత్మిక జీవితంలో వర్థిల్లుచు, తన ఉద్యోగం విడిచిపెట్టి క్రైస్తవ సాధువుల మఠంలో చేరి దేవుని వాక్య పఠనములోను, ప్రార్థనలోను ఎదుగుచుండెను.

395 వ సంవత్సరములో సంపూర్ణ సేవకు సమర్పించుకొని బిషప్‌గా అభిషేకించబడెను. మంచి ప్రార్థనాపరుడుగా కార్యనిర్వాహకుడుగా, ప్రసంగీకుడుగా పేరు పొందెను. "ఒప్పుకోలులు", "దేవుని పట్టణము" అనే చక్కటి ఆధ్యాత్మిక పుస్తకాలను వ్రాసెను. సంఘ సంస్కరణకును, తప్పుడు సిద్ధాంతాలను దిద్దుటకును ఇతని పుస్తకములు, ప్రసంగములు ఎంతో తోడ్పడెను.

ప్రారంభ క్రైస్తవ సంఘములో అనగా తన 77వ ఏట గొప్ప పేరు పొంది "పరిశుద్ధుడైన అగస్టీన్" అని పిలువబడెను. రక్షణ క్రియల ద్వారా కాదు, కృప ద్వారానే అని తన జీవితములో అనుభవించి ఇతరులకు బోధించెను.

431 వ సంవత్సరములో తన 77వ యేట మరణించి తాను ప్రేమించిన పరలోక పట్టణం చేరుకొనెను పరిశుద్ధుడైన ఈ అగస్టీన్! ✝

## 2 ఫ్రాన్సిస్

[1181-1226]



**పూర్తి పేరు :**
ఫ్రాన్సిస్

**జన్మ స్థలం :**
ఇటలీలోని 'అసిసీ' పట్టణము

**తల్లిదండ్రులు :**
పీటర్ బర్నాడ్ దంపతులు

**జననం :**
క్రీ.శ. 1181వ సంవత్సరము

**మరణము :**
క్రీ.శ. 1226 అక్టోబర్ 13

**రక్షణానుభవం :**
20 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
పేదలకు, వ్యాధి గ్రస్థులకు, కుష్ఠురోగులకు సేవచేసి, క్రీస్తు ప్రేమను వారు గ్రహించునట్లు చేసి అనేకులను క్రీస్తు కొరకు సంపాదించెను.

ఫ్రాన్సిస్ 1181 వ సంవత్సరములో 'పీటర్ బర్నాడ్' అనే ఒక ధనవంతుడైన వ్యాపారస్థునికి ఇటలీలోని ఉంబ్రియా ప్రాంతమునకు చెందిన "అసిస్సీ" పట్టణములో జన్మించెను. అతని తండ్రి చాలా మూర్ఖత కల్గిన, కఠినుడైన వ్యక్తి! ఫ్రాన్సిస్ పెద్ద వాడగుచుండగా తన తండ్రిని ద్వేషించుట మొదలు పెట్టెను. గాని అతని వ్యాపార మును, ధనమును ప్రేమించెను. 14 సంవత్సరముల వయస్సులోనే తన తండ్రి ద్వారా వ్యాపార పద్ధతులను నేర్చుకొని డబ్బు సంపాదించుట మొదలు పెట్టెను.

తన కుమారుడు గొప్ప ధనికుడు కావాలని అతని తండ్రి అతని ఇష్టానికి వదిలిపెట్టగా, ఫ్రాన్సిస్ చేతినిండా డబ్బుతో విపరీతమైన విలాసాలతో, ఆడంబర ములతో, అహంభావముతో, ఆటలతో తన యౌవన జీవితమును గడుపుచుండెను. ధనవంతులతో సహవాసము చేయుచు తన జీవితమును వ్యర్థపరచుకొనుచుండెను. ఒకసారి రోమా పట్టణమునకు యాత్రకు వెళ్ళెను. అక్కడ కుష్ఠురోగులను, పేదలను చూచినపుడు అతని హృదయము ద్రవించెను.

ఫ్రాన్సిస్ తన 20 వ సంవత్సరములో ఒక భయంకరమైన వ్యాధికి గురై బహు బలహీనుడాయెను. ఆ వ్యాధిలో దేవుని స్వరమును వినెను. "నీవు యజమానుని సేవించటం మేలా? లేక దాసుని సేవించటం మేలా? యజమానుడనైన నన్ను విడిచి, లోక భోగాలనే దాసుని నీవు వెంబడించుచున్నావా?" అను పలుకులు తన పాప జీవితము కొరకై లోతుగా పశ్చాత్తాపపడునట్లు చేసెను. ఆ రాత్రి నుండి ఫ్రాన్సిస్‌లో ఒక మార్పు కలిగెను. ఏకాంతముగా వెళ్ళి ప్రార్థన చేసుకొనుటకు, క్రీస్తువలె జీవించుటకు అధికముగా ఆశించెను.

ఒకరోజు 'సాండిమెన్' అనే ఆలయమునకు వెళ్ళి అక్కడ మోకాళ్ళూని ప్రార్థించుట మొదలు పెట్టెను. అలా ప్రార్థించుచుండగా "ఫ్రాన్సిస్, నా ఇల్లు పాడైపోయి యుండుట చూచితివా? వెళ్ళి బాగు చేయి!" అను ఒక మెల్లని స్వరమును వినెను. ఆశ్చర్యపడ్డ ఫ్రాన్సిస్ సంతోషముతో "తప్పకుండా చేయుదును ప్రభువా!" అనెను. తన తండ్రి డబ్బుతో అతడు దేవుని ఆలయ కట్టడములను బాగుచేయ మొదలు పెట్టెను. అతని తండ్రి నా డబ్బు వాడుచున్నావే? అని ఫ్రాన్సిస్‌తో తగాదా పడి అతనిని కోర్టుకు లాగెను. "నీవు దేవుని సేవ చేయవలెనన్నచో నీ తండ్రి డబ్బును తిరిగి యిచ్చి వేయవలెను" అని ఆనాడు న్యాయాధిపతిగా ఉన్న బిషప్పు చెప్పెను. అప్పటికే "పిచ్చివాడు" అన్న పేరు తెచ్చుకొన్న ఫ్రాన్సిస్ బహు చల్లటి వాతావరణములో కూడా తాను వేసుకొన్న వస్త్రములను, ఆభరణములను, తన దగ్గర ఉన్న డబ్బంతటిని అప్పటికప్పుడే తీసి తండ్రికి యిచ్చివేసెను.

ఆశ్చర్యపోవుచున్న జనసమూహముతో, "నేనిక స్వేచ్ఛగా దేవుని సేవ చేసెదను. నా అవసరతల కొరకు పరలోకమందున్న నా తండ్రికే ప్రార్థించి పొందెదను" అనెను. చేతిలో డబ్బు లేని ఫ్రాన్సిస్ రాళ్ళు, ఇటుకలు మొదలగు కట్టడ అవసరతలను అడుగుకొనుచు పాడుబడిన ఆలయములను కట్టుచుండెను. ధనవంతుని కుమారుడై యుండియు, ఆహారము కొరకు కూడా ఇతరులను అడుక్కొనుచున్నందున కుటుంబమునకు సిగ్గు తెచ్చెను.

అయితే, 1208వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఒక దినమున ప్రభువు సువార్తను చదువుచుండగా, పరిశుద్ధాత్మ వలన ముట్టబడెను. యేసుక్రీస్తు తన శిష్యులను పంపినపుడు వారితో డబ్బునైనను, సంచినైనను తీసుకొని వెళ్ళవద్దని; సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువారస్తు ప్రకటించమని చెప్పిన మాటలు అతనికి కనువిప్పు కలుగజేసెను; అతడు తన దట్టీని, చెప్పులను, కర్రను తీసివేసి; సామాన్యమైన ఒక అంగీని ధరించి, నడుము చుట్టూ ఒక త్రాడు కట్టుకొనెను. దేవుని సంఘమును కట్టుట అంటే కట్టడములు కాదు ఆత్మలను సంపాదించుట అని గ్రహించుకొనెను. అప్పటినుండి పడిపోయిన చర్చి గోడలు కట్టుటమాని సువార్తను ప్రకటించుట ద్వారా ఆత్మలను రక్షణలోనికి నడిపించుట మొదలు పెట్టెను.

"ప్రభువు నీకు సమాధానమిచ్చును గాక!" అని ఇతరులను పలుకరిస్తూ క్రీస్తు ప్రేమను ప్రకటించు చుండెను. అంతవరకు పిచ్చివాడనుకొన్న మనుష్యులు అప్పటినుండి అతనిని ఘనునిగా ఎంచి అతని మాటలు వినుచుండిరి. మరనేక మంది ధనవంతులైన యౌవనులు కూడా వారి ధనమును విడిచిపెట్టి ఫ్రాన్సిస్‌తో కలిసి దేవుని నీతిని, ఆయన రాజ్యమును వెదకుచుండిరి. ఒక సంవత్సరంలో 12 మంది సహోదరులు ఫ్రాన్సిస్‌తో చేరిరి. వారందరు కలిసి అర్థరాత్రి లేచి ప్రార్థించుచు, ఉదయము నుండి సువార్తను ప్రకటించుచుండిరి.

ఫ్రాన్సిస్ ఒంటరి ప్రార్థనల ద్వారా శరీరేచ్ఛలను జయించెడివాడు, తన శరీరమును "గాడిద" అని పిలుచుకుంటూ క్రీస్తు కొరకు లొంగదీసుకొనెడివాడు. ఒకప్పుడు సుఖభోగాలయందు జీవించుచు, బీదలను తృణీకరించెడి ఫ్రాన్సిస్ ఇప్పుడు దారిద్ర్యమును ప్రేమించుచు; పేదలకు, వ్యాధిగ్రస్థులకు, కుష్ఠరోగులకు సేవ చేయుటయే తన జీవిత ధ్యేయముగా భావించెను. సేవ అక్కరలకై దేవునివైపు చూచుచుండెను. ఈయన బోధ మిక్కిలి సూక్ష్మమైనదిగాను, మనస్సాక్షిని కదిలించి మారుమనస్సులోనికి నడిపించునదిగాను ఉండెను. ఈయనను సమీపించుట తోడనే భయంకరమైన దొంగలు మార్చబడిరి. కుష్ఠరోగులను ప్రేమించి, వారి పుండ్లను కడుగుచుండగానే వారు పూర్తి స్వస్థత పొందుచుండెడివారు. ఇతడు దేవుడు చేసిన జంతువులను, పక్షులను బహుగా ప్రేమిస్తూ; వాటికి కూడా సువార్తను ప్రకటించుచూ, ప్రభువును, స్తుతించుమని పక్షులతో పలికినపుడు అవి పాటలు పాడుచుండెడివి.

ఇతడు చాలాసార్లు ఇటలీ సరిహద్దులను దాటి సువార్తను ప్రకటించెను. 1214 లో మొరాకో ప్రాంతానికి వెళ్ళి అచ్చటి ప్రజలను రక్షించాలని, అవసరమైతే అచ్చట హతసాక్షిగా మరణించాలని ప్రయాణమయ్యెను. కాని అనారోగ్యము వలన తిరిగి రావలసి వచ్చెను. 1219 లో పాలస్తీనాకు వెళ్ళి అచ్చట ముస్లింలకు సువార్తను ప్రకటించెను. గాని అతని ఆరోగ్యం మరింత క్షీణించగా అతని కనుదృష్టి తగ్గిపోగా తిరిగి అసిస్సీకి వచ్చెను. 1224 సెప్టెంబరు నెలలో అతని కాళ్ళలో, చేతులలో గాయములు ఏర్పడినందున నడవలేని స్థితిలో గాడిదపై మాత్రము ప్రయాణము చేసెను. ఒక చిన్న గుడిసెలో తన చివరి దినములు గడిపెను.

ఈయన మరణ సమయంలో, "ప్రేమ అను ఆయుధము కలవాడే ఈ సేవ కొనసాగించుటకు తగినవాడు" అని చెప్పి, 1226 అక్టోబరు 13వ తేదీ రాత్రి, తన 45వ యేట ప్రభువు నొద్దకు వెళ్ళెను ఈ కల్వారి యోధుడు. †

# ③ మార్టిన్ లూథర్

[1483-1546]



**పూర్తి పేరు :**
మార్టిన్ లూథర్
**జన్మ స్థలం :**
జర్మనీ దేశములోని 'ఎలిసిలిబెన్'
**తల్లిదండ్రులు :**
హాన్స్ లూథర్, మార్గరెట్
**భార్య పేరు :**
క్యాథరిన్ ఫాన్‌బోరా
**జననం :**
1483 నవంబరు 10
**మరణము :**
1546 ఫిబ్రవరి 18
**రక్షణానుభవం :**
22 సం॥ల వయస్సులో
**సేవా ఫలితం :**
రోమన్ కేథలిక్ సంఘ దురాచారములను ఎదిరించి సంఘ సంస్కరణ చేసి. బైబిలు గ్రంథ మును జర్మనీ భాషలోనికి తర్జుమా చేసి అనేకులు బైబిలు చదువగలుగునట్లు వెలుగు లోనికి తెచ్చెను.

మార్టిన్ 1483 నవంబరు 10న జర్మనీ దేశములోని 'ఎలిసిలిబెన్' అను స్థలములో హాన్స్ లూథర్, మార్గరెట్ అను సామాన్య దంపతులకు జన్మించెను. తన 13వ సంవత్సరమున హైస్కూల్‌లో ప్రవేశించెను. 17 సంవత్సరముల వయస్సులో "ఎర్‌ఫర్ట్" యూనివర్సిటీలో చేరెను. ఈయన "లా" చదువుచుండగా 1505 వ సంవత్సరంలో భయంకరమైన వడగండ్ల తుఫానులో చిక్కుకొని చనిపోబోయే సమయంలో "ప్రభువా!! నన్ను రక్షించు, నేను మఠంలో చేరతాను" అని ఒప్పుకొనెను. ఆ తుఫాను నుండి రక్షించబడి, తాను చేసిన మ్రొక్కుబడిని నిలబెట్టుకొనుటకు జర్మనీలోని మఠంలో చేరగోరెను.

మార్టిన్ తల్లి తన కుమారుడు లాయర్ కావలెనని కోరెను. కాని మార్టిన్ తాను మ్రొక్కుబడి చేసుకున్న ప్రకారము కేథలిక్ మతగురువు కాగోరెను. లూథర్ ఎక్కువగా ప్రార్థించుచు, సామాన్యమైన వస్త్రములు ధరించుచు, మంచి వాడిలా ఉండాలని ప్రయత్నించుచుండెను. దేవుడు ఉగ్రుడని, అతి పవిత్రుడని, పాపాలను

సహించలేదని భావించిన లూథర్ తన పాపములకు ప్రాయశ్చిత్తముగా శరీరమును నలుగగొట్టుకొనుచు, ఎలాగోలా పరలోకమునకు చేరుకోవాలనుకొనుచుండెను.

సున్నితమైన మనస్సాక్షి గలవాడై, లోతైన పాపపు ఒప్పుకోలు కలిగి సమాధానం కోసం ఆశిస్తుండేవాడు. సంఘ ఆచారాల ప్రకారం పాపక్షమాపణ పొందుటకు అన్ని ప్రయత్నములను చేసెను. పాపపు ఒప్పుకోలు ప్రార్థనలు చేయుట, తన్ను తాను దుఃఖపరచుకొనుటయే గాక రోమాకు యాత్రకు కూడా వెళ్ళి వచ్చెను. కాని ప్రయోజనం లేక, స్వనీతి ద్వారా పాపముల నుండి విడుదల పొందుట సాధ్యము కాదని తెలిసికొనెను. మార్టిన్ విటన్‌బర్గ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ గ్రీకు, హెబ్రీ భాషలను బాగుగా పఠించెను. ఒక సహోదరుని సలహాతో ఆ దినములలో నిషేధించబడిన బైబిలు గ్రంథాన్ని బాగుగా చదివి, ధ్యానించుట మొదలు పెట్టెను. అలాగు 1515వ సం॥లో గ్రీకు, హెబ్రీ భాషలలో ఉన్న రోమా పత్రికను చదువుచుండగా "నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును" అనే మాట లూథర్ జీవిత గమనాన్నే మార్చెను. సువార్తను గ్రహించిన లూథర్ రక్షణ కృప మూలముగానే కాని క్రియ వలన కాదని గ్రహించెను. కృప మేరకు ఆత్మ రక్షణ, సమాధానమును పొందెను.

ఆ దినములలో ఉన్న రోమన్ కేథలిక్ సంఘ దురాచారములను, ఎదిరించెను. పాపపరిహార పత్రములను అమ్ముట, రుసుము చెల్లించుట ద్వారా నరకంలో ఉన్న ఆత్మలు పరలోకమునకు వెళతారు అనుట, తప్పని ఖండించెను. పర్గెటరీలో ఉన్న ఆత్మలను పరలోకమునకు పంపించుటకు పోప్‌కిగాని, మరి ఏ మానవునికి గాని అధికారము లేదని వక్కాణించెను. యేసుక్రీస్తునందు విశ్వాస ముంచుట ద్వారానే మన పాపములు క్షమింపబడగలవు, పరలోకమునకు వెళ్ళగలము అనే సత్యాలను ధైర్యముగా ప్రకటించెను. నిజముగా పశ్చాత్తాపపడు ప్రతివానికి పాపక్షమాపణ, పాపపు దాగు నుండి క్రీస్తులో సంపూర్ణ విమోచన కలుగునని దానికి మనుష్యులిచ్చే పాప నివారణ పత్రములు అవసరము లేదని ప్రకటించెను. పోప్ అధికారము, పాప క్షమాపణ పత్రికలు వాక్యానుసారమైనవి కావని, ప్రార్థన ద్వారానే సంఘము మరల కట్టబడాలని ప్రతి వానికి అర్థమయ్యేలా తాను వ్రాసిన 95 పరిశోధనా పత్రములను 1517 వ సంవత్సరములో జర్మనీలోని 'విటన్‌బర్గ్' ఆలయ ద్వార బంధములకు మేకులతో కొట్టెను.

మొదట పోప్ ఈ విషయములను అంతగా పట్టించుకోలేదు. గాని తరువాత వాటి తీవ్రతను గ్రహించి, లూథర్‌ను హెచ్చరించి తాను వ్రాసినవన్నీ తప్పని ఒప్పుకొనమనెను. లూథర్ నిరాకరించగా 1520వ సంవత్సరము జూన్

15న లూథర్‌ను వెలివేసి అతడు వ్రాసిన వ్రాతలను కాల్చివేయుమని ఆజ్ఞ ఇచ్చెను. లూథర్ బహిరంగముగా పోప్ ఇచ్చిన ఆజ్ఞ పత్రాలను, కాథలిక్ కాగితములను కాల్చివేసెను. లూథర్ గుర్తించదగిన ధైర్యసాహసములు గలవాడు. ఆయన శత్రువులు ఆయనను వార్మ్స్ (WORMS) అనే స్థలంలో కలిసికొమ్మని పిలిచినపుడు, అతని స్నేహితులు ఆటంకపరచినను ఆయన- ఆ పట్టణములోని ఇండ్ల మీదనున్న పెంకులన్ని దెయ్యములున్నను నేను పోయెదననెను. ధైర్యముగా అక్కడ తాను వ్రాసిన పత్రాలు వాక్యానుసారమని వాటిని నిరాకరించుటకు కుదరదని చెప్పెను.

కాని ఆయన తిరిగి వెళ్లుచుండగా ఆయన స్నేహితులే ఆయనను బంధించి వార్ట్‌బర్గ్ (WART-BURG) అనే స్థలంలో ఒక సంవత్సరం పాటు ఆయనను దాచిరి. ఆయన శత్రువులు లూథర్ చనిపోయెనని తలంచిరి. కాని లూథర్ ఆ సంవత్సరంలో క్రొత్త నిబంధనను జర్మనీ భాషలోనికి తర్జుమా చేయుటలో నిమగ్నుడయ్యెను. మార్చి 1522లో ఆయన బయటపడిన తరువాత మరలా విటన్‌బర్గ్‌కి వచ్చి ప్రసంగించుటలోను, వ్రాయుటలోను గడిపెను.

1524లో తాను వ్రాసిన 23 పాటలను ఒక కీర్తన పుస్తకముగా ప్రచురించెను. ప్రతి జర్మనీ దేశస్థుడు చదువునట్లు పూర్తి బైబిల్‌ను అతి ప్రయాసతో జర్మనీ భాషలోనికి తర్జుమా చేసెను. క్రొత్త నిబంధనను గ్రీకు నుండి మూడు నెలల్లో తర్జుమా చేసెను గాని హెబ్రీ భాషలో ఉన్న పాత నిబంధనను తర్జుమా చేయుటకు 12 సంవత్సరములు పట్టెను. అలాగు 1534వ సంవత్సరమున పాత నిబంధనను కూడా జర్మనీ భాషలోనికి తర్జుమా చేసెను. ఆ మొత్తం బైబిలును జర్మనీ భాషలోనికి అనువదించినవాడు మార్టిన్ లూథర్. "దైవవాక్యాన్ని చేత బట్టిన సామాన్య మానవుడు, దైవవాక్యం లేని మహాబలవంతుడైన పోప్ కన్న అత్యంత బలవంతుడని" చెప్పడమే కాదు, తన జీవితము ద్వారా నెరవేర్చి చూపించెను.

ఒక ఆదివారము క్యాజిల్ చర్చిలో మార్టిన్ ప్రసంగించుచు ఒక కథ చెప్పెను. ఒక వ్యక్తి మరణించిన తరువాత తనతో పాటు తన ఆత్మను తప్ప మరి దేనిని తీసుకొనిపోడు అని చెప్పుటకు ఉదాహరణగా ఈ కథ చెప్పెను. దాని ప్రకారము- ఒకడు మరణించి తనతోపాటు పాపక్షమాపణ పత్రమును తీసుకొని వెళ్ళి నరక ద్వారము వద్దనున్న దయ్యముతో- "ఇది నా పాపక్షమాపణ పత్రము, పరలోకములో ప్రవేశించుటకు నా టిక్కెట్టు యిది. గాని పొరపాటున నేను ఇచ్చటికి పంపించ బడితిని" అని చెప్పుచుండగా, ఆ నరకాగ్ని వేడికి సీలు కరిగిపోయినది. ఆ పత్రము కూడా కాలి బూడిదై పోయినది. "ఆ పత్రం పనికిరాదు, బూడిదై పోయింది" అని చెప్పుచూ దయ్యం అతనిని నరకములోనికి నెట్టినది.

లూథర్ కేథలిక్ సంఘాన్ని సంస్కరించగోరెను గాని కేథలిక్ సంఘము అతనిని బహిష్కరించెను. లూథర్ తన జీవితకాలమంతా సంఘ పునరుద్ధరణకు ప్రయాసపడెను. ఎన్నో శ్రమలను, కష్టములను ఎదుర్కొనవలసి వచ్చెను. దేవుని వాక్యమునకు విరోధులైన వారి వలన మాత్రమే కాక తన సొంత స్నేహితుల ద్వారా కూడా మోసగించబడెను. అయినను ప్రభువు కృప వలన దేవుడు తనకిచ్చిన ప్రత్యక్షతను బయలుపరచెను. తన తండ్రి యొక్క సలహా మేరకు లూథర్ తన 42వ ఏట 24 ఏండ్ల "క్యాథరిన్ ఫాన్ బోరా" ను 1525 లో వివాహము చేసికొనెను. వారికి అరుగురు సంతానము కలిగిరి. వారిలో నలుగురు మాత్రము బ్రతికిరి. వారిని చిన్న వయస్సు నుండి ఎంతో భయభక్తులతో పెంచెను. "ఒక చిన్న బిడ్డ చనిపోయినా ఫర్వాలేదు గాని అవిధేయుడుగాను, భక్తిహీనుడుగాను ఒకడు నా యింట్లో పెరుగుట నాకిష్టం లేదని" చెప్పెడివాడు.

బైబిలును వెలుగులోనికి తెచ్చి సర్వలోకమునకు తెలియజేయుటకు దేవుడు వాడుకున్న పనిముట్టు డాక్టర్ మార్టిన్ లూథర్. ఈయన వృద్ధాప్యము సమీపిస్తున్నప్పటికి, ఆరోగ్యము క్షీణిస్తున్నప్పటికి, తన పనిని కొనసాగిస్తూ ఉండెను. వాక్య పఠనము, రచనలు, ప్రసంగములు, వ్యక్తిగత సేవ, ప్రార్థన, ప్రయాణములు ఈయన సేవలోని భాగములు. ఈయన 1546 ఫిబ్రవరి 18 న తన 62వ సంవత్సరములో తెల్లవారుజాము 3 గంటలకు గుండెపోటుతో మరణించి ప్రభువు సన్నిధికి ఏగెను.

లూథర్ మరణించినప్పుడు అతని గురించి ఫిలిప్ మెలాంగ్తన్ ఇలా అన్నాడు– "లూథర్ ముఖ్యమైన, సత్యమైన, అవసరమైన క్రైస్తవ సిద్ధాంతాన్ని వెలుగులోకి తీసుకొని వచ్చాడు. నిజమైన పశ్చాత్తాపమంటే ఏంటి? అన్న విషయాన్ని; దేవుని న్యాయమైన తీర్పును ఎదుర్కోలేక వణుకుచున్న పాపికి క్రీస్తులో ఆశ్రయముందన్న సంగతిని వాక్యము నుండి చూసాడు. మనిషి విశ్వాసం ద్వారా నీతిమంతునిగా తీర్పు తీర్చబడతాడు అనే పౌలు బోధను అందరికీ అర్థమయ్యేలా వివరించాడు".

మార్టిన్ లూథర్ సంఘకాపరి, ప్రొఫెసర్, మత సంస్కర్త, తండ్రి, గ్రంథకర్త, గీతకర్త, అనువాదకుడు, విశ్వాసము ద్వారా జయమును అనుభవించినవాడు. తన పనిని ముగించి తనను ప్రేమించిన ప్రభువు యొద్దకు చేరెను. "నా పేరు విడిచిపెట్టుడి, మిమ్మును 'లూథరన్‌లు' అని కాదు, క్రైస్తవులు అని పిలిపించుకొనుడి" అని తనను వెంబడించిన వారిని బ్రతిమాలుకొన్న దీనుడు. క్రైస్తవ ప్రపంచం ఆయనను జ్ఞాపకముంచుకొనక తప్పదు. ✝

# (4) విలియం టిండేల్

[1495-1536]



**పూర్తి పేరు :**

**విలియం టిండేల్**

**జన్మ స్థలం :**

గ్లాస్టర్ షైర్‌లోని 'స్లింబ్రిడ్జి'

**జననం :**

క్రీ.శ. 1495

**మరణం :**

1536 అక్టోబరు

**రక్షణానుభవం :**

21 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**

అనేక శ్రమల మధ్య బైబిలును ఆంగ్లము లోనికి తర్జుమా చేసి అనేకులకు అందునట్లు చేసి, చివరికి హతసాక్షి ఆయెను.

విలియం టిండేల్ జన్మ స్థానమును గురించియు, జన్మ కాలమును గురించియు తేట తెల్లముగా తెలియక పోయినను, ఇతడు "గ్లాస్టర్ షైర్" లోని "స్లింబ్రిడ్జి" లో 1495 వ సంవత్సరములో జన్మించి యుండవచ్చును. ఇతనికి చిన్న వయస్సు నుంచి దేవుని గ్రంథాలు చదవాలంటే ఎంతో ఆశ. "ఆక్స్ ఫర్డ్" విశ్వవిద్యాలయంలో మంచి విద్యనభ్యసించెను. టిండేల్ నూతన నిబంధనను గ్రీకు భాషలో చదివెను. ఈ గ్రంథమును చదివినప్పుడు అతనికది మానసిక శక్తిని గాక హృదయ మార్పును కలుగజేసెను.

అంతేగాక తన హృదయాన్ని ఆకర్షించిన ఆ గ్రంథం దేవుని వాక్యమని, అది ప్రతి వారు చదివి మేలు పొందునట్లు తన మాతృభాష అయిన ఆంగ్లంలోనికి అనువదించాలని పూనుకున్నాడు. ఆ గ్రంథంలో తాను చదివిన సత్యాలను బోధించుటకు కూడా ప్రారంభించెను.

అయితే ఆ దినములలో బైబిల్ గ్రంథమును సామాన్యులు చదువకూడదను చట్టం కలదు. ప్రభువు నేర్పిన ప్రార్థనను, పది ఆజ్ఞలను తమ పిల్లలకు ఇంగ్లీషులో నేర్పించారని నేరము మోపబడిన ఏడుగురు వ్యక్తులను కర్రకు కట్టి కాల్చి చంపిరి. అటువంటి భయంకరమైన దినములలో 'టిండేల్' ఆంగ్లములోనికి క్రొత్త నిబంధనను తర్జుమా చేయదలచెను. అయితే ఆ దేశంలో అది సాధ్యం కానందున అతడు జర్మనీకి తప్పించుకొనిపోయి పని ప్రారంభించెను. కొలగ్నే అను పట్టణములో అధికారులు నూతన నిబంధన కాగితాలను అపహరించుట చూచినపుడు టిండేల్ దానిని అచ్చు వేయుటకు మరొక పట్టణమునకు పోవలసి వచ్చెను.

ఆలాగు అనేక శ్రమల మధ్య క్రొత్త నిబంధన మొదటి రెండు ముద్రణలను 1525 లో ముగించెను. ఆ పై వేల కొలది నూతన నిబంధనలు పెద్ద పెద్ద సంచులలో, మూటలలో కట్టి ఓడలపై ఇంగ్లాండు దేశమునకు పంపుటలో టిండేల్ విజయము సాధించెను. మతాధికారులు వాటిని కాల్చివేయు ఉద్దేశ్యముతో ఎంతో వెల చెల్లించి, దొంగచాటుగా కొనిరి. కాని ఆ డబ్బు మరిన్ని బైబిల్స్ ప్రింట్ చేయుటకు సహాయపడెను. అతడు ఒక నూతన నిబంధన గ్రంథమును అప్పటి రాణియగు "ఆనీ బోలన్"కు బహూకరించెను. ఆ గ్రంథము నేటికీ బ్రిటిష్ ప్రదర్శన శాలలో ఉన్నది. మత గురువులు అతనిపై పగబట్టి అతనిని చంపుటకు పన్నాగము పన్ని అతనిని బంధించి చెరసాలలో వేసిరి. టిండేల్ 15 నెలలు జైలులో గడిపెను. ఆ సమయములో కూడా అతడు తర్జుమా పనిని కొనసాగించెను.

చివరికి 1536 అక్టోబర్‌లో ఒక శుక్రవారమున ఆ చీకటి బిలము నుండి అతనిని వెలుపలికి తీసి గొంతు పిసికి, అతని శరీరము బూడిద అగు వరకు దహించిరి. అతడి చివరి మాటలు– "ప్రభువా! ఇంగ్లాండ్ రాజు నేత్రములు తెరువుము!" టిండేల్ తాను చనిపోవుటకు 10 సంవత్సరాల ముందే, "నేను తర్జుమా చేసిన క్రొత్త నిబంధన గ్రంథమును కాల్చిన మీరు ఒకరోజు నన్ను కూడా కాల్చెదరు. అయిననేమి నేను ఈ నూతన నిబంధన గ్రంథమును తర్జుమా చేయుటలో నా పనిని మానను" అనెను.

టిండేల్ చనిపోయిన తర్వాత కొన్ని సంవత్సరములకే ఇంగ్లాండ్‌లోని సాధారణ ప్రజలు కూడా వారి సొంత భాషలో బైబిలును కలిగి యుండే మార్గము ఏర్పడినది. టిండేల్ బైబిల్‌లోని 90% పదములు వంద సంవత్సరాల తర్వాత వెలువడిన "కింగ్ జేమ్స్" తర్జుమాలో కూడా కనబడినవి. క్రైస్తవ హతసాక్షి అనగా, క్రీస్తును త్యజించుట కంటె ఆయన కొరకు మరణించుటకే ఎన్నిక చేసుకొనుట; దేవుని రాజ్యము విస్తరింప చేయుటకై ప్రాణమును కూడా అర్పించుటకు తెగించుట! క్రైస్తవ సాక్ష్యము ఘోర శ్రమను భరించుట; మరణము వరకు నమ్మకముగా ఉండుట! ఆమేన్! ✝

(5)

# జాన్ నాక్స్

[1513-1572]



**పూర్తి పేరు:**
జాన్ నాక్స్

**జన్మస్థలం:**
స్కాట్లాండ్‌లోని గిఫోర్డ్ గేట్

**భార్య పేరు:**
మార్ జోరీ

**జననం:**
క్రీ.శ. 1513

**మరణం:**
1572 నవంబరు 24

**జీవించిన కాలము:**
59 సంవత్సరములు

**రక్షణానుభవం:**
25 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం:**
రోమన్ కేథలిక్ సంఘాన్ని సంస్కరించ గోరి, విగ్రహారాధనను ఖండించి ప్రజలు వాక్యాను సారంగా జీవించునట్లు చేసెను.

జాన్ నాక్స్ స్కాట్‌లాండ్‌లోని గిఫోర్డ్ గేట్ సందు 1513 వ సంవత్సరములో జన్మించెను. ఈయన తల్లిదండ్రులు ఇద్దరూ కేథలిక్కులు. వీరు తెలివైనవారు మరియు ధనికులు.

జాన్ నాక్స్ లాటిన్ మరియు గ్రీకు చదివెను. గ్లాస్గోలోని విశ్వ విద్యాలయములో 8 సంవత్సరములు చదివి M.A. డిగ్రీని సంపాదించెను. చదువు పూర్తికాగానే తత్త్వశాస్త్రమును బోధించు ఉపాధ్యాయుడుగా అదే కళాశాలలో పనిచేసెను. జాన్ నాక్స్ తన 25 వ సంవత్సరములో దేవుని సేవకు యాజకుడుగా నియమింపబడెను.

ఈ క్రొత్త పదవిలో ఇతడు స్కాట్‌లాండ్‌లోని రోమన్ సంఘము ఎంతగా పాడయ్యెనో చూడగలిగెను. బైబిలును ఎక్కువగా చదువుచుండెను. ఇట్లు 7 సంవత్సరములు గడిపెను. ఇతడు సంఘము యొక్క స్థితిని గుర్తించి, దానిలోని తప్పులను ఖండించవలెనని ఆశించెను గాని, అట్లు చేసిన తాను మరణమునకు

గురి కాగలనని గ్రహించి ఆ సంఘమును వదలిపెట్టెను. ఎక్కువ సమయం బైబిలు చదువుట యందును, ప్రార్థించుట యందును గడిపెను.

జాన్‌నాక్స్ ప్రభుని చిత్తము కొరకై ప్రార్థించు చుండెను. ఆ దినములలో జార్జి అను ఒక ప్రసంగీకుడు రోమన్ కేథలిక్ సంఘము యొక్క దుష్టత్వమును గూర్చి ఖండించుచుండెను. జాన్‌నాక్స్ అతనియొద్ద చేరి మరి అనేక సువార్త సత్యములను నేర్చుకొనుచుండెను. జాన్‌నాక్స్ సేవకునిగాను, సహాయకునిగాను జార్జికి తోడ్పడుచుండెను. అనేకసార్లు జార్జితో పాటు వెంట వెళ్ళెడివాడు. ఒకసారి జార్జిని పట్టుకొని కాల్చివేయుటకు తీసుకొనిపోయి చంపివేసిరి. ఆలాగు జార్జి క్రీస్తు కొరకు హతసాక్షి ఆయెను.

జాన్‌నాక్స్‌ను కూడా పట్టుకొనవలెనని ప్రయత్నించుచుండగా అతడు ఒక స్థలమునుండి మరియొక స్థలమునకు మారుచు చివరికి జర్మనీకి వెళ్ళవలెనని ఆశించెను గాని, అతని స్నేహితులు అక్కడే ఒక భవనములో ఉండమని కోరిరి. 1547 వ సంవత్సరములో తనతో కొందరిని తీసుకువెళ్ళి ఆ భవనంలో ఉండెను. అక్కడ కొన్ని కుటుంబముల వారికి చదువు చెప్పెడివాడు. అయితే తనను వెదకుచున్నారని తెలిసికొని ఆ భవనంలో ఉండుట శ్రేయస్కరం కాదని తన స్నేహితునితోపాటు సెయింట్ ఆంద్రూ అను స్థలమునకు వెళ్ళెను. అక్కడ కొద్ది రోజులలోనే అనేకులు వచ్చి ఆయన చెప్పెడివి వినెడివారు. వారికి జాన్‌నాక్స్ దేవుని వాక్యం బోధించెడివాడు. అంతే గాక ఆ ప్రజలకు స్కాట్‌లాండ్‌లోని భక్తి హీనతను గురించి, దేవునియొక్క పరిశుద్ధతను గూర్చి బోధించెడివాడు.

అంతవరకు బహిరంగంగా ప్రసంగించుటకు భయపడెడి జాన్‌నాక్స్ 30 సంవత్సరముల వయస్సులోకి రాగానే ధైర్యంగల ప్రసంగీకునిగా మారెను. కాని ఆయన ఎప్పుడూ మంచి ప్రసంగములు చేయుటకు ప్రయత్నించలేదు. అయితే "నేను దేవుని దగ్గరనుండి వచ్చిన ప్రవక్తను, నా దగ్గరనుండి తియ్యని మాటలు రావు. కఠినమైన మాటలే వచ్చును" అని అనెడివాడు. దేశములో హింసలు ఉండినప్పటికి నాక్స్ ఆ ప్రజలకు వారి దుష్టత్వమును గురించి, వారి పాపమును గురించి ఖండిస్తూ బోధించెడివాడు. దేవుని ఉగ్రత వారి మీదకు వచ్చునని హెచ్చరించెడివాడు. పశ్చాత్తాపపడి ప్రభువు దగ్గరకు రమ్మని బ్రతిమాలెడివాడు.

చివరకు స్కాట్‌లాండ్ దేశపు రాణి కూడా జాన్‌నాక్స్ బోధలకు కదిలించబడినను; పశ్చాత్తాపపడక నాక్స్‌ను, అతని అనుచరులను ఓడ ఎక్కించి ఫ్రాన్స్ దేశమునకు బహిష్కరించెను. అక్కడ నాక్స్‌ను సంకెళ్ళతో బంధించి జైలులో వేసిరి. అయినను జాన్‌నాక్స్ ఏ నరునికి భయపడకూడదని తీర్మానించుకొనెను.

మరియకు మ్రొక్కరాదనియు, విగ్రహారాధన తప్పనియు బోధించిన నాక్స్ దగ్గరకు రంగులు వేసిన ఒక విగ్రహమును తెచ్చి దానిని ముద్దు పెట్టుకొనమనిరి.

కాని అట్లు చేయుటకు అతడు నిరాకరించి, ఆ విగ్రహమును సముద్రములోనికి నెట్టివేసెను. 12 నెలల తర్వాత ఆ ఓడ యొక్క బానిసత్వం నుండి విడుదల పొంది మరల స్కాట్‌లాండ్‌కు వెళ్లుట మంచిది కాదని తెలుసుకొని ఇంగ్లాండుకు వెళ్ళెను. అచ్చట బహు జనులు గలిగిన అంగ్ల సంఘములో, అతనికి దేవుని వాక్యమందించు ఆధిక్యత దొరికెను. 1551 వ సంవత్సరమునకు జాన్‌నాక్స్ ఆరు సంఘములను చూచుకొనెడివాడు. తన 40 సంవత్సరముల వయస్సులో ఇతడు "మార్‌జోరీ" అను నామెను పెండ్లి చేసికొనెను. జాన్‌నాక్స్, రాజైన ఎడ్వర్డ్ IV కోర్టులో (రాజమందిరం) కూడా ప్రసంగించెడివాడు. ఎడ్వర్డు కూడా యితనికి స్నేహితుడయ్యెను. ఇతని సమ్మకత్వమును చూచి ఇతనికి ఇంగ్లాండులో మంచి నాయకత్వమును, సువార్తకు స్వేచ్ఛను కలిగించెను. కాని, 1553 వ సంవత్సరము జూలై మాసంలో యౌవనస్థుడైన ఎడ్వర్డు రాజు మరణించెను. తర్వాత "మేరీట్రూడర్" అనే ఆమె రాణి ఆయెను. ఆమె రాణి అయిన తరువాత జాన్‌నాక్సును నిర్లక్ష్యపెట్టి; అతనిని, క్రైస్తవులను హింసించడం మొదలు పెట్టెను. నాక్సు జీతమును కూడా తగ్గించివేసెను. ఆ హింసలలో ఇతని స్నేహితులలో కొందరు హతసాక్షులైరి.

తర్వాత స్కాట్‌లాండ్ వెళ్లెను. జాన్‌నాక్స్ తన దేశములోని ప్రజలలో మార్పును, వాక్యానుసారముగా జీవించుటను చూచి, ప్రభువును స్తుతించి, స్వేచ్ఛగా దేవుని వాక్యమును బోధించుటకు ఆరంభించెను. ఒకసారి జాన్‌నాక్స్ ప్రసంగించు చుండగా రాణియైన మేరీ, కొంతమంది స్కాట్‌లాండ్ బిషప్పులు కూడా వినిరి. కాని దేవుని ఆత్మ శక్తితో బోధించు ఆ బోధకు అడ్డు చెప్పలేకపోయిరి. తరువాత జాన్ గొప్ప జన సమూహములకు దేవుని వాక్యమును బోధించెను.

1560 లో జాన్‌నాక్స్ భార్య మార్‌జోరీ మరణించెను. జాన్‌నాక్స్ ఇద్దరు కుమారులు కూడా చిన్నతనములోనే మరణించిరి. జాన్‌నాక్స్ జీవితములో సమస్య తరువాత సమస్య, విచారము వెంట విచారము మరనేక కష్టములు ఎదురాయెను. కాని ఇతడు నిరుత్సాహపడక తాను చేయవలసిన దేవుని పనినే చేయుచున్నందులకు సంతోషించెను.

జాన్‌నాక్స్ మరల వివాహము చేసుకొనెను. 1570 వ సంవత్సరములో ఇతడు నడువలేని, వ్రాయలేని స్థితిలో ఉండెను. అందరూ ఇక జాన్‌నాక్స్ మరణించునని తలంచిరి. కాని ప్రభువు అతనికి నూతన బలమిచ్చి రెండు సంవత్సరములు ప్రసంగించుటకు కృపనిచ్చెను. 1572 వ సంవత్సరము నవంబరు నెలలో మరల జబ్బు పడి బహు బలహీనుడాయెను. ఇతడు మరణించే రోజున భార్యచే చాలా సేపు బైబిలు చదివించుకొని వినెను. చివరకు తన 60వ యేట 1572 నవంబరు 24వ తేదీ రాత్రి 11 గంటలకు వారు ప్రార్థించుటకు మోకరించగా జాన్‌నాక్స్ బహు శాంతి సమాధానములతో అతడు ప్రేమించి, సేవ చేసిన ప్రభువుతో ఉండుటకు వెళ్ళిపోయెను. †

# ⑥ జాన్ బన్యన్

[1628-1688]



**పూర్తి పేరు:**
జాన్ బన్యన్

**జన్మస్థలం:**
ఇంగ్లాండ్‌లోని బెడ్‌ఫోర్డ్

**తల్లిదండ్రులు:**
మార్గరెట్ బెంట్లీ, థామస్ బన్యన్

**భార్య పేరు:**
మేరీ

**జననం:**
1628 నవంబరు

**మరణం:**
1688 ఆగష్టు 31

**రక్షణానుభవం:**
25 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం:**
బైబిలు తరువాత బహుగా ప్రసిద్ధినొందిన 'యాత్రికుని ప్రయాణము' అనే పుస్తకమును రచించెను.

జాన్‌బన్యన్ ఇంగ్లండ్‌లోని బెడ్‌ఫోర్డ్‌లో నవంబరు 1628 వ సంవత్సరమున జన్మించెను. వారిది పేద కుటుంబము. అతని తండ్రి పేరు థామస్ జాన్, అతను పాత్రలు పోతపోయు కమ్మరి పనిచేసెడివాడు. జాన్‌బన్యన్ చిన్నప్పటి నుండి చాలా అల్లరి చిల్లరిగా తిరుగుచు అబద్ధములకు, దొంగతనములకు అలవాటయ్యెను. ఎక్కువ విద్యాభ్యాసము చేయలేదు గాని, చదవను, వ్రాయను మాత్రము నేర్చుకొనెను. 1644 లో ఆయన తల్లి మరణించెను. ఆ తరువాత ఒక నెలలోనే తన సహోదరి మార్గరెట్ చనిపోయెను. వారి మరణం తర్వాత అతని తండ్రి తిరిగి వివాహం చేసుకొనెను. తల్లి, చెల్లి మరణ వేదన; తండ్రి వలన ఆదరణ లేకపోవుటే గాక సవతి తల్లి వలన శ్రమలు- ఇవన్నీ, జాన్ బన్యన్‌ను దేవుని దూషించువానిగా చేసెను.

తన గృహములోను, హృదయములోను ఎటువంటి సమాధానము లేనందున సైన్యములో చేరి 2 సంవత్సరములు సైనికునిగా పనిచేసెను. సైన్యములో

ఉండగా ఒకసారి అతనికి నియమించబడిన డ్యూటీ మరియొకనికి నియమించి నందున జాన్ స్థలములో ఉండిన వ్యక్తి యుద్ధములో మరణించెను. దేవుడే ఏదో ఉద్దేశ్యముతో మరణము నుండి తనను తప్పించెనని గ్రహించెను. సైన్యము నుండి బయటకు వచ్చిన తర్వాత అతడు తన తండ్రి వృత్తియైన పాత్రలకు మాట్లు వేసి బాగుచేయు పనిని ప్రారంభించెను. ఆ తర్వాత మేరీ అను ఒక భక్తి కలిగిన పేద స్త్రీని వివాహం చేసుకొని పేదరికంలో ఉండెను. క్రమముగా తన భార్యతో దేవాలయమునకు వెళ్ళేవాడు. అయినను తన ఆధ్యాత్మిక జీవితంలో అభివృద్ధిలేక ఎల్లప్పుడు పాపపు తీర్పును గురించిన భయంతో జీవించుచుండెను. పుస్తకములను ఎక్కువగా చదివి తర్కిస్తుండేవాడు.

అయితే ఈలోగా కొందరు స్త్రీలు అయనకు రక్షణను గురించి తెలియజేసి "గిఫోర్డ్" అనే పాదిరిగారికి పరిచయం చేసిరి. ఆయన సువార్తను వివరంగా బోధించి కృప ద్వారా వచ్చిన రక్షణను గురించి తెలియజేయగా "బన్యన్" తాను క్షమించలేనన్ని పాపములు చేసితినని పశ్చాత్తాపపడి పాపములొప్పుకొని మారుమనస్సు పొందెను. మారుమనస్సు పొందిన తర్వాత కూడా ఆయనకు కష్టములు వచ్చెను. అయితే మునుపటివలె దేవుని దూషింపక, దుఃఖములో కూడా దేవుని పట్టుకొనెను. ఆయనకు అంధురాలైన కుమార్తె జన్మించినప్పటికీ, ఆ తరువాత కొద్ది కాలములోనే ఆయన భార్య మరణించినప్పటికీ, దేవునిపై నున్న విశ్వాసమును వీడక క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుచుండెను.

ఆ దినములలో ఇంగ్లాండ్ దేశములో అభిషేకించబడిన వారు తప్ప మరెవ్వరూ ప్రసంగించకూడదనే చట్టముండెడిది. అట్టివారు శిక్షించబడుదురు. అటువంటి చట్టమున్నదని జాన్ ఎరిగినప్పటికి "సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ" అని, మనుష్యుల కంటె దేవునికే విధేయులగుట మేలని ధైర్యముతో ప్రసంగించెను.

ఆయన ప్రసంగములు బలమైనవిగా ఉన్నందువలన గుంపులు గుంపులుగా జనులు ఆయన చెప్పే వాక్యం వినుటకు వచ్చుచుండిరి. బన్యన్ చిన్న బిడ్డవలె దేవునిపై ఆధారపడుచు, దేవుని హృదయము నుండి వచ్చిన మాటలను ప్రజలకు బోధించుచుండెను. ఆయన గృహములలోను, బహిరంగముగాను ప్రసంగించు చుండెను. అందుకై ఆయనను బంధించి చెరసాలలో ఉంచిరి. మరెన్నడు ప్రసంగించనని ప్రమాణము చేసిన యెడల విడుదల చేయుదుమని చెప్పిరి. కాని ఆ విధముగా ప్రమాణం చేయుటకు జాన్ నిరాకరించెను. పైగా ఈ దినము విడుదల చేసిన యెడల మరల రేపు ప్రసంగించెదను అనెను. మరియు దేవునికి

అవిధేయుడగుట కంటె చెరసాలలోనే నా కండ్లపై నాచు పెరుగువరకు చెరసాలలోనే ఉంటాను అనెడివాడు!

అందుకై అతనికి శిక్ష 12 సంవత్సరములకు పొడిగించబడెను. ఆ జైలు ఎంతో మురికిగాను, చీకటిగాను ఉన్నప్పటికీ, జైల్లో ఉన్న వారికి సువార్తను బోధించుచూ, వారితో ప్రార్థించెను. ఆ 12 సంవత్సరములు తన సమయమును ఏ మాత్రము వ్యర్ధ పరచుకొనక ప్రతి నిమిషము ప్రార్థనలోను, ధ్యానములోను గడిపెను. ప్రపంచములో గొప్ప పేరు పొందిన "యాత్రికుని ప్రయాణం" అను పుస్తకమును జైలులో వ్రాసెను. అనేక సంవత్సరములుగా ఉన్న ఆయన ఆశ నెరవేరెను. నాశనపురము నుండి పరలోకపురమునకు ఒక యాత్రికుని ప్రయాణములో గల శోధనలను, శ్రమలను, జయములను చక్కగా వివరించెను. ఆ పుస్తకము 100 కంటె ఎక్కువ భాషలలో తర్జుమా చేయబడెను. జాన్ తన 43 వ సంవత్సరములో జైలు నుండి విడుదల పొందెను. ఆ తరువాత "పరిశుద్ధ యుద్ధం" అను మరొక గొప్ప పుస్తకమును వ్రాసెను.

తర్వాత "బెడ్ ఫోర్డ్" లోని బాప్టిస్ట్ సంఘమునకు పాదిరిగా పని చేసి అనేక ఆత్మలను సంపాదించెను. అతని మరణ సమయానికి మరో ఆరు పుస్తకములను వ్రాసి ప్రింట్ చేసెను. మరి 16 పుస్తకములు ప్రింటు చేయుటకొరకు సిద్ధపరచెను. 1688 వ సంవత్సరములో ఆగస్టు 31వ తేదీన ప్రభువు నందు నిద్రించెను ఈ కల్వరి యోధుడు! †



జాన్ బన్యన్‌ను ఉంచిన బెడ్‌ఫోర్డ్ జైల్

# (7) జాన్ వెస్లీ

[1703-1791]



**పూర్తి పేరు :**

**జాన్ వెస్లీ**

**జన్మస్థలం :**

ఇంగ్లాండ్‌లోని ఎప్‌వర్తు

**తల్లిదండ్రులు :**

సామ్యూల్ వెస్లీ, సూసన్నా వెస్లీ

**జననం :**

1703 జూన్ 17

**మరణం :**

1791 మార్చి 2

**రక్షణానుభవం :**

35 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**

ఇంగ్లాండ్ దేశమంతటా ఉజ్జీవ జ్వాలలు రగుల్కొల్పి ఇంగ్లాండ్ దేశాన్ని క్రీస్తు కొరకు సంపాదించెను.

జాన్ వెస్లీ 1703 జూన్ 17 వ తారీఖున సామ్యూల్ వెస్లీ, సూసన్నా వెస్లీ అను దంపతులకు కలిగిన 19 మంది బిడ్డలలో 15 వ వాడిగా పుట్టెను. ఆ 19 మందిలో 10 మంది మాత్రమే బ్రతికిరి. వారిలో జాన్ వెస్లీ ఒకడు. వెస్లీ కూడా తన ఆరవ సంవత్సరములోనే భయంకరమైన అగ్నిప్రమాదములో మరణించవలసియుండెను. కాని, అతని కొరకు గొప్ప ఉద్దేశ్యములు కలిగిన దేవుని కృప అతనిని కాపాడెను.

వెస్లీ తండ్రి బోధకుడు. తల్లి చిన్న వయస్సు నుండి బిడ్డలను దేవుని భయభక్తులలో పెంచిన స్త్రీ. వెస్లీ దేవుని భయభక్తులయందును, జ్ఞానమందును పెరుగుచు, తన 15వ సంవత్సరములో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చేరి విద్యాభ్యాసము నందు ముందుకు సాగుచుండెను. తన 23 వ సంవత్సరానికి యం.ఏ. ముగించడమే కాక, లాటిన్, గ్రీకు, హీబ్రూ, ఫ్రెంచి మొదలగు భాషలలో ఆరితేరిన వాడాయెను.

వెస్లీ తల్లిదండ్రులు ఇతనిని సేవకు ప్రత్యేకించిరి. వ్యక్తిగతముగా వెస్లీ అపవిత్రమైన కార్యాలకు చోటివ్వనందున, తాను పరిశుద్ధుడననే అభిప్రాయమును కలిగియుండెను. తన తండ్రి పాస్టరు అయినందున తాను కూడా తన తండ్రి సేవలో కొనసాగవలెనని జాన్‌వెస్లీ తన్ను తాను సేవకు సమర్పించుకొనెను. ఉదయము, సాయంకాలము క్రమముగా బైబిలు చదువుకొనుటయు, చర్చికి వెళ్ళుటయు తన భక్తికి ఆధారమనుకొనుచుండెను. వ్యభిచారము, దొంగతనము మొదలగు అసహ్యాకరమైన పాపములు తాను చేయుటలేదు కాబట్టి, తాను మంచివాడనని అనుకొనుచుండెను. గాని, తన స్వనీతి, గర్వము, అవిశ్వాసము అనునవి రక్షణకు అడ్డుగా ఉన్నవని అతడు గ్రహించలేక పోయెను.

థామస్ ఏ. కేంపస్ వ్రాసిన 'క్రీస్తు అనుకరణ' అను పుస్తకమును చదివిన తరువాత వెస్లీ తన అభిప్రాయమును మార్చుకొని; బాహ్యాశుద్ధికంటె, అంతరంగ శుద్ధి ముఖ్యమని, నిజమైన భక్తి బహిరంగ క్రియలను చేయుట కాదుగాని అంతరంగములో ఉండవలసినదని గ్రహించి, దేవుని ముందు తన నీతి క్రియలు మురిగి గుడ్డలవంటివని గుర్తించెను. అయినను ఇంకనూ లోతైన రక్షణానుభవము పొందనివాడిగానే యుండెను. గనుక ఆయన పరిచర్యలో ఆత్మలు రక్షించబడుట చూడలేక పోయెను.

కాని, 1735 అక్టోబర్ 18వ తారీఖున జాన్‌వెస్లీ, అతని సహోదరుడైన ఛార్లెస్ వెస్లీ ఓడలో అమెరికాకు మిషనెరీలుగా ప్రయాణమైరి. ఆ ఓడలో భక్తి పరులైన మొరేవియనులు కొందరుండిరి. వారిలో ఒకరైన పీటర్ బోలర్‌గారు జాన్‌వెస్లీకి ఓడలో పరిచయమాయెను. ఆయన 'నీవు రక్షించబడితివా?' అని అడిగిన ప్రశ్నకు ఆశ్చర్యపడిన వెస్లీ 'నేను చిన్న వయస్సు నుండి పరిశుద్ధముగా యున్నాను. దేవుని సేవకు అర్పించుకున్నాను' అని చెప్పెను. "రక్షణ క్రీస్తు నందు విశ్వాసముంచుట ద్వారా వ్యక్తిగతముగా సంపాదించుకొనవలసిందేగాని మంచిగా బ్రతుకుటవలన వచ్చునదిగాద"ని ఆయన తెలియజేసెను. "యేసు క్రీస్తు లోకరక్షకుడని ఎరుగుట కాదు. గాని, యేసుక్రీస్తు నీ రక్షకుడైనాడా?" అన్న మరొక ప్రశ్న వెస్లీని కదిలించెను. "రెడ్ ఇండియన్లను రక్షించుటకు నేను అమెరికా వెళ్ళుచుంటిని. అయ్యో!! నన్నెవరు రక్షింపగలరు? విశ్వాసములేని నా దుష్ట హృదయము నుండి నన్నెవరు విడిపించగలరు?" అని పశ్చాత్తాపపడి లోతైన రక్షణానుభవమును 1738 మే 24 వ తేదీన పొందెను. ఆ తరువాత ఎక్కువగా ప్రార్థనలో గడుపుచు, ఆత్మల రక్షణార్థమై భారము పొంది, సేవ చేయుచుండెను.

ప్రార్థనలో అధిక సమయము గడుపుట వలన ఆయన సంపూర్ణముగా రక్షించబడెను; సేవలో ఆశీర్వాదము ప్రారంభమాయెను. ప్రతి దినము ఉదయం

నాలుగు గంటలకే లేచి ప్రార్థించుట మొదలు పెట్టెను. వీధులలోనికి వెళ్ళి ప్రసంగించుచుండగా అనేక వందల మంది పశ్చాత్తాపపడి ప్రభువువైపు తిరుగు చుండిరి. కుండపోతగా వర్షము కురియుచున్నను, లండన్ వీధులలో రెండు, మూడు గంటలసేపు ప్రసంగించుచున్నపుడు, ప్రజలు వర్షములో తడియుచున్నను, ఆసక్తితో దేవుని వాక్యమును వినుచుండిరి. పశ్చాత్తాపము, మారుమనస్సు, పాపక్షమాపణ గురించి నొక్కి చెప్పే ఆయన బోధను ఇష్టపడని క్రైస్తవ దేవాలయ ములు ఆయనను ఆహ్వానించకపోయినను, జాన్ వెస్లీ గుఱ్ఱముపై ప్రయాణము చేయుచు, వీధులలో ప్రసంగించుచు బలమైన వర్తమానముల ద్వారా అనేక బండ హృదయములను పగులగొట్టుచుండెను. జనులు పశ్చాత్తాపపడి పరివర్తన చెందుచుండిరి.

వెస్లీ చాలా కట్టుదిట్టములు, క్రమశిక్షణ కలిగినవాడు. వెస్లీ పరిచర్య అంతకంతకు విస్తరించి, ఇంగ్లాండు దేశములో ఉజ్జీవ జ్వాలలు రగులుకొనెను. ఆయన సహోదరుడైన ఛార్లెస్ వెస్లీ, జాన్ వెస్లీకి తోడుగా యుంటూ తన మధురమైన సంగీతము ద్వారా హృదయాలను స్పందింపజేసె భావయుక్తమైన పాటలతో అనేకులను పశ్చాత్తాపములోనికి నడిపించుచుండెను.

"లోకమే నా సేవాస్థలము" అనుచు, అనేక స్థలములలో ప్రయాణము చేయుచు, అనేక పట్టణములలో, గ్రామములలో రాత్రనక, పగలనక ప్రసంగించు చుండెను. ఆయన ప్రసంగములు బాణములవలె మనుష్యుల హృదయములలో దూరుచు, పశ్చాత్తాపమును కలిగించుచుండెడివి. ఆయన కూటములలో అనేకులు క్రిందపడి దొర్లుచు, వారి పాపములు ఒప్పుకొనుచు, కన్నీటితో ప్రార్థించుచు, విడుదల పొందెడివారు.

ఆయన చాలా కఠినుడుగాను, క్రమశిక్షణ కోరువాడుగాను ఉన్నప్పటికిని ఆయనలో ఉన్న సహనము, దీనత్వము అనేక ఆత్మలను సంపాదించుటకు సహాయపడెను. ఆయన ఇంగ్లాండులో మాత్రమేకాక, ఐర్లండు, అమెరికా, కెనడా మొదలగు దేశములలో కూడా సేవ ప్రారంభించెను. మెథడిస్టు సంఘస్థాపకుడు ఈయనే!

ఈయన ప్రతి మైలు ప్రయాణము వెనుక, ప్రతి ప్రసంగము వెనుక ప్రార్థన ఉండేది. ప్రసంగములోని ప్రతిమాట వెనుక కన్నీరు ఉండేది. అందువలననే కఠిన హృదయులు వీధి కూటములలో కూడా పశ్చాత్తాపపడి, కన్నీటితో సిలువను వెదకి రక్షింపబడెడివారు. జాన్‌వెస్లీ ధనాపేక్షకు ఎట్టి చోటివ్వక "డబ్బు-పెంట, పేడ; దానిని నేను వెదకను, ఆశించను; దాని కొరకు నేను ప్రయాసపడను" అంటూండేవాడు. ఆలాగే తన జీవిత దినములలో దేవుని పరిచర్యకు ఎంతో

డబ్బు ఖర్చు పెట్టెను గాని, డబ్బు దాచుకొనుటకు ప్రయత్నించలేదు. అలాగే ఆయన మరణించినప్పుడు ఆయన సొరుగులో కొన్ని చిల్లర డబ్బులు తప్ప ఆయన పేరున ఏ ఆస్తి లేకపోవుట కనుగొనిరి.

జాన్‌వెస్లీ సంవత్సరమునకు 30 పౌండ్లు సంపాదించినప్పుడు 28 పౌండ్లు ఖర్చు చేసుకొని, కష్టములో ఉన్నవారికి మిగిలిన 2 పౌండ్లు యిచ్చేవాడు. తద్వారా మరుసటి సంవత్సరము అతని ఆదాయము 60 పౌండ్లు అయినప్పుడు కూడా 28 పౌండ్లే ఖర్చు పెట్టుకొని; మిగిలినది దేవుని కొరకు, పేదల కొరకు వాడెను. మరుసటి సంవత్సరము 90 పౌండ్లు సంపాదించినను; 28 పౌండ్లు మాత్రమే తన కొరకు వెచ్చించుకొని, మిగిలినది దేవుని నామములో పేదలకిచ్చెను. నాలుగవ సంవత్సరము అతని ఆదాయము 120 పౌండ్లు అయినప్పటికి; తన ఖర్చుల కొరకు ఎప్పటివలె 28 పౌండ్లే ఉంచుకొని మిగిలినది దేవునికిచ్చెను. తన ఆడంబరములకు వినియోగించుకొనుటకో, తన జీవిత స్థాయిని పెంచుకొనుటకో ప్రయాసపడక; తన సంపాదనతో దేవుని మహిమపరచెను. "వీలైనంత వరకు ఆదా చేయి, ఆదా చేసినదంతా దేవుని కోసం ఖర్చు పెట్టు" అనెడివాడు.

జాన్‌వెస్లీ తన సేవలో 36 వ సంవత్సరము వరకు 2,250,000 మైళ్ళు గుఱ్ఱముపై పయనించి; 40,000 ప్రసంగములను చేసెను. అనేక సార్లు ఈయన మీటింగులలో 20,000 జనముండేవారు. ఈయన తన సేవా జీవితం 40 వ సంవత్సరమున సేవలో ప్రయాణించిన దూరము సరాసరి లెక్క చొప్పున రోజుకు 20 మైళ్ళు సంవత్సరానికి 8000 మైళ్ళు. ఈయన సంవత్సరమునకు 5000 సార్లు ప్రసంగించెడివాడు. సువార్త సేవకై 30,000 డాలర్లు తన సొంత ధననిధిలో నుండి వాడెను. ఈయన పది భాషలు నేర్చుకొనెను. ప్రతిరోజు ఉదయం 4 గంటలకు లేచి ప్రార్థించి 7 గంటలకల్లా ప్రసంగించటం మొదలు పెట్టేవాడు. "ప్రభువా! నీ కొరకు కాలిపోనీ గాని తుప్పుపట్టనివ్వవద్దు, నిష్ప్రయోజమైన జీవితము జీవింపనీయవద్దు" అని మాటిమాటికి ప్రార్థించెడివాడు. తన 83 వ యేట దినమునకు 15 గంటలకంటె ఎక్కువ వ్రాయలేకపోతినే అని చింతించెడి వాడట! తన 86 వ యేట దినమునకు రెండుసార్లకంటె ఎక్కువ ప్రసంగములు చేయలేకపోతినే అని సిగ్గు పడ్డాడట! తన 86 వ యేట ఉదయం 5.30 గంటల వరకూ పడుకోవాలని ఆశకల్గుతుందని బాధపడి, తన డైరీలో వ్రాసుకున్నాడు.

చివరికి జాన్‌వెస్లీ రష్యాలో సేవ చేస్తుండగా వచ్చిన తీవ్రమైన జ్వరము వలన 1791 మార్చి 2 వ తేదీన తన 88 వ సంవత్సరములో ప్రభువునందు నిద్రించెను. 'దేవుడు మనకు తోడుగా ఉన్నాడు' అనేవి ఈ కల్వరి యోధుని చివరి మాటలు. ✝

# (8) జార్జి విట్ ఫీల్డ్

[1715-1770]



**పూర్తి పేరు :**

**జార్జి విట్ ఫీల్డ్**

**జన్మ స్థలం :**

ఇంగ్లాండ్‌లోని గ్లోస్టర్

**జననం :**

1715 డిశంబరు 16

**మరణం :**

1770 అక్టోబరు 15

**రక్షణానుభవం :**

20 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**

**ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్ అమెరికా దేశములలో భారమైన హృదయంతో కన్నీటితో చేసిన ప్రసంగాల వలన సాతాను కోరల్లో ఉన్న అనేకులను రక్షణలోనికి నడిపించెను.**

జార్జి విట్ ఫీల్డ్ 1715 వ సంవత్సరములో డిశంబరు 16వ తేదీన ఇంగ్లాండులోని 'గ్లోస్టర్' అను ప్రాంతంలో జన్మించెను. ఈయన తల్లి ఒక పేరు పొందిన హోటల్‌కు యజమానురాలు, జార్జి యొక్క రెండేండ్ల వయస్సులోనే అతని తండ్రి చనిపోయెను. ఈయన తల్లి ఈయన పాస్టరు కావాలని కోరేది! కాని, జార్జి మనస్సు నాటకాల మీద ఉండేది. ఇతనికి గంభీరమైన మధురస్వరం ఉండేది.

జార్జికి ఆక్స్‌ఫర్డ్‌లో చదువుటకు సీటు దొరికినది. అక్కడకు వెళ్ళిన తరువాత ప్రార్థన చేసుకోవడం, పాటలు పాడటం, ఆలయానికి వెళ్ళడం అనే భక్తి అలవాట్లకు అలవాటు పడినాడు. ఉజ్జీవకర్త అయిన జాన్‌వెస్లీ సహవాసమునకు చెందిన వారితో తిరుగుచుండెడివాడు. 'క్రొత్త జన్మ పొందాలి' అనే సత్యం తెలుసుకొన్నాడు కాని, క్రొత్త జన్మ ఎలా పొందాలో తెలియక తనంతట తానే ఏవేవో ప్రయత్నాలు చేసెడివాడు. గనుక ఫలితం దొరకలేదు.

ఒక దినము క్రొత్త నిబంధనలోని సిలువ ధ్యానాలు చదువుచుండగా సిలువ వేయబడిన క్రీస్తు ఆయన కళ్ళముందు ప్రత్యక్షమాయెను. ఆయన హృదయములో ఒక అద్భుతము జరిగి పాపపు ఒప్పుకోలు కలిగినది. ప్రభువైన క్రీస్తును తన హృదయములోనికి ఆహ్వానించి నూతన జన్మ అనుభవమును పొందెను.

ఆ దినములలో చర్చ్ ఆఫ్ ఇంగ్లాండు వారు అభిషేకించనిదే ఎవరును ప్రసంగించకూడదు. జార్జి 20 సంవత్సరముల వయస్సుగలవాడే అయినప్పటికిని దేవుని ఏర్పాటును బట్టి 1736 లో జూన్ 20వ తేదీన జార్జి విట్ ఫీల్డ్‌ను 'డీకన్'గా అభిషేకించారు. జార్జి ఆ మొట్టమొదటి ఆదివారమే బయటకు వెళ్ళి అచ్చటి ఖైదీలకు ప్రార్థన జరిపి దేవుని వాక్యమును అందించెను. ఇట్లు పేదల యొద్ద అతని పరిచర్య ప్రారంభమాయెను.

అతి చిన్న వయస్సులోనే జార్జి చేసిన ప్రసంగాలు లండన్‌ను, అమెరికాను కదిలించెను. అనేకులు ఈయన ప్రసంగాలు విని ఆశ్చర్యపడి క్రీస్తును అంగీకరించి రక్షింపబడిరి. ఈయన ప్రసంగంలోని సారాంశం 'మరుజన్మ!' మారు మనస్సును గురించి నొక్కి చెప్పే ఈయన ప్రసంగాలు విని అనేక మంది పాష్టర్లు ఈయనను ఛీదరించుకొని ఈయనపై దుష్ప్రచారము చేయ మొదలు పెట్టిరి. అయినను, మారుమనస్సు పొందుచున్న వారనేకులు ఈయనను హత్తుకొనిరి.

అనేక చర్చిలు ఆయనకు మూయబడినప్పటికిని బహిరంగస్థలములలోను, వీధి మూలల్లోను సువార్తను ప్రకటించుచుండెను. ఇంచుమించు 20 వేల మంది వరకు ఈయన కూటములలో ఉండెడివారు. వారిలో అనేక మంది రక్షింపబడు చుండెడివారు. ఇంగ్లాండు, వేల్స్, స్కాట్లాండ్, అమెరికా దేశములలో ఈయన 35 సంవత్సరములు సేవ కొనసాగించెను. ప్రభువు కృప వలన మంచి ప్రసంగించు వరమును పొంది, ఇంగ్లాండులోని గొప్ప ప్రసంగీకులలో ఒకడిగా పేరు పొందినవాడయ్యెను.

ఈయన లోతైన ఆధ్యాత్మిక జీవితమును, భక్తిని కలిగినవాడు. ఈయన ప్రసంగములు అగ్నిబాణములవలెను; ఉరుములు, మెరుపులవలెను; వర్షపు జల్లులవలె గద్దింపులతోను, ప్రేమ– ఆదరణలతోను నిండియుండెడివి. సాతానుకు సంతగా ఉన్న స్థలంలో, సింహంలాగా గర్జిస్తూ సాతానుకోరల్లో చిక్కుబడియున్న వెయ్యి ఆత్మలకు పైగా ఒక్క దినాన్నే ప్రభువు దగ్గరకు ప్రార్థన ద్వారా తేగలిగినాడు, ప్రార్థనాపరుడైన ఈ జార్జి విట్ ఫీల్డ్.

1748 లో అతని ఆరోగ్యం దెబ్బతిని, గుండెపోటువలన బలహీనుడై నప్పటికిని ప్రసంగాలు చేయటం మానలేదు. రాత్రనక, పగలనక ప్రయాణాల వలన అతని శరీరం కృశించుచుండెను. గాని, కన్నీటితో అతను చేసే ప్రసంగాలు అనేకులను కదిలించేవి. తమను జార్జి పట్టలేనంతగా ప్రేమిస్తున్నాడని అతని ప్రసంగం వినేవాళ్ళకు అర్థమయ్యేది. చెంపలు కన్నీటితో తడవకుండా, తన ఎదుట నున్న మనుష్యుల కోసం వెక్కి వెక్కి ఏడవకుండా ప్రసంగం చేయలేకపోయేవాడు ఈ ప్రేమాపూర్ణుడైన జార్జి విట్ ఫీల్డ్.

"నేను ఏడుస్తున్నానని నన్ను విమర్శిస్తున్నారెందుకు? నాశనానికి సిద్ధంగా ఉన్న మీ ఆత్మల విషయం మీరు ఏడవకుండా ఉన్నప్పుడు నేను మీ గురించి ఏడవకుండా ఎలా ఉండగలను? ఏమో! ఒక వేళ మీరు వింటున్నది మీ బ్రతుకులో చివరి ప్రసంగమేమో!! అయినను మీరు ఇంకా చలించకుండా ఉండటం చూచినపుడు, నేను రోదించకుండా ఉండలేను" అనేవాడు.

"రాత్రింబగళ్ళు యేసుప్రభువు నన్ను తన ప్రేమతో నింపుచున్నాడు. యేసు ప్రభువు ప్రేమను నేను తలంచునపుడు మూగవాడినైపోవుచున్నాను. నేనెల్లపుడూ పరిశుద్ధాత్మ ఆదరణలో నడుచుచున్నాను" అని ఆయన డైరీలో వ్రాసుకొనెను. సంవత్సరముల తరబడి విట్‌ఫీల్డ్ భారమైన సేవలో విశ్రాంతి లేక కొనసాగు చుండెను. ఆయనకు ప్రసంగముల మధ్య ఉన్న కొద్ది ఖాళీ సమయమును ప్రయాణము చేయుటలోను, నడుచుటలోను, ప్రసంగములను సిద్ధపరచు కొనుటలోను వాడెడివాడు. మనుష్యుల ఆధ్యాత్మిక అవసరతలను తీర్చుటకు, వ్యాధిగ్రస్థులను ఆదరించుటకు అనేక ఉత్తరములు వ్రాయుచుండెడివాడు; వారికొరకు ప్రార్థించు చుండెడివాడు.

"తుప్పు పట్టడంకంటె, అరిగిపోవడం మేలు" అంటూ ఎంత అనారోగ్య వంతుడౌతున్నా, తాను మరణించే రాత్రివరకూ బోధించడం మానలేదు. "నాకు వేయి జన్మలు, వేయి శరీరాలు ఉంటే ఎంత బాగుండును! వేయి నోళ్లతో క్రీస్తును ప్రకటించేవాడిని" అనేవాడు. "ఈ యాత్ర ఎంత కాలం సాగితే, అంత దూరందాకా ప్రజల్ని మేల్కొలుపుతాను" అంటూ ఆఖరిశ్వాస వరకు ప్రభువు కొరకే ప్రయాసపడి తన 56 వ ఏట అనగా 1770 వ సంవత్సరము అక్టోబర్ 15వ తారీఖు రాత్రి తన ప్రాణాన్ని అప్పగించెను ఈ కల్వరి యోధుడు జార్జి విట్ ఫీల్డ్. ✝

# (9) డేవిడ్ బ్రెయినార్డ్ [1718-1747]



**పూర్తి పేరు :**
డేవిడ్ బ్రెయినార్డ్

**జన్మ స్థలం :**
అమెరికా సంయుక్త రాష్ట్రాలు
(కనెక్టికట్ రాష్ట్రంలోని హద్దామ్)

**తల్లిదండ్రులు :**
హిజ్కియా బ్రెయినార్డ్ దంపతులు

**జననం :**
1718 ఏప్రిల్ 20

**మరణం :**
1747 అక్టోబరు 9

**రక్షణానుభవం :**
21 సం॥ల వయస్సులో (1739 జూలై 12)

**సేవా ఫలితం :**
అనేక శ్రమలను సహించి, ఎంతో క్లిష్ట పరిస్థితులలో కీకారణ్యములలో ఉన్న రెడ్ ఇండియన్ల మధ్య గొప్ప త్యాగపూరిత. సేవ చేసి అనేకులకు మార్గదర్శి ఆయెను.

డేవిడ్ బ్రెయినార్డ్ అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1718 వ సంవత్సరము ఏప్రిల్ 20 వ తేదీన జన్మించెను. చిన్న వయస్సు నుండి ఆత్మను గూర్చి, మరణానంతర జీవితమును గూర్చి ఆలోచించెడివాడు. తన హృదయంలో నిత్య సంతోషము ఉండవలెనని, మరణిస్తే పరలోకము చేరవలెనని ఆశించెడివాడు.

తొమ్మిదేండ్ల వయస్సులో తన తండ్రిని, పదునాల్గేండ్ల వయస్సులో తన తల్లిని పోగొట్టుకొని అనాథ అయిన డేవిడ్ నిరాశ్రయుడై కృంగియుండెను. కాని చెడు స్నేహమునకు దూరముగా ఉండి రహస్య ప్రార్థనలో, బైబిలు చదవడంలో ఎక్కువ సమయం గడపటం అలవాటు చేసుకొనెను. తన 21వ ఏట లోతైన మారుమనస్సు పొంది తన స్వనీతిని బట్టికాక దేవుని కృపవల్లనే రక్షింపబడితినని చెప్పుచుండెడివాడు.

డేవిడ్ బ్రెయినార్డ్ మంచి ప్రార్థనా పరుడు, అత్యంత ప్రతిభావంతుడు. ప్రార్థనాపరుడైన బ్రెయినార్డ్‌ని కాపరిగా ఉండమని అనేక సంఘాలు ఆహ్వానించాయి. గాని తాను రెడ్ ఇండియన్స్‌కు యేసుక్రీస్తు ప్రేమను తెలియ పర్చాలని నిశ్చయించుకొని, కీకారణ్యాల్లో జొరబడి ప్రయాణము చేస్తూ ఎంతో ప్రయాసతో వారిని చేరుకొన్నాడు. నరమాంస భక్షకులైన ఆ అనాగరికులను యేసువైపు త్రిప్పుటకు అమెరికా కీకారణ్యాల్లో ఏకైక విశ్వాస వీరుడుగా వెళ్ళి, రేయింబగలు వారి కొరకు కన్నీటితో ప్రార్థిస్తూ, సువార్త ప్రకటించ పూనుకొన్నాడు.

తన భాష వారికి, వారి భాష తనకు తెలియక పోయినను దిగులుపడక ప్రార్థించెను. అప్పుడు బ్రెయినార్డ్‌కు త్రాగుబోతు, విగ్రహారాధికుడైన ఒకడు అనువదించుటకు దొరికెను. అతని సహాయంతో యేసు ప్రేమను గురించి బోధించు చుండగా కొన్ని దినములలోనే ఆ త్రాగుబోతు, తాను పాపినని పశ్చాత్తాపపడి మార్పు చెందెను. ఆ తరువాత అనేకులు క్రీస్తు ప్రేమను గుర్తించి మారిరి. వారి క్రూర స్వభావాలను, నీచాతి నీచమైన కార్యాలను విడిచిపెట్టి యేసు ప్రభువును నమ్ముకొనిరి.

కీకారణ్యములో నివసిస్తున్న బ్రెయినార్డ్ ఒక రొట్టెముక్క కోసం పది లేక పదిహేను మైళ్ళు గుఱ్ఱంపై ప్రయాణం చేయవల్సి వచ్చేది. అనేకసార్లు ఆ రొట్టెలు బూజు పట్టో, గట్టి పడిపోయో ఉండేవి. క్రీస్తు కొరకు శ్రమ అనుభవించుట భాగ్యమని ఎంచుకొనిన బ్రెయినార్డ్ అటువంటి రొట్టెలతో కాలం గడుపుకొని సరైన మంచినీళ్లు కూడా దొరకనందున గుంటలలోని మురికినీళ్ళే త్రాగుచు, చిన్న బల్లచెక్కపై గడ్డిపరుచుకొని పండుకొనేవాడు. అచ్చట తన్ను అర్థం చేసుకొనే స్నేహితులు, బలపరచే మిత్రులు లేనందున కొన్నిసార్లు ఎంతో కృంగిపోయేవాడు. గాని దేవుని సన్నిధిలో నాకు ఆదరణ ఉన్నదని తన సమయాన్ని ప్రార్థనలో గడిపేవాడు. ఇలాంటి శ్రమల మధ్యలో ఆయన చేసిన పరిచర్య ఫలించెను. అనేక ఆత్మలు రక్షించబడ్డాయి. డేవిడ్ బ్రెయినార్డ్ తన డైరీలో, ఆత్మలకొరకు తాను పడిన వేదన, దేవుని సన్నిధిలో చేసిన ఉపవాస ప్రార్థనలు, దేవుడు చేసిన అద్భుతములను గురించిన అనేక సంగతులను వ్రాసి ఉంచుకొన్నాడు.

అవి చదివిన వారికి ఈనాటికి ఆయన సేవా జీవితం సవాలుకరంగా ఉన్నది. ఈయన సేవ యుద్ధం లాంటిది. సాతాను ఉచ్చుల్లో ఉన్న మనుష్యులను విడిపించుటకు ప్రాణాలు లెక్క చేయక యుద్ధ వీరుడిలా పోరాడెను. ఈయన మాటలలో, చేతలలో బహిరంగంగాను, వ్యక్తిగతంగాను రాత్రింబగళ్లు ఆత్మల సంపాదన కొరకు ప్రయాసపడెను.

జోనాథాన్ ఎడ్వర్డ్సుగారు ఆయన్ని గూర్చి ఇలా అన్నారు. "విజయవంతమైన సేవను ఆశించే వ్యక్తులకు ఆయన మార్గదర్శి. యుద్ధభూమిలో విజయం కోసం పోరాడే యోధుడిలా ఆయన పోరాడాడు; గొప్ప బహుమానాన్ని అందుకోవడానికి శాయశక్తులా పరుగెత్తే ఓ పందెగాడిలా ఆయన పరుగెత్తాడు; క్రీస్తు కోసం, ఆత్మల కోసం తపించిపోయి, ఆయన చేసిన కృషి, ప్రయాసలు ఇంతంతా అని చెప్పలేము! మాటలలో, చేతలలో బహిరంగంగా, వ్యక్తిగతంగానే గాక రాత్రింబవళ్ళు ప్రార్థనలో పోరాడేవాడు. ఆయన ఆశయమంతా తాను ఎవరి వద్దకయితే పంపబడ్డాడో వాళ్ళు క్రీస్తు రూపంలోనికి మార్చబడాలని! పట్టువిడువని ప్రార్థనాపరుడైన యాకోబుకు వారసుడిలా రాత్రంతా పట్టువిడువకుండా అనేక రాత్రులు పోరాడిన మహనీయుడు డేవిడ్ బ్రెయినార్డ్!"

తన ఆరోగ్యముకన్నా అన్యజనుల రక్షణకు ప్రాధాన్యతనిచ్చి శరీర ఆరోగ్యము విషయమై జాగ్రత్త తీసుకొననందున అసలే బలహీనుడైన బ్రెయినార్డ్ వ్యాధిగ్రస్థుడయ్యెను. అయినను ఆత్మలను రక్షించాలనే భారముతో పరిచర్యను కొనసాగించుచు- "అయ్యో నేను దేవునికొరకు ఎక్కువ సేవ చేయలేక పోతిని; నాకు వెయ్యి ఆత్మలుండినచో వాటిని దేవుని కొరకై సమర్పించి యుందును" అని విలపించెను. అయితే బ్రైనార్డ్ తన 29 సంవత్సరముల వయస్సులోగా చేసినది నాలుగు సంవత్సరముల సేవయే అయినా, డెబ్భై సంవత్సరములు జీవించి చేసిన సేవకంటె ఎక్కువ సేవ చేసెనని అంచనా వేయబడినది. డేవిడ్ బ్రెయినార్డ్ "నేనెంత బలహీనుడనైనా, ఎన్ని శ్రమల నెదుర్కొన్నా, నా మరణము వరకు అనేకులను ప్రభువు దగ్గరకు నడిపించగలిగితే అదే నాకు పది వేలు" అని తన డైరీలో వ్రాసుకొన్నాడు. తరువాత బ్రెయినార్డ్ మరణ పడకపై యున్నపుడు తన దగ్గరున్న వారిని పిలిచి, 122వ కీర్తన చదివించుకొనెను.

చివరికి బ్రెయినార్డ్ 1747 వ సంవత్సరము అక్టోబర్ 9వ తేదీ శుక్రవారము నాడు సరిగ్గా సూర్యుడు ఉదయించువేళకు- 'యేసు వచ్చును, ఆయన ఆలస్యము చేయడు, నేను త్వరలో మహిమలో నుందును; దేవదూతలతో కలిసి దేవుని మహిమ పరతును" అని పలుకుచు తన 29వ యేటనే పరమ ప్రభువు సన్నిధానానికి వెళ్ళిపోయెను. ఈయన జీవితకాలము కొద్దియైనప్పటికి తన జీవితములో గొప్ప సేవను చేసెను. ఆ తరువాత అనేకులు ఆయన డైరీ చదివి ప్రేరేపించబడి, ఆ రెడ్ ఇండియన్ల మధ్య పరిచర్య చేసిరి. కాబట్టి బ్రెయినార్డ్ రెడ్ ఇండియన్ల రక్షణ విషయంలో ఒక పునాది రాయిగా చరిత్రలో మిగిలిపోయాడు. ✝

# (10) విలియం కేరీ

[1761-1834]



**పూర్తి పేరు :**
**విలియం కేరీ**
**జన్మ స్థలం :**
ఇంగ్లాండ్‌లోని నార్త్ యాంస్టన్ షైర్ సమీపంలో గల 'పాలెర్సపురి' అనే గ్రామం
**తల్లిదండ్రులు :**
ఎడ్మండ్, ఎలిజబెత్
**జననం :**
1761 ఆగష్టు 17
**మరణం :**
1834 జూన్
**రక్షణానుభవం :**
18 సం॥ల వయస్సులో
**సేవా ఫలితం :**
**భారతదేశంలోని అనేక భాషలలో బైబిలును తర్జుమా చేయించెను. మన దేశంలో మొట్ట మొదటిసారిగా ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేసి బైబిలును మొదటిగా ప్రింట్ చేయించెను. బెంగాలీ భాషకు లిపిని ఏర్పరచి, మరనేక భాషలలో నిఘంటువులను తయారు చేసెను.**

విలియం కేరీ 1761 వ సంవత్సరము ఆగష్టు 17వ తేదీన ఇంగ్లాండులోని 'నార్త్ యాంస్టన్‌షైర్' అను ఒక మారుమూల గ్రామములో ఒక పేద కుటుంబములో జన్మించెను. ఈయన వారి తల్లిదండ్రులకు జన్మించిన ఆరుగురిలో ఒకడు. కేరీ యదార్థపరుడైన తండ్రిని, బిడ్డల పట్ల బహు శ్రద్ధ వహించెడి అవ్వను కలిగి యుండెను.

విలియంకేరీ బాల్యము నుండే పక్షుల యెడల, వృక్షముల యెడల శ్రద్ధ కలిగి వాటిని తన గదిలో చేర్చి పెట్టుకొనుచుండెను. 12 ఏండ్ల ప్రాయములో ప్రయాణములనిన బహు ప్రీతి కలిగియుండి కొలంబస్‌ను ఆదర్శంగా తీసుకొని సాహస కృత్యములు చేయుటకు ఆశించేవాడు. తన కుటుంబము యొక్క పేదరికమును బట్టి పాఠశాలను విడిచి, వ్యవసాయము చేయుట ప్రారంభించినను,

చివరకు చెప్పులు కుట్టు పనిని నేర్చుకొనెను. అలాగు చెప్పులు కుట్టుచు లాటిన్, గ్రీక్, హిబ్రూ భాషలను కూడా తన ఖాళీ సమయంలో నేర్చుకొనెను. ఒక వ్యక్తి తిరిగి జన్మించని యెడల పరలోక రాజ్యంలో ప్రవేశింపలేడన్న సువార్తను తన స్నేహితుడైన 'జాన్‌వార్' వ్యక్తిగత సాక్ష్యము ద్వారా వినెను. తాను పని చేయుచున్న చెప్పుల దుకాణము మేనేజరు దగ్గర ఒక షిల్లింగు నాణెము దొంగిలించి పట్టబడెను. బహిరంగముగా అవమానమునకు గురిచేసిన ఆ సంఘటన హృదయ పరివర్తనకు, పాపపు ఒప్పుకోలుకు దారి తీసెను. 1779 లో అనగా తన 18వ ఏట దేవా! నన్ను మార్చు; నేను దౌర్భాగ్యుడను, దిక్కులేనివాడిని! దయాళుడవైన నీ చెంత చేరియున్నాను. నీవే నా రక్షకుడివి!" అని కన్నీటితో సుంకరివలె పశ్చాత్తాపపడి, యేసు ప్రభువు యొద్ద ప్రార్థించి, ఆయనను తన సొంత రక్షకునిగా అంగీకరించెను.

రక్షించబడిన తరువాత దేవుని రాజ్యవ్యాప్తియే నా లక్ష్యమంటూ, తన జీవితమును దేవునికి అంకితం చేసి, పగలు పాఠశాల నడుపుచు, రాత్రులు చెప్పులు కుట్టుకొనుచు, ఆదివారములు ఆలయములలో ప్రసంగించుట ప్రారంభించెను. అంతటితో తృప్తి చెందక తోలుతో ప్రపంచ పటములు చేసుకొని, ప్రపంచము కొరకు విజ్ఞాపనము చేయుచుండెను.

1779 వ సంవత్సరములో మిషనెరీ జీవితమునకు తన్ను తాను సమర్పించుకొని, సువార్త ప్రకటించబడని దేశముల కొరకు ప్రార్థించుచు వచ్చెను. ఆయన మిషనెరీగా వెళ్లాలనుకొన్నప్పుడు ఎన్నో నిరాశలు, నిస్పృహలు కలిగినను; పట్టువిడువక తన 33వ ఏట అతిక్లిష్ట పరిస్థితులలో మిషనెరీగా మన దేశమునకు వచ్చెను. 1793 జూన్ 13వ తేదీన ఒక డచ్ దేశపు ఓడలో ప్రయాణమై 1793 నవంబరు 11 వ తారీఖున కలకత్తా చేరుకొనెను.

తోలుతో ప్రపంచ దేశ పటములను చేసుకొని ప్రార్థించిన ఆ పటములలో ఒకటైన మన హిందూ దేశమునకు మిషనెరీగా ప్రభువు ఆయనను ఎన్నుకొనెను. కలకత్తాకు సమీపంలో ఉన్న సిరంపూరులో ఆయన బసచేసి, అక్కడ ఒక ఫ్యాక్టరీలో చిన్న పని చేస్తూ మన దేశ భాషలైన బెంగాలీ, సంస్కృతము, మరాఠీ, హిందుస్థానీ, తెలుగు, పర్షియాభాషలు నేర్చుకొని; భాషాప్రవీణుడై సంస్కృతము మొదలగు భాషలకు వ్యాకరణము కూడా వ్రాసెను. అయిదు సంవత్సరములు ప్రయాసపడి బెంగాలీ భాషకు లిపిని ఏర్పరచి, క్రొత్త నిబంధనను బెంగాలీ భాషలోనికి అనువదించెను.

అడుగడుగున అనేక పోరాటములు కలిగినను; పట్టు విడువక "దేవుని యొద్ద నుండి గొప్ప కార్యములను ఎదురుచూడు, దేవుని కొరకు గొప్ప కార్యములను తలపెట్టు" అంటూ ముందుకు కొనసాగినవాడు విలియంకేరీ.

ఈ విలియం కేరీ గొప్ప సాహసి, బహుభాషా ప్రవీణుడు, ప్రజ్ఞావంతుడు, విజ్ఞానవేత్త, సంఘసంస్కర్త, నిరాడంబరజీవి, త్యాగమూర్తి; అన్నిటికంటె ముఖ్యముగా ఆత్మల రక్షణార్థమై ప్రయాసపడి అనేకులను ప్రభువువైపు త్రిప్పిన ఆత్మల జాలరి. బైబిలు గ్రంథమును మన దేశములోని అనేక భాషలవారి చేతులలో పెట్టిన మహానుభావుడు. భారతీయుల ద్వారానే భారత దేశమును క్రీస్తు కొరకు సంపాదించగలమని; స్వదేశ సువార్తికులకు, సంఘ కాపరులకు తర్ఫీదునిచ్చుట ఆవశ్యకమని; నేటి వరకు నిలిచియున్న సిరంపూర్ విశ్వవిద్యాలయమును స్థాపించిన ఘనత ఆయనకే దక్కెను. అయినను ఆయన మరణపడకపై యున్నపుడు "నేను చనిపోయిన తరువాత నా రక్షకుని గురించే మాట్లాడండి, నా గురించి కాదు" అంటూ యేసుప్రభువును ఘనపరచిన నిరాడంబరజీవి.

వ్యక్తిగత భక్తి సువార్తికునికి మూలాధారమైయున్నది. మిషనెరీకి ప్రాంతీయ భాషా పరిజ్ఞానము, సామర్థ్యము, మృదుత్వము, శాంత గుణం అవసరం! వీటి ద్వారా ఆత్మలను సంపాదించవచ్చు! దేవునికి తన్ను తాను సమర్పించుకొన్న హృదయము అన్ని తలాంతుల కంటె అమూల్యమై యున్నది. అప్పుడే దేవుడు మానవులను పాప విముక్తులను చేయు మహోజ్వలోద్యమంలో పరికరములుగా మనలను వాడుకొనగలడని కేరీ యొక్క దృఢ నమ్మకం!

1793 లో ఇండియాకు వచ్చిన విలియం కేరీ, 1834 జూన్ వరకు అనగా తన మరణము వరకు 41 సంవత్సరములు మన దేశములో మిషనెరీగా పనిచేసెను. తన కుమారుడు చనిపోయినను, తన భార్య మరణించినను; తన ముఖ్య స్నేహితులను, చివరికి ప్రమాదములో తనకాలును పోగొట్టుకొనినను; ఒక్కసారైనా తన మాతృదేశమునకు వెళ్ళి విశ్రాంతి తీసుకొనుటకు ఆశించినవాడు కాడు ఈ గొప్ప త్యాగమూర్తి.

"నిస్సహాయమైన మంటి పురుగువంటి దౌర్భాగ్యుడను. నీ కరుణ హస్తాలలో విశ్రమించుచున్నాను" అను మాటలు తన సమాధిపై వ్రాయమని కోరుకొని తన 73వ సంవత్సరములో ఈ లోకమును విడిచెను దీనుడైన ఈ విలియంకేరీ. ✝

ఏడు సంవత్సరముల కృషి తరువాత కృష్ణపాల్ అను ఒక వ్యక్తిని ప్రభువు కొరకు సంపాదించి, గంగానదిలో బాప్తిస్మమిచ్చెను. ఆ తరువాత అనేకులు క్రీస్తును రక్షకునిగా అంగీకరించి, బాప్తిస్మము పొందుచుండిరి. ఈలాగు ప్రభువు ఆయనను దీవించుచుండగా 1800 సంవత్సరములో సిరంపూరులో ఒక కళాశాలను ప్రారంభించెను. విలియం కేరీ కలకత్తాలోని 'ఫోర్ట్ విలియం' కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ సంస్కృతము, బెంగాలీ, మరాఠి భాషలను 30 సంవత్సరములు బోధించెను.

మన దేశమునకు మొట్టమొదటిగా ప్రింటింగ్ ప్రెస్‌ను, పేపరు మిల్లును దిగుమతి చేసినవాడు ఈయనే! మన దేశములో మొట్టమొదట ప్రింట్ అయిన పుస్తకము బైబిలు గ్రంథము. దీనికి కారణము విలియంకేరియే! ఈయన జీవిత దినములలో మన దేశ భాషలలోని 24 భాషలలో పూర్తి బైబిలును, 40 భాషలలో క్రొత్త నిబంధన గ్రంథమును తర్జుమా చేసి, ప్రింట్ చేయించినాడు. అంతేకాదు, బెంగాలీ, సంస్కృతము, మరాఠీ, తెలుగువంటి భాషలలో నిఘంటువులను, వ్యాకరణ గ్రంథములను రచించి, ముద్రించినాడు. ఈనాడు మన హస్తములలో ఉన్న తెలుగు బైబిలు ఆయన కృషి ఫలితమే!

ఆనాటి సమాజములో ఉన్న బాల్య వివాహములు, సతీసహగమనము, శిశుబలులు మొదలగు మూఢాచారములను అరికట్టుటకు రాజా రామ్‌మోహన్ రాయ్ వంటి వారితోపాటు కృషిచేసి, ఆనాటి ప్రభుత్వమును ఒప్పించి 1829లో ఆ దురాచారములను రూపుమాపుటే కాక వారికి సువార్త అందునట్లుగా చేసినవాడు ఈ విలియంకేరీయే!

ఈయన మిషనెరీగా ఎన్నో కష్టనష్టములను ఎదుర్కొని ఓర్చుకొనెను. తర్జుమా చేసి ప్రింటింగ్‌కు సిద్ధమైయున్న బైబిల్ భాగములన్నియు ప్రెస్‌కు నిప్పంటుకొని కాలిపోయినప్పటికి నిరుత్సాహపడక, తిరిగి వాటినన్నిటిని మరల తర్జుమా చేసి ప్రింట్ చేయించెను. ఆ దినములలోని ఈస్ట్ ఇండియా కంపెనీవారు ఎంతో వ్యతిరేకముగా ఉన్నను; తన కుటుంబ సభ్యులు, కొన్ని క్రైస్తవ సంస్థలు ఆయనతో ఏకీభవించి సహకరించకపోయినను; హిందూదేశ పరిస్థితులు, మూఢా చారములు ఎంతో ఆయాసమును కలిగించినను; ఆయన పరిచర్య ప్రారంభంలో మొదటి ఏడు సంవత్సరములలో ఒక్క ఆత్మను కూడా సంపాదించలేక పోయినను;

# (11) అథోనీ రామ్ జడ్సన్ [1788-1850]



**పూర్తి పేరు :**
అథోనీ రామ్ జడ్సన్

**జన్మస్థలం :**
మాసా చూసెట్సులోని 'మాలిన్'

**భార్య పేరు :**
ఆనీ హాజల్ టైన్

**జననం :**
1788 ఆగష్టు 9

**మరణం :**
1850 ఏప్రిల్ 12

**రక్షణానుభవం :**
20 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
అనేక బాధ, శ్రమల మధ్య బర్మా దేశంలో సువార్త ప్రకటించి, బర్మా భాషలోనికి బైబిలును తర్జుమా చేసి చివరికి అక్కడే జలసమాధి ఆయెను.

అథోనీరామ్ జడ్సన్ 1788 వ సంవత్సరము ఆగష్టు నెల 9 వ తేదీన మాసాచూసెట్సులోని 'మాలిన్' లో జన్మించెను. జడ్సన్ చిన్న వయస్సు నుండి మంచి నాగరికత, సంస్కృతి కలిగిన వాతావరణంలో పెరిగెను. జడ్సన్ తల్లి దండ్రులు భక్తి కలిగినవారు, సంస్కారవంతులు. జడ్సన్ 3 ఏండ్ల వయస్సులోనే బైబిల్ చదవడం నేర్చుకొనెను. నాలుగేండ్ల వయస్సులోనే తన చుట్టూవున్న పిల్లలను చేర్చుకొని బోధించుట మొదలు పెట్టెను. 10 ఏండ్ల వయస్సులో గణితశాస్త్రము, లాటిన్, గ్రీకు భాషలలో పాండిత్యము పొంది వేదాంత గ్రంథాన్ని పఠించెను.

గాని 19 ఏండ్ల వయస్సులో కళాశాలలో చదువుచున్న రోజులలో ఒక నాస్తికునితో స్నేహం ప్రారంభమాయెను. ఆ నాస్తికుని స్నేహ ప్రభావమువల్ల జడ్సన్‌కు దేవుని మీద ఉన్న విశ్వాసము క్షీణించెను. త్వరలోనే పాప జీవితమునకు, ఆచార భక్తికి అలవాటుపడెను. భక్తి కార్యాల మీద ఆశ తగ్గి నాటక సమాజంలో

చేరెను. కాని అతని జీవితములో ఆనందము లేక మానసికమైన అలజడికి గురి అయ్యెను. అట్టి పరిస్థితులలో తనకు నాస్తికత్వము నేర్పించిన అతని యౌవన స్నేహితుడు వ్యాధిగ్రస్థుడై, బహువేదనకరమైన మరణం నొందెను.

అది గమనించిన జడ్సన్‌లో ఒక గొప్పమార్పు కలిగెను. ఈ లోక జీవితము బహు అల్పమైనదని, మరణించిన తర్వాతే శాశ్వత జీవితమున్నదని, యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించనిచో శాశ్వత నరకమేనని గ్రహించెను. ఆరు వారములు తిరుగకముందే మారుమనస్సు పొంది, తన ఇరవయ్యవ సంవత్సరములోనే తన జీవితమును దేవునికి సమర్పించుకొనెను. అంతేగాక తానొక మిషనెరీగా సువార్త అందని దేశాలకు వెళ్ళి ఆత్మలు సంపాదించాలని ఆశపడెను.

భారతదేశములో సువార్త ప్రకటించవలెననెడి ఆశతో నూతనముగా వివాహము చేసుకున్న "ఆనీ హాజల్‌టైన్" అను తన భార్యతో పాటు బయలు దేరెను. ప్రయాణములో అనేక కష్టాలను ఎదుర్కొని 1812వ సంవత్సరములో జూన్ నెలలో కలకత్తారేవు చేరెను. అయితే ఆ సమయములో ఇంగ్లాండు దేశమునకు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీ వారు– అమెరికా మిషనెరీలు వెంటనే వెనక్కి వెళ్ళి పోవాలని ఆజ్ఞ జారీ చేసిరి. "మేము సువార్తసేవ చేయుటకు తూర్పు దేశ ప్రజల దగ్గరకు వచ్చితిమి" అన్న జడ్సన్‌కు ఇండియాలో కాలు మోపుటకు స్థలము లేక బర్మావైపు సాగుచున్న ఒక ఓడ యెక్కి 1813వ సంవత్సరములో బర్మా దేశమునకు చేరెను.

బర్మా దేశము మరింత చీకటి దేశము. క్రీస్తు సువార్తను బోధించువారిని, అంగీకరించు వారిని పిచ్చివారగునట్లు సుత్తెలతో కొట్టే దేశం. అయిననూ ప్రభువుపై భారం వేసి బర్మాలోని రంగూన్ పట్టణంలో ప్రవేశించెను. బహు మురికిగా; బురదతో, దుర్వాసనతో నిండిన ఆ పట్టణంలో జడ్సన్ భార్య వ్యాధి గ్రస్థురాలాయెను. వింతైన ఆచారాలతో, పద్ధతులతో నిండిన ఆ జనుల మధ్య నివసించి అతి ప్రయాసతో బర్మా భాష నేర్చుకొనెను. ఈలోగా వారి 8 నెలల కుమారుడు చనిపోయెను. వారు అనేక బాధలకు గురైరి. అయినను ఆ దేశమును వదలి వెళ్ళుటకు ఇష్టపడక, ఆ దేశ బౌద్ధమతస్థులను క్రీస్తుకొరకు సంపాదించుటకు నిశ్చయించుకొనిరి.

జడ్సన్ దంపతులు బర్మా భాషను నేర్పుటకు ఒక పాఠశాలను నెలకొల్పి విద్యతో పాటు దేవుని వాక్యము బోధించుచుండిరి. జడ్సన్ ప్రయాస ఫలితంగా

6 సంవత్సరముల తర్వాత "మాంవినాస్" అను వ్యక్తి మొట్టమొదట క్రీస్తును అంగీకరించెను. సువార్త సేవ వృద్ధి పొందుచున్న దినములలో బౌద్ధమతమును తప్ప మరి ఏ మతమును అనుసరింపకూడదనే చట్టము రూపుదాల్చెను. రాజాగ్రహమునకు భయపడి బర్మాను విడిచి పెట్టవలెనని తలంపు కల్గెను. కాని దేవుని వాగ్దానం జ్ఞాపకం చేసుకొనిన జడ్సన్ బలము పొందెను.

బ్రిటిష్‌వారు బర్మాను ముట్టడించినపుడు జడ్సన్ ఏదో రహస్యము బ్రిటిష్ వారికి అందజేసెనని నిందవేసి కారాగారములో వేసిరి. బహు మురికితోను, భయంకరమైన హింసలతోను కూడిన ఆ కారాగారములో అతడు 20 నెలలు గడిపెను. ఆ సమయంలో అతని భార్య ప్రసవించి కుమార్తెను కనెను. ఆమె తన కుమార్తెను చెఱసాల దగ్గరకు తెచ్చి చూపించవలసి వచ్చెను. ఆమె తర్జుమా చేసిన క్రొత్త నిబంధన ప్రతులను తలగడ సంచిలో కుట్టి చెఱసాలలో ఉన్న జడ్సన్‌కు అందించెను. 20 నెలలు చెరసాలలో మగ్గిన జడ్సన్ విడుదల పొంది ఇంటికి వచ్చేలోగా బహువ్యాధిగ్రస్థులై పరుండియున్న తన భార్య ఆనీని, చిక్కిశల్యమై యున్న చిన్న కుమార్తెను కనుగొనెను. త్వరలోనే అతని భార్య జ్వర బాధతో మరణించెను. మరికొద్ది రోజులలోనే చిన్నకుమార్తె కూడా మరణించెను. అది జడ్సన్‌కు సహించరాని దుఃఖమును కలుగజేసినది.

అయినను దేవునిని ఎన్నడూ నిందించని జడ్సన్ తన సేవలో ముందుకు సాగెను. ఆ తరువాత ఓర్పుతో 16 సంవత్సరములు అవిరామ కృషి సల్పిన అదోనిరామ్ సువార్తను బర్మాలో ప్రకటించి 1840 నాటికి 100 మందికిపైగా బాప్తిస్మాలిచ్చెను. బైబిలును బర్మాభాషలోనికి తర్జుమాచేసెను. మరియు ఇంగ్లీషు-బర్మా డిక్షనరీ తయారు చేసెను.

34 సంవత్సరములు అనేక కష్టములకు ఓర్చి చేసిన సేవవలన మంద దృష్టిగలవాడై, విపరీతమైన తల బాధకు గురై, నలిగి పోయిన శరీరము కలవాడైనను "క్రీస్తు ప్రభువు సిలువ ప్రేమను స్థిరంగా ఇక్కడ స్థాపించేవరకు ఈ ప్రాంతాన్ని విడువనని" చెప్పి; ఎన్నో కష్టనష్టాలను భరించి, భార్యా, బిడ్డలను, తన ఆరోగ్యమును చివరికి తన ప్రాణమును పోవువరకు అక్కడే నిలిచి సేవచేసి తన 62 వ ఏట అనగా 1850 ఏప్రిల్ 12 న ఉదయం 4 గంటల 10 నిముషములకు "బర్మా మిషనెరీ" అని పేరు పొందిన అదోనీరామ్ ప్రభువు నందు నిద్రించెను. ఆయన ఎప్పుడూ ఇష్టపడే నల్ల సూట్ వేసి, మౌనముగా అతని దేహమును పడవపై నుండి సముద్రపు అలల మీద నెమ్మదిగా దించిరి. అక్కడ భూ స్థాపన గాని, ఆరాధన గాని ఏదీ లేకపోయెను. †

# (12) ఛార్లెస్ ఫిన్నీ

[1792-1875]



**పూర్తి పేరు :**

**ఛార్లెస్ గ్రాండిసన్ ఫిన్నీ**

**జన్మ స్థలం :**

అమెరికాలోని 'వారెన్' నగరము

**తల్లిదండ్రులు :**

సెల్వష్టర్ ఫిన్నీ దంపతులు

**జననం :**

1792 ఆగష్టు 29

**మరణం :**

1875 ఆగష్టు 16

**రక్షణానుభవం :**

29 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**

**పరిశుద్ధాత్మ శక్తితో ఇంగ్లాండ్‌లో చేసిన సేవ వలన ఐదు లక్షలమంది రక్షించబడిరి.**

ఛార్లెస్ గ్రాండిసన్ ఫిన్నీ అమెరికాలో కనెక్టికట్ రాష్ట్రములో ఉన్న వారెన్ నగరములో 1792 ఆగష్టు 29 వ తేదీన జన్మించెను. ఇతని తండ్రి పేరు సెల్వష్టర్ ఫిన్నీ. ఛార్లెస్ ఫిన్నీకి రెండు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు న్యూయార్క్‌లోని ఒనిడా అనే స్థలానికి సైనిక ఉద్యోగి అయిన ఇతని తండ్రి ఇతని తోడుకొని పోయెను. ఆ ఎడారి వంటి స్థలములో సరియైన విద్య, సంస్కృతి, దైవభక్తి లేకుండుట వల్ల ఫిన్నీ తన ఇష్టానుసారంగా పెరిగెను.

పదహారేండ్ల ప్రాయం వచ్చేసరికి, సాధారణ విద్య ముగించి, తన ఇరవయ్యవ యేట ఉపాధ్యాయ వృత్తిని చేపట్టెను. విద్యపై ఆసక్తి కలిగిన ఫిన్నీ లాటిన్, గ్రీకు, హెబ్రీ భాషలను నేర్చుకొనెను. తన ఇరవైఆరవయేట "లా" చదువుకొనుటకు కాలేజిలో చేరెను. ఇతడు "లా" చదివే దినాలలో నేటి న్యాయశాస్త్రానికి ఆధారమైన బైబిల్‌లోని పది ఆజ్ఞలను గురించి చదివెను.

న్యాయశాస్త్ర గ్రంథాలలో బైబిల్ భాగాలను గురించిన ప్రసక్తి వచ్చినప్పుడల్లా వాటిని పరిశీలనగా చూడాలని ఆశ కలిగి ఒక బైబిల్‌ను కొనుక్కొనెను.

బైబిల్ చదివే కొలది ఆసక్తి, ఆధ్యాత్మికమైన ఆకలి ప్రారంభమై శ్రద్ధగా చదివి ధ్యానించుట మొదలు పెట్టెను. అర్థం గాని సంఘటనలను అక్కడ సంఘకాపరి "గెల్" గారితో సంప్రదించుచుండెను. 'చనిపోయిన తరువాత జీవితమున్నది' అన్న విషయము తెలిసినప్పుడు 'అయ్యో, నేనా జీవితము కొరకు సిద్ధపడలేదే!' అని వాపోయెను. నేను చనిపోతే నరకమునకు పోవుదును అని గుర్తించెను. పశ్చాత్తాపము అంటే ఏమిటి? విశ్వాసము అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు జవాబులు కనుగొనుటకు మరింత ఎక్కువగా బైబిల్ చదువుట ప్రారంభించెను. ఆచారభక్తి, స్వనీతి పరలోకమునకు మార్గము కావని గ్రహించెను. క్రొత్త నిబంధన చదువుచుండగా యేసే మార్గమని గుర్తించెను.

1821 వ సంవత్సరము అక్టోబర్ నెలలో ఒక ఆదివారము ఆత్మ రక్షణ పొందాలని నిశ్చయించుకొనెను. సోమ, మంగళ వారములు కూడా ప్రార్థన, బైబిల్ పఠనంలో ఎక్కువ సమయం గడపగా తన ప్రధాన పాపము గర్వము అని ప్రభువు బయలు పరచెను. తాను ప్రార్థన చేయునప్పుడు, బైబిల్ చదువునప్పుడు ఎవరైనా చూస్తారేమో, ఏమైనా అనుకొంటారేమోనని రహస్యంగా ప్రార్థిస్తూ; బైబిలు చదువుచున్నప్పుడు ఎవరైనా వస్తే న్యాయశాస్త్ర పుస్తకములను బైబిల్ పైకి లాగి వేయుచుండెడివాడు.

తన స్థితిని గుర్తిస్తూ ప్రార్థిస్తున్న ఫిన్నీకి కన్నుల ముందు సిలువ దర్శనమును పరిశుద్ధాత్ముడు ప్రత్యక్ష పరచెను. మారుమాట్లాడలేక మోకాళ్ళపై పడ్డ ఫిన్నీ గట్టిగా కేకలు వేసి ఏడ్చుచు; తన గర్వమును, పాపములను ఒప్పుకొని ప్రార్థించెను! "లోకంలో మనుషులంతా వచ్చి చూసినా, నరకములోని పిశాచాలన్నీ నన్ను చుట్టుముట్టినా నేను ఈ స్థలములో నుండి లేవను; మోకాళ్ళపై నుండి ప్రార్థించుట మానను" అని కేకలు వేసెను. తన పాప స్థితికి లోతుగా పశ్చాత్తాపపడి ఒప్పుకొని ప్రార్థించెను. నూతన హృదయమును పొందెను. ఆ రోజు 10-10-1821 అతను లేచి గదిలోనికి వెళ్ళగా గది అంతయు వెలుగుమయమై ఉండెను. ప్రభువును ముఖాముఖిగా చూసెను. ఫిన్నీ హృదయము బ్రద్దలై, పసిపిల్లవాడివలె ఏడుస్తూ, ప్రార్థించి తన జీవితమును పూర్తిగా ప్రభువుకు అప్పగించుకొనెను; గొప్ప శాంతి అతని హృదయములోనికి వచ్చెను. ఆ దినమంతయు చెప్పశక్యము గాని సంతోషముతో అతని హృదయము నిండి యుండెను. ఏ పని చేయ బుద్ధి కాలేదు. ఆహారము మీద ధ్యాస లేక పోయెను. ప్రభువును స్తుతిస్తూ, పాడుతూ, సంతోష

హృదయంతో ఆనంద భాష్పాలను కార్చుచుండెను. పరిశుద్ధాత్మ శక్తి అతనిని ఆవరించి నూతనమైన జీవితమును అనుగ్రహించెను. ఆ తరువాత ఆత్మల కొరకు హృదయము భారముతో నిండియుండెను. గనుక ఎక్కువగా ప్రార్థించుచుండెను.

ఫిన్నీ ఆత్మల రక్షణకొరకు, సువార్త ప్రకటన కొరకు ఎంత ఆసక్తి గలిగి ఉండేవాడంటే, ఆయన పెండ్లి అయిన అయిదవ రోజున బజారు చేసుకొని రమ్మని భార్య సంచిని చేతికిస్తే, సంచిలో బైబిలు పెట్టుకొనిపోయి మూడు నెలల వరకు సువార్త చెప్పుచూ ఆ తరువాత తనకు పెండ్లి అయిన సంగతి గుర్తుకొచ్చి తిరిగి ఇంటికొచ్చాడట!

ఫిన్నీ దేవుని ఉజ్జీవ పనిముట్టుగా వాడబడుచుండెను. ఫిన్నీ మాట్లాడిన ప్రతి వ్యక్తి పాపపు ఒప్పుకోలులోనికి వచ్చుచుండెను. దేవుని వాక్యము అందించునప్పుడు పరిశుద్ధాత్మ దిగి అనేక ఆత్మలను దర్శించుచుండెను. గొప్ప ఉజ్జీవ అగ్ని రగులుకొని అన్యులు మారుమనస్సు పొందుచుండిరి. ఫిన్నీ బోధిస్తూ ఉంటే, వినేవారి హృదయంలోనికి దేవుని వాక్యము వాడియైన బాణాలుగా దూసుకుపోయి జొరబడేవి. అతడు ధైర్యముగా, సూటిగా మాట్లాడేవాడు. ఈయన ప్రసంగము వినేవారితో వ్యక్తిగతంగా మాట్లాడుచున్నట్లు, సంతోషించేటట్లు ఉండేవి; చివరిగా ఒక తీర్మానానికి నడిపించేవిగా ఉండేవి.

ఫిన్నీ గొప్ప ప్రార్థనాపరుడు. పరిశుద్ధాత్మతో నింపబడినవాడు. పరిశుద్ధాత్మ శక్తితో కూడిన అతని బోధ వినేవారి హృదయాలపై గాఢమైన ముద్ర వేసి పని చేసేది. అతడు ఒక మాట మాట్లాడినా, వాక్యం ఎత్తి చూపినా, సంజ్ఞ చేసినా, చూసినా, పరిశుద్ధాత్మ శక్తి అధికముగా కుమ్మరింపబడేది. ఆ స్థలములో పశ్చాత్తాపంతో కూడిన మాటలు వినవచ్చేవి, కన్నీళ్ళు కానవచ్చేవి.

ఈయన సభలలో రక్షించబడిన వారిలో నూటికి నలభై ఐదు మంది చివరి వరకు దేవునికి నమ్మకముగా ఉండిరి. ఈయన ఉజ్జీవ కూటముల ద్వారా ఐదు లక్షల మంది మారు మనస్సు పొంది రక్షించబడిరని అంచనా! ఫిన్నీ ఇంగ్లాండులో దేవుని పనిముట్టుగా బహుగా వాడబడ్డాడు.

1868లో తన జీవిత చరిత్ర వ్రాసి ముగించాడు. తన వృద్ధాప్యములో వేదాంత కళాశాలలో విద్యార్థులకు బైబిలును బోధించుచు గొప్ప సేవ చేసెను. తన 83వ ఏట అనగా 1875 ఆగష్టు 16వ తారీఖున ఫిన్నీ ఈ లోక యాత్రను ముగించి, తాను ప్రేమించిన పరలోకం చేరుకున్నాడు. ✝

# (13) జార్జి ముల్లర్

[1805-1898]



**పూర్తి పేరు :**
జార్జి ముల్లర్

**జన్మ స్థలం :**
ప్రష్యా దేశములోని 'క్రోప్ స్టేట్'

**భార్య పేరు :**
మేరీ గ్రోవ్స్

**జననం :**
1805 సెప్టెంబరు 27

**మరణం :**
1898 మార్చి 10

**రక్షణానుభవం :**
20 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
**విశ్వాసముతో అనేక అనాథ ఆశ్రమాలను స్థాపించి వేలాది అనాథపిల్లలను పోషించెను. ప్రపంచమంతా తిరిగి సువార్త ప్రకటించెను.**

జార్జిముల్లర్ ప్రష్యా దేశమందలి 'క్రోప్‌స్టేట్' అను పట్టణములో 1805 వ సంవత్సరము సెప్టెంబరు 27 వ తేదీన జన్మించెను. అతని తండ్రి ఎక్సైజు కలెక్టరుగా పని చేయుచుండెను. ఆయన లోకస్థుడు. కనుక పిల్లలను గారాబముగా పెంచుచు, విస్తారమైన డబ్బు వారికి యిచ్చుచుండెను. అందువలన బాల్యములోనే ముల్లర్ అనేక దురలవాట్లకు లోనయ్యెను.

ముల్లర్‌కు పది సంవత్సరముల వయస్సు నిండునప్పటికి అతని తండ్రి అతనిని ఒక లూథరన్ మతగురువుగా సిద్ధపరచే స్కూలులో చేర్పించాలని ఆశించెను. కాని, ముల్లర్ తన సొంత మార్గములో తిరుగుచు దొంగగాను, అబద్ధికుడుగాను, మోసగాడిగాను తయారయ్యెను. 14 సంవత్సరముల వయస్సు నిండునప్పటికే నవలలు చదువుట, పేకాడుట, త్రాగుట వంటి దురలవాట్లకు బానిసైపోయెను.

చివరకు తన తల్లి మరణ పడక మీదున్న రాత్రి కూడా త్రాగుచు, వీధులలో తిరుగుచుండెను.

16 సంవత్సరముల వయస్సు వచ్చునప్పటికి మరింత అపవిత్రమైన జీవితములో మునిగిపోయి, ఖరీదైన హొటల్స్‌కి వెళ్ళి, తిని, త్రాగి ఆనందించు చుండెను. అనేకసార్లు హొటళ్ళలో నుండి బిల్లు చెల్లించకుండా పారిపోవుచుండగా పట్టబడి చెఱసాలలో ఉంచబడెను. తండ్రి అనేకసార్లు కఠినంగా శిక్షించెను గాని ప్రయోజనము లేకపోయెను. ముల్లర్ మంచిగా జీవించవలెనని ఆశించెను. అయితే, అప్పటికే పాపబంధకములతో కట్టబడియున్నందున అప్పులు చేయుట, తాకట్టు పెట్టుట, దొంగతనములను చేయుట ద్వారా డబ్బు సంపాదించి తన పాపపు ఇచ్ఛలను తీర్చుకొనుచుండెను.

1825 లో 'నార్ధసన్' అను స్థలమునకు వెళ్ళి ఫ్రెంచి, జర్మనీ, లాటిన్ భాషలను నేర్చుకొనుటకు రెండున్నర సంవత్సరములు కృషి చేసెను. కాని, అక్కడ కూడా అప్పులు చేయుచు, మద్యపానము చేయుచు తన జీవితమును పాడు చేసుకొనుచుండెను. ఒకసారి బీటా అను తన స్నేహితునితో వినోదయాత్రకు స్విట్జర్లాండు వెళ్ళెను. అక్కడ కొండలను, కోనలను చూచి, ఆనందించి స్విష్ మద్యమును సేవించి, ఉల్లాసము పొందుదామనుకొనెను.

అక్కడ డాక్టర్ వెంగర్ అను ఒక భక్తిపరుడుండెను. ఆయన ఇంట ప్రతి శనివారము ప్రార్థనా కూడికలు జరుగుచుండేవి. బీటా, ముల్లర్‌లు ఒక స్నేహితుని ద్వారా ఆ ప్రార్థనా కూడికకు ఆహ్వానించబడిరి. ముల్లర్ అయిష్టతతోనే ఆ చిన్న కూటమునకు వెళ్ళినప్పటికి, అక్కడ వారి ప్రేమను చూచి, ఆశ్చర్యపోయెను. వారు ఒక పాట పాడిన తరువాత మోకరించి ప్రార్థించుచుండగా ముల్లర్ కూడా కదిలించబడి తానును మోకాళ్ళమీద పడెను.

ముల్లర్ మొట్టమొదటిసారిగా నోరు తెరచి ప్రార్థించుట మొదలు పెట్టెను. దేవుని ఆత్మ అతనిని స్పందింపజేసెను. ఆ రాత్రి ఇంటికి వెళ్ళిన తరువాత ముల్లర్ మోకరించి దేవుని సన్నిధిలో తన దోషములన్నిటిని ఒప్పుకొని పశ్చాత్తాపపడెను. అది 1825 వ సంవత్సరము, ముల్లర్ తిరిగి జన్మించిన సంవత్సరము. ముల్లర్ ఎంతో దుష్టుడుగా జీవించినప్పటికి, తన ఇరవైయ్యవ ఏటనే ప్రభువు అతనిని దర్శించెను. ఆ తరువాత ముల్లర్ క్రమముగా ప్రతి శనివారము ప్రార్థనా కూటములకు వెళ్ళుట ద్వారా మిషనెరీలను, దైవసేవకులను హెచ్చరించు పత్రికలను చదువుట ద్వారా భక్తిలో ఎదుగుచుండెను.

ఒక రోజు ప్రార్థనాకూటము నందు 'హెర్మన్‌బల్' అను ఒక యౌవనస్థుడు ధనికుడైన జర్మన్ వ్యాపారస్థుని కుమారుడై యుండియు, క్రీస్తుకొరకు సమస్తమును విడిచిపెట్టి పోలాండ్‌లోని యూదుల మధ్యకు మిషనెరీగా వెళ్ళుటకు సమర్పించుకొనిన సంగతి వినెను. ముల్లర్ కూడా పురికొల్పబడి– ప్రభువా! నీవు ఏ స్థలమునకు నన్ను మిషనెరీగా పంపినను వెళ్ళుటకు నేను సిద్ధముగా యున్నానని ప్రభువుకు సమర్పించుకొనెను. మిషనెరీ తర్ఫీదు కొరకు జర్మన్ మిషనెరీ ట్రైనింగ్ సెంటర్‌లో చేరుటకు నిర్ణయించుకొనెను. అయితే, అతని తండ్రి లోకస్థుడైనందున ముల్లర్ డబ్బు సంపాదించే పాదిరిగా ఉండుటకు అనుమతించెను గాని, మిషనెరీగా ఉండుటకు ఇష్టపడలేదు. అయినను నేను దేవునికి వాగ్దానము చేసిన రీతిగా నా సేవ యెచ్చట అవసరమో అచ్చటనే మిషనెరీ సేవ చేయుదునని ముల్లర్ ఖండితముగా చెప్పెను.

ముల్లర్ అప్పటి నుండి తన తండ్రి సహాయముపై ఆధారపడక, దేవునిపై ఆధారపడెను. డా. తోలక్ సిఫారసు మేరకు అమెరికా నుండి వచ్చిన ముగ్గురు మిషనెరీలు జార్జి ముల్లర్ యొద్ద జర్మన్ భాష నేర్చుకొనుచు, ఆయనకు ద్రవ్యమిచ్చు చుండిరి. ముల్లర్ ఆ ధన సహాయముతో తన విద్యను కొనసాగించెను.

ముల్లర్ ఒక రోమన్ కేథలిక్ కన్యకను వివాహమాడవలెనని అంతకు ముందు తలంచెను. కాని, ఆ విషయమై తాను ప్రార్థించినపుడు అది దైవ చిత్తము కాదని గ్రహించి, తన హృదయములో విగ్రహమువలె ఉన్న ఆమెను ప్రభువు పాదముల యొద్ద విడిచిపెట్టెను. త్వరగా ఏదో ఒక దేశమునకు మిషనెరీగా వెళ్ళవలెనని కంగారుపడినను విఫలుడవుచుండెను. అందువలన దేవుడు నన్ను ఇంకనూ కనిపెట్టమని, సిద్ధపడమని చెప్పుచున్నాడని గ్రహించి ఎక్కువగా ప్రార్థనయందును, బైబిలు పఠనమునందును సమయము గడుపుచు; విశ్వాసము నందు, దీనత్వము నందు ఎదుగుచు; "నేనే ఇంకనూ అనేక విషయములను నేర్చుకొనవలసి యుండగా, నేనెట్లు ఇతరులకు బోధించగలను?" అని వాపోయెను.

ముల్లర్ కరపత్రములను, సువార్తపత్రికలను తీసుకొని, పది పదిహేను మైళ్ళు నడిచివెళ్ళి పంచిపెట్టుచుండెను. కొన్నిసార్లు తన సాక్ష్యమును చెప్పుచుండెను. ఒకసారి ఒక సంఘములో ప్రసంగించమని కోరగా, వ్రాసుకొనిన ప్రసంగమును అతికష్టముగా వల్లించెను. కాని, అతడు తృప్తి చెందలేదు. ఆ తర్వాత ప్రభువు పాదముల యొద్ద మోకరించి, వర్తమానములను పొందుట నేర్చుకొనెను. దేవుడు ఆయనను ఇంగ్లాండులో సేవకు ఏర్పరచుకొనెను. గనుక ఇతర దేశములకు మిషనెరీగా వెళ్ళుటకు ప్రయత్నములు చేసినను విఫలుడాయెను.

ముల్లర్ 1829 లో తన 27వ ఏట ఇంగ్లాండుకు చేరెను. అక్కడ అతడు శరీరరీతిగా బలహీనుడైనను మరింత ఆధ్యాత్మిక బలమును పొందెను. అక్కడ వేదాంత కళాశాలలో ప్రవేశించి హెబ్రీ భాషలో ఉన్న పాత నిబంధన గ్రంథమును దినమునకు 12 గంటలు చొప్పున పఠించుచుండెను. మోకాళ్ళపై దేవుని వాక్యమును చదువుచున్నప్పుడు పరిశుద్ధాత్ముడు లోతైన మర్మములను ఆయనకు బయలుపరచుచుండెను. 1830 లో ముల్లర్ 'టిన్‌మత్' అను స్థలమునకు చేరెను. అక్కడ ఆయనను ఒక ఆలయమునకు సంఘకాపరిగా ఉండవలెనని కొందరు కోరిరి. కాని, ఒక్కచోట స్థిరముగా ఉండి సువార్తను ప్రకటించుట కాక, ఆయా స్థలములలో సంచారముచేసి వాక్యమును ప్రకటించుట తన యెడల దేవుని చిత్తమని తెలుసుకొని దేవుడు మరియొక చోటు చూపించువరకు ఇక్కడే ఉండెదననెను.

టిమ్మత్ అను స్థలములో సంఘ కాపరిగా ఉండుటకు ఒప్పుకొనిన జార్జి ముల్లర్ జీతము తీసుకొనుటకు ఇష్టపడక ఆ ఆలయములో నున్న వెనుక గోడకు ఒక చిన్న పెట్టెను అమర్చి, మీ కానుకలను ఈ పెట్టెలో వేయుడని బోర్డుపెట్టెను. హెచ్చుగా ఇచ్చువారు అతిశయింపకుండునట్లును, స్వల్పముగా ఇచ్చువారు సిగ్గు పడక యుండునట్లును ప్రభువే ప్రతివారిని పరీక్షించి, వారు హృదయపూర్వకముగా ఇచ్చిన దానిని బట్టి ప్రతిఫలము ఇచ్చుటకును అనుకూలముగా యుండెను. ఆ సంఘస్థులు తన అక్కరను తీర్చినను, తీర్చకుండినను వారి మధ్య సేవచేయుదునని వారి ధనము కొరకు కాక, వారి ఆత్మల రక్షణాభివృద్ధి నిమిత్తమై అక్కడ సేవ చేయుదునని చెప్పెను.

ముల్లర్ 1830 అక్టోబర్ 7 వ తేదీన ప్రభువు చిత్తములో 'మేరీగ్రోల్స్' అనే కన్యకను వివాహమాడెను. ఆమె యోగ్యురాలై, ఆయనకు సరియైన సహకారిగా, దేవుని సేవలో ముందుకు సాగుటకు చేదోడు, వాదోడుగా నుండెను.

ముల్లర్ ప్రార్థనయందు, బైబిలు పఠనమునందు ఎక్కువ సమయమును గడుపుచు, ప్రతి విషయములో దేవుని చిత్తమును తెలుసుకొనుట నేర్చుకొను చుండెను. అట్లు ప్రార్థించుచుండగా దేవుడు తనను బ్రిష్టల్ నగరమునకు నడిపించు చుండెనని తెలుసుకొని 1832 మే 23 వ తేదీన అచ్చటకు వెళ్ళెను. 1832 సెప్టెంబరు 17 వ తేదీన ముల్లర్ దంపతులకు ఒక కుమార్తె జన్మించెను. ఆమెకు లిడియా అను పేరు పెట్టిరి.

ముల్లర్ దేవుని వాక్యమును ఎంతగానో ప్రేమించి 200 సార్లు బైబిలును చదివెను. ఒక దినము ఆయన అట్లు బైబిలు చదువుచుండగా కీర్తనలు 68:5

లోని "తండ్రి లేనివారికి తండ్రి" అనుమాట ఆయన హృదయమును పట్టుకొనెను. దేవుడు తనను తండ్రి లేనివారికి తండ్రిగా ఉండాలని కోరుచున్నాడని గ్రహించి, ప్రార్థించి ఒక అనాథ ఆశ్రమమును స్థాపించవలెనని ఆశించి, 150 మంది బిడ్డలతో ఒక అద్దె గృహములో ఆశ్రమమును ప్రారంభించెను. దేవుడు తన పరిచర్యను ఆశీర్వదిస్తుండగా ఆ ఆశ్రమము దినదినాభివృద్ధి పొందుచుండెను.

ముల్లర్ తన 35వ సంవత్సరములో ప్రవేశించినప్పటికిని, చిన్నబిడ్డ మనస్తత్త్వమును కలిగి, తన పరమ తండ్రిపై విశ్వాసముంచుచు, బైబిలు పఠనము నందు ఆసక్తి, దేవుని పరిచర్యయందు చురుకుదనము కలిగి; దేవుని డబ్బు విషయములో నమ్మకత్వమును, క్రీస్తు కొరకు త్యాగము చేయుటయును, అనాథులపట్ల ప్రేమను కలిగి పరిచర్యలో ముందుకు సాగుచుండెను.

మొదటి ఆశ్రమమును తెరచిన ఏడు నెలలకే రెండవ ఆశ్రమమును తెరచెను. మరొక సంవత్సరములో మూడవ ఆశ్రమమును మగపిల్లల కొరకు తెరచెను. త్వరలోనే మరొక రెండు ఆశ్రమములను తెరచెను. మొత్తం అయిదు ఆశ్రమములలో ఉండిన అనేకమంది పిల్లలను ముల్లర్, ఆయన సతీమణి తమ కన్నబిడ్డలవలె చూచుకొనుచుండిరి. శరణాలయ అవసరముల నిమిత్తము, పిల్లల ఆహారము నిమిత్తము ఎప్పుడును ముల్లర్ ఏ నరుని కోరలేదు, అప్పులు చేయలేదు. కాని, ప్రతి అవసరతను దేవుని ముందు పెట్టి, ఆశ్చర్యమైన దేవుని సహాయమును పొందెను. అట్లు ఆయన పొందిన ప్రార్థనా జవాబులు ఎన్నెన్నో! ప్రభువు కొద్దికాలములోనే అనాథ ఆశ్రమములకు సొంత గృహముల నిచ్చెను. 150 మంది అనాథ పిల్లలతో ప్రారంభించి, ఆ అనాథ ఆశ్రమములో పెరిగిన 10,000 మంది పిల్లలకు జార్జి ముల్లర్ తండ్రిగా నుండెను.

40 సంవత్సరములు ముల్లర్‌కు ఎంతో చేదోడు వాదోడుగా ఉండిన అతని భార్య 1870 ఫిబ్రవరి 6 వ తేదీన ప్రభువు సన్నిధికి వెడలిపోయెను. ఆమె అంత్య క్రియల సందర్భముగా ముల్లర్ కీర్తనలు 119:68 పై ప్రసంగించెను.

ముల్లర్ తన వృద్ధాప్యములో ఇట్లనెడి వాడు– "నేను 20 సంవత్సరముల 5 నెలలు పాపములో జీవించిన తరువాత క్రీస్తును తెలుసుకొని మారుమనస్సు పొందితిని. తరువాత ఇప్పటికి 69 సంవత్సరముల 4 నెలలు దేవునితో నడచుచు మరల ఎప్పుడూ పాత పాపములవైపు తిరుగలేదు." "మీరు వృద్ధాప్యములో కూడా ఇంత ఆరోగ్యంగా ఉండగలుగుటకు కారణమే" మని ఆయనను అడిగినపుడు

ఆయన ఇట్లు సమాధానమిచ్చెను– "1. నా మనస్సాక్షిని దేవుని యెదుట, మనుష్యుల యెదుట నిర్మలముగా కాపాడుకొనుచుంటిని. 2. దేవుని వాక్యమును ఎంతో ప్రేమించి రాత్రింబగళ్ళు ధ్యానించుచుంటిని. అది బలమైనదిగా నన్ను నూతన పరచుచున్నది. 3. దేవునియందును, ఆయన సేవయందును ఎల్లప్పుడు ఆనందించు చుంటిని."

ముల్లర్ తన కుమార్తె లిడియాను 'జిమ్రిట్' అను విశ్వాసికిచ్చి వివాహము చేసెను. తదుపరి ముల్లర్ కూడా దేవుని సేవలో సహాయకారిగా ఉండుటకు 'సూసన్నాగ్రేస్' అను విశ్వాసిని వివాహము చేసుకొనెను. 70 ఏండ్ల వయస్సులో ముల్లర్ తన భార్యయైన సూసన్నా గ్రేస్‌తో కలిసి యూరప్, అమెరికా, ఆసియా ఖండాలలో అనేక మిషనెరీ యాత్రలు చేసెను. 2,00,000 మైళ్ళు ప్రయాణించి 42 దేశములలో, అనేక భాషలలో ప్రసంగించెను. ఆలాగు తనకు 90 సంవత్సరముల వయస్సు వచ్చువరకు సువార్త సేవ చేయుచు వచ్చుచుండెను. ఆలాగు సువార్త చెప్పుచు ముల్లర్ ఏడుసార్లు లోకమంతటిని తిరిగి వచ్చెను. తన జీవితములో మూడు మిలియన్ల ప్రజలకు సువార్తను అందించెను.

ముల్లర్ ప్రార్థనా భారములన్నియు వ్రాసియుంచుకొనెడివాడు. ఆయన జీవిత చివరి దినములలో ఇట్లు చెప్పెను– "25 వేల ప్రార్థనలకు ప్రభువు జవాబిచ్చెను. ఇద్దరి మారుమనస్సు కొరకు దగ్గరదగ్గర 60 సంవత్సరములు ప్రార్థన చేసాను." ముల్లర్ తన జీవిత దినములలో ఇంచుమించు లక్షమంది పిల్లలను తన స్కూలులో చదివించెను. పదివేలమంది అనాథులను పోషించెను. అనేక వేల బైబిళ్ళను, క్రొత్త నిబంధనలను పంచిపెట్టెను. 1895 జనవరి 13 వ తారీఖున ఆయన సతీమణియైన సూసన్నాగ్రేస్ ప్రభువు సన్నిధి కేగెను. అప్పుడు ముల్లర్‌కు 90 సంవత్సరముల వయస్సు. శారీరకంగా బలహీనుడైనను ఇంకనూ దేవుని వాక్యము నందించుచు, అనాథాశ్రమ పనులను చూసుకొనుచు ప్రభువు సన్నిధిలో ప్రార్థించి, ఆదరణ పొందుచుండెను.

ముల్లర్ మరణ దినమునకు ముందు దినము వరకు శరణాలయమునకు సంబంధించిన అనేక ఉత్తరములను వ్రాసెను. తన 93 వ ఏట, ఆయన చనిపోవు దినము రాత్రి కూడా II కొరింథీ 5:1 వాక్యముపై ప్రసంగించి, పడకకుచేరి, ఆ రాత్రే ప్రభువు సన్నిధికేగెను. 1898 మార్చి 10 వ తేదీ ఉదయం నిశ్చలంగా పడకపైయున్న ఆయన శరీరమును కనుగొనిరి. ఆహా! ఇతడెంతటి కల్వరి యోధుడు.

†

# (14) డేవిడ్ లివింగ్‌స్టన్ [1813-1873]



**పూర్తి పేరు :**
**డేవిడ్ లివింగ్‌స్టన్**
**జన్మ స్థలం :**
స్కాట్లాండ్‌లోని 'బ్లెన్‌డైర్'
**తల్లిదండ్రులు :**
నియల్ లివింగ్‌స్టన్ దంపతులు
**భార్య పేరు :**
మేరీ
**జననం :**
1813 మార్చి 19
**మరణం :**
1873 మే 1
**రక్షణానుభవం :**
18 సం॥ల వయస్సులో
**సేవా ఫలితం :**
**అనేక కష్టనష్టాల కోర్చి ఆఫ్రికా కీకారణ్యాల్లో జొరబడి, సువార్తను ప్రకటించి ఆత్మల రక్షణ కొరకై తన్ను తాను అప్పగించుకొనెను.**

డేవిడ్ లివింగ్‌స్టన్ స్కాట్‌లాండ్‌లోని 'బ్లెన్‌డైర్' అనే స్థలంలో 1813 మార్చి 19వ తేదీన జన్మించెను. వీరిది చాలా బీదకుటుంబం. ఈయన తల్లిదండ్రులు చిన్న వయసులోనే ప్రభువును గూర్చి అనేక విషయములు నేర్పిరి. వాటిలో ప్రధానమైనది "యదార్థముగా ఉండుట!" ఎంత నష్టమైనను, కష్టమైనను ఫరవాలేదు కాని యథార్థముగా ఉండు అని అతని తల్లి, తండ్రి లివింగ్‌స్టన్‌కు చెప్తూయుండే వారు. ఈయన చిన్న వయస్సులోనే ప్రభువుకు తన హృదయమును ఇచ్చెను.

డేవిడ్ 10 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు దూది పరిశ్రమలో పని చేయటం మొదలు పెట్టెను. అనేక గంటలు కష్టపడి పనిచేసిన తరువాత పాఠశాలకు వెళ్ళివచ్చి అర్థరాత్రి వరకు చదువుచుండెడివాడు. ఇతనికి భక్తుల పుస్తకములు చదువుట అనిన చాలా యిష్టము. ఇతనివద్ద అనేక పుస్తకములుండెడివి.

16 సంవత్సరముల వయస్సప్పుడు చైనా దేశమునకు మిషనెరీగా వెళ్ళిన "గాట్‌జల్ఫ్" అనే వ్యక్తియొక్క చరిత్రను చదివెను. అప్పటి నుండి తను కూడా చైనా వెళ్ళి, అచ్చటి ప్రజలకు క్రీస్తును గూర్చి చెప్పవలెనని తీర్మానించుకొనెను. తొమ్మిది సంవత్సరములు కష్టపడి దూది మిల్లులో పనిచేసిన పిదప డేవిడ్ ఒక వైద్యశాలలో చేరెను. తరువాత కొంత వైద్యవిద్యను నేర్చుకొని ఆఫ్రికా దేశమునకు మిషనెరీగా వెళ్ళగోరెను. డాక్టర్ రాబర్ట్ మొఫత్ అను మిషనెరీని కలుసుకొని ఆయన ద్వారా డేవిడ్ మూడు నెలలు ప్రయాణముచేసి ఆఫ్రికాకు చేరెను. వారి భాషను నేర్చుకొనెను. పిదప క్రీస్తును గురించి ఎన్నడూ వినని ప్రజలను చేరుటకు ఆ ఆఫ్రికా అరణ్యములో అనేక మైళ్ళు ప్రయాణము చేయుచు, ఎన్నో కష్టనష్టములను ఎదుర్కొనుచు సువార్తను అందించుచుండెను.

డేవిడ్ ఆఫ్రికాలో 9000 మైళ్ళు ప్రయాణము చేసి, సువార్తను ప్రకటించుచు, క్రీస్తు ప్రేమను గురించి వారికి బోధించెను. ఆ కీకారణ్యములలో తాను ప్రయాణిస్తుండగా అనేక నదులను, సరస్సులను, విక్టోరియా జలపాతాన్ని కనుగొన్న కీర్తి డేవిడ్‌కు దక్కింది. ఒక గుంపు పెద్దను కలిసి కొనుటకై 100 మైళ్ళు ప్రయాణము చేసి వెళ్ళెను. కొంతకాలమైన తరువాత ఆ గుంపు పెద్ద యొక్క కుమార్తెకు జబ్బుచేసెను. డేవిడ్ ఆమెకు మందులిచ్చి ప్రార్థన చేయగా ఆమెకు పూర్ణ ఆరోగ్యము చేకూరి బలపడెను. ఆ విషయం ఆ పెద్దకు చాలా ఆనందము కలుగజేసెను. అప్పటినుండి క్రీస్తును గురించి లివింగ్‌స్టన్ చెప్పిన దంతయు శ్రద్ధతో వినుచుండెను. చివరికి క్రీస్తును స్వరక్షకునిగా అంగీక రించెను. అందువలన డేవిడ్ ఆ గుంపు అంతటికి వాక్యము ప్రకటించగలిగెను.

అనేక మంది జబ్బులు చేసినవారికి ఆయన మందులు ఇచ్చెను. కొంతమంది 100 మైళ్ళు దూరముకన్నా ఎక్కువ దూరము ప్రయాణము చేసి డేవిడ్ యొద్దకు వచ్చి మందులు తీసికొనుచుండెడివారు. మందుతోపాటు క్రీస్తు సువార్తను విని వెళ్ళుచుండెడివారు. ఆ అరణ్య మార్గములో ప్రజలకు సింహముల బెడద ఉండేది. ఒక దినమున డేవిడ్ మరియు కొందరు నడచి వెళ్తుండగా ఒక సింహము వారి మీదకు వచ్చెను. తన వద్దనుండిన తుపాకీ తీసికొని దానిని కాల్చబోయెను. అది ఆయన మీద పడెను. ఆయనతో ఉండిన వారందరు డేవిడ్ చనిపోయెనని తలంచిరి. కాని మరల తుపాకీ తీసికొని డేవిడ్ ఆ సింహమును చంపివేసెను. అయితే డేవిడ్ చేతి గూడ పట్టువదలి ఎంతో బాధపడెను. దేవుడే వారినందరిని సింహము నుండి తప్పించెను.

డేవిడ్ ఆఫ్రికాసేవకై బయలుదేరిన కొద్ది కాలంలోనే అచ్చట వాతావరణ పరిస్థితులు బాగోలేనందున భార్యను యింటికి పంపివేసెను. మరల 5 సంవత్సర

ముల తర్వాత లివింగ్స్టన్ తన భార్యను చూడగలిగెను. ఆమె అతనిని గుర్తు పట్టలేనంతగా అతని ముఖం ఎండకు పిడచకట్టి తోలువలె నల్లబడి యుండెను. చెట్టుకొమ్మలు పొడుచుకొని ఒక కన్ను పూర్తిగా కనబడకుండాపోయెను. రెండవ కన్ను బహుగా గాయపడెను. అటువంటి పరిస్థితులలో అనేక సంవత్సరముల తర్వాత అతడు తన భార్యను కలిసికొనెను గాని బహు కొద్దికాలంలోనే ఆమె చనిపోయెను. ఆమె సమాధి దగ్గర మోకరించి కన్నీటితో “నా యేసూ! నా రాజా! నా జీవితం, నా సమస్తం మరోసారి నీకు సమర్పించుకొంటున్నాను. నీ సేవ నిమిత్తం, నీ రాజ్యం నిమిత్తం తప్ప మరిదేనికి విలువనీయను” అని ప్రార్థించెను.

డేవిడ్ మరల ఆఫ్రికాకు వెళ్ళి రెండు సంవత్సరములు సేవ చేసెను. ఆయన దినదినం క్రీస్తును గురించి వారికి బోధించుచుండెను. కొంతకాలమునకు ఆయన యొద్దనుండి ఎటువంటి సమాచారము లేనందున ఆయన ఏ సింహము నోటనో పడి చనిపోయెనని అమెరికా ప్రజలు తలంచిరి గాని ఆయనను వెదకుటకు ఆఫ్రికాకు వచ్చిన “స్టాన్లీ” అను యౌవనస్థుడు, తీవ్రమైన జ్వరముతో బాధపడుచున్న డేవిడ్ను అరణ్యములో కనుగొని మందులిచ్చి పరామర్శించెను. కోలుకున్న తర్వాత డేవిడ్ మరెక్కువ సేవచేసెను. గాని తిరిగి తన దేశమునకు వెళ్ళి విశ్రాంతి తీసుకోలేదు.

డేవిడ్ ఒకరోజు మోకరించి “ప్రభువా! నీ వెక్కడికైనా నన్ను పంపు గాని నీవు నాతో రావాలి. ఏ భారమైనా నా మీద మోపు గాని నీవు నన్ను బలపరచాలి. ఏ కట్టు అయినా కట్టుగాని ఆ కట్టు నీ సేవకు, నీ హృదయానికి నన్ను దగ్గరగా లాగాలి” అని ప్రార్థించెను.

సువార్త అందని ఆ చీకటి ఖండములోని జనుల కొరకు డేవిడ్ 33 సంవత్సరములు పనిచేసెను. “ఈ లోక సంబంధమైన కష్టనష్టము లేమియు దేవుని సేవను విడుచునట్లుగా నిరుత్సాహ పరచనివ్వకుండా నా ప్రభువైన క్రీస్తు యేసునందు నన్ను నేను ప్రోత్సాహపరచుకొంటూ ముందుకు సాగుచుంటిని” అని లివింగ్స్టన్ చెప్పేవాడు.

చివరకు తన 60 వ ఏట, అనగా 1873 మే 1వ తేదీన తెల్లవారుఝామున 4 గంటలకు తన మంచము ప్రక్కన మోకరించి ప్రార్థించుచున్న డేవిడ్ లివింగ్స్టన్, ఆఫ్రికా దేశములోని ఆత్మల కొరకు ఆరాటముతో విజ్ఞాపన చేస్తూ తన తుది శ్వాసను విడిచెను. డేవిడ్ ప్రార్థన ఫలితంగా ఆఫ్రికాలో బానిస వ్యాపారం నిషేధించబడింది. చీకటి ఖండమని పిలువబడిన ఆఫ్రికా అనేక మిషనెరీల ద్వారా నేటికి వెలిగించబడింది. ✝

# (15) జాన్ జి. పేటన్ [1824-1907]



**పూర్తి పేరు :**
**జాన్ గిబ్సన్ పేటన్**

**జన్మ స్థలం :**
స్కాట్లాండ్

**తల్లిదండ్రులు :**
జేమ్స్ పేటన్, జానెట్ జార్డైన్

**భార్య పేరు :**
ఇంగ్‌లిస్

**జననం :**
1824 వ సంవత్సరము

**మరణం :**
1907 జనవరి 28

**రక్షణానుభవం :**
12 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
**న్యూ హైబ్రిడీస్ దీవులలో నరమాంస భక్షకుల మధ్య సేవ చేసి, వారిని ప్రభువు కొరకు సంపాదించెను.**

జాన్ జి. పేటన్ స్కాట్‌లాండ్‌లో ఒక భక్తి కలిగిన కుటుంబంలో 1824 వ సంవత్సరములో జన్మించెను. ఇతని తండ్రి ఒక చిన్న వ్యాపారస్థుడు. అయితే పవిత్రమైన జీవితాన్ని జీవిస్తూ, ప్రార్థనలో ఎక్కువ సమయం గడిపేవాడు. తన తండ్రి పవిత్ర జీవితాన్ని చూచిన పేటన్ చిన్న వయస్సులోనే క్రీస్తును తన సొంత రక్షకునిగా అంగీకరించెను. పన్నెండు సంవత్సరాల వయస్సులోనే గ్రీకు, లాటిన్ భాషలు అభ్యసిస్తూ తండ్రికి వ్యాపారములో తోడ్పడేవాడు. తరువాత దేవుని సేవ చేయాలనే ఆశతో వేదాంత విద్యను కూడా అభ్యసించెను. పేదవారి మధ్య సేవచేస్తూ; త్రాగుబోతులు, వ్యభిచారులు, నాస్తికులుగా ఉన్నవారి మధ్య క్రీస్తు ప్రేమను ప్రకటించి అనేకులను యేసువైపు త్రిప్పెడివాడు.

అంతేగాక ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో అనేకులు క్రీస్తు నెరుగకనే మరణిస్తున్నారని తెలుసుకున్న పేటన్ వారి మధ్యకు మిషనెరీగా వెళ్ళి సేవ చేయాలని

ఆశపడి ప్రార్థించెను. "న్యూ హైబ్రిడీస్" దీవులలో మిషనెరీ అవసరతను గుర్తించెను. దేవుని పిలుపును విని నరమాంస భక్షకులు జీవించే ఆ దీవులకు వెళ్ళుటకు సిద్ధపడెను. కొందరు నీవు వాళ్ళ మధ్యకు వెళితే "నిన్ను వాళ్ళు చంపుకు తినేస్తారని" భయపెట్టారు. అయితే జాన్ పేటన్ ధైర్యంగా, "ఏలాగూ నేను చనిపోయిన తర్వాత సమాధిలో నన్ను పాతిపెట్టినప్పుడు నా శరీరాన్ని పురుగులు తినక తప్పవు. కాబట్టి క్రీస్తుకొరకు నేను జీవించినపుడు నన్ను నరమాంస భక్షకులు తిన్నా చింతెందుకు?" అనేవాడు.

"నేను బ్రతికినా చనిపోయినా క్రీస్తుకొరకే!" అంటూ తన ముప్పైమూడవ ఏట అనగా 1857 వ సంవత్సరములో వారి మధ్యకు, తన భార్యతో పాటు సేవకు వెళ్ళెను. టానా అనే ద్వీపములో ప్రవేశించెను. ఆ దీవులలో అనేక తెగల ప్రజలు జీవించెడివారు. ఒక తెగతో మరొక తెగవారు పోరాడుకొనుచు, జయించినవారు మరణించినవారి శరీరాలను భక్షించుచుండెడివారు. వారి క్రూరత్వాన్ని, మూఢత్వాన్ని చూచిన పేటన్ కన్నీటితో వారికొరకు ప్రార్థిస్తూ, ధైర్యముగా అటువంటి నరమాంస భక్షకుల మధ్య పరిచర్య చేయుటకు ముందుకు సాగెను.

వారు బహుమూఢ ఆచారములు కల్గిన జనులు! మంత్రములు, తంత్రములు నమ్ముచు, బలులు అర్పించుచుండెడివారు. అచ్చట వాతావరణము బహు కలుషితమైనదైనందున; పేటన్ భార్య, చిన్న బిడ్డ కూడా వ్యాధిగ్రస్థులై త్వరలోనే మరణించిరి. జ్వరముతో పేటన్ కూడా బాధపడుచున్నను, తానే స్వయంగా తన చేతులతో సమాధులు త్రవ్వి తనభార్యను, బిడ్డను పాతి పెట్టవలసి వచ్చినది. అయినను 'ప్రభువే నన్ను ఆదరిస్తున్నాడు ఆయన సాన్నిధ్యం నాతో లేనియెడల నాకు మతి చలించి యుండును' అంటూ పట్టువిడువని పేటన్ నరమాంస భక్షకుల మార్పుకొరకు పట్టుదలతో ప్రార్థించుచుండెను.

ఆ జనుల మధ్య బహు సహనముతో క్రీస్తు ప్రేమను చూపించుచు, సంజ్ఞల ద్వారా యేసు ప్రభువును గురించి చెప్పుచు వారి భాష నేర్చుకొనుచుండెను. అనేకసార్లు అతనిని చంపడానికి వచ్చిన ఆ నరమాంస భక్షకుల బారి నుండి ప్రభువే తప్పించెను. ఆ తరువాత దగ్గరగా ఉన్న "అనీవా" ద్వీపమునకు కూడా వెళ్ళి వారి భాష నేర్చుకొని వారి మధ్య బహు సహనముతో ప్రయాసపడెను.

ఆ అనాగరికులు నీరు ఆకాశం నుండి కురుస్తుందని మాత్రమే ఎరుగుదురు. ఒకప్పుడు నీటికి బహుకొరత కలుగగా పేటన్ ఒక భావిని త్రవ్వడం ప్రారంభించాడు. ఆయన చేస్తున్నది ఎవరికీ అర్థం కానందున భయపడి వారెవరూ బావి దగ్గరకు రాకపోగా, ఇంచు మించు ఆయన ఒక్కడే బావిని త్రవ్వి ఆ బావి నీటిని వారికందించెను. అది చూచిన ఆ ప్రజలు ఆశ్చర్యపడి "పేటన్ దేవుడే నిజమైన దేవుడు" అని అనుచు క్రీస్తును తమ ప్రభువుగా అంగీకరించిరి.

"అనీవా" ప్రజలు బహు అనాగరికులు. స్త్రీలు కొద్ది వస్త్రధారణ చేసెడివారు; పురుషులు, చిన్న బిడ్డలు దాదాపు దిగంబరులుగా ఉండెడివారు. వీరు పాములను ఆరాధించెడివారు. చిన్న బిడ్డలను బలి ఇచ్చెడివారు. అయితే జాన్ పేటన్ ప్రయాస, ప్రార్థనల వలన వీరు ఆ కార్యములను విడిచి రక్షించబడిరి. "అనీవా" యందు నమాకై అను నాయకుడు మొదట ప్రభువు నంగీకరించెను. తద్వారా అనేకులు మారిరి.

చివరికి కన్నీటి ప్రార్థనతో, పట్టుదలతో వారి మధ్య చేసిన పరిచర్యవలన ఆ న్యూహైబ్రిడీస్ దీవులలోని 7 మైళ్ళ పొడవు 2 మైళ్ళ వెడల్పు ఉన్న "అనీవా" ద్వీప వాసులంతా క్రీస్తును అంగీకరించారు.

1899 లో పేటన్ "అనీవా" భాషలో క్రొత్త నిబంధన గ్రంథాన్ని సిద్ధపరచెను. యెనుబది యేండ్ల వయస్సులో పేటన్‌ను విశ్రాంతి తీసుకొనుమని వైద్యులు ఎంతగా చెప్పినను లెక్క చేయక; ఉత్తరములు వ్రాయుటలోను, కాలినడకన గృహాలు సంధించి ప్రార్థించుటలోను, అర్ధరాత్రి వరకు లేఖలు వ్రాయుచు బైబిలును తర్జుమా చేయుటలోను గడిపెడివాడు. ప్రతిరోజు ఏదో ఒక పని దేవుని కొరకు చేయనిదే కొంచెమైనా విశ్రాంతి తీసుకొనుటకు ఇష్టపడెడివాడు కాదు. ఆలాగు "నా అంతిమశ్వాస వరకు నేను సేవలో కొనసాగుతా"నన్న జాన్‌పేటన్ ప్రపంచములోని పలు ప్రాంతములను సంచరించి ప్రభువు తనకు అప్పగించిన గొప్ప సేవచేసెను. తన 83 వ యేట అనగా 1907 జనవరి 28వ తేదీన ప్రభువు సన్నిధికి చేరెను. అచ్చట నున్నవారు అతడు మరణించుచుండగా, ఆయన ముఖముపై పరలోకపు వెలుగును చూచి, పరిశుద్ధ స్థలములో నిలిచియున్న అనుభవమును పొందిరి. ✝

# (16) విలియంబూత్ [1829-1912]



**పూర్తి పేరు :**
**విలియం బూత్**

**జననం :**
ఇంగ్లాండులోని 'నాటింగ్ హామ్'

**భార్య పేరు :**
కేథరిన్

**జననం :**
1829 ఏప్రిల్ 10

**మరణం :**
1912 ఆగష్టు 20

**రక్షణానుభవం :**
13 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
Soup-Soap-Salvation అనే ధ్యేయంతో 'సాల్వేషన్ ఆర్మీ'ని స్థాపించి, అనేకమంది పేదలను ప్రభువు కొరకు సంపాదించెను.

విలియంబూత్ ఇంగ్లాండులోని "నాటింగ్ హామ్" లో ఒక సామాన్యమైన కుటుంబములో 1829 ఏప్రిల్ 10 వ తేదీన జన్మించెను. ఈయన తల్లి మంచి భక్తిపరురాలు. ఈయన తండ్రి కష్టపడి చాలా డబ్బు సంపాదించెను. గాని, దురదృష్ట వశాత్తు అది అంతా పాడైపోయినందున విలియంబూత్ పేదరికములోనే పెరిగెను. అతని చిన్న వయస్సులోనే అతని తండ్రి మరణించెను. అల్లరిగా పెరుగుచున్న విలియంబూత్ తన ఏడు సంవత్సరముల వయస్సులోనే పరిశుద్ధముగా ఉండాలని కొన్ని నిర్ణయాలు చేసుకొనెడివాడు. కాని, ఆ నిర్ణయాన్ని నిలబెట్టుకొనలేక పోయేవాడు. తండ్రిలేనివాడిగా పెరుగుచున్న విలియంబూత్‌కు సరియైన విద్యాభ్యాసము కూడా దొరకలేదు. అయితే తన పదమూడవ యేట ఒకసారి దేవుని ఆలయంలో వాక్యం వింటూవుండగా, విలియం మనస్సాక్షి చేత గద్దింపబడి తన తల్లిదండ్రులకు అవిధేయుడైన విషయం, తన పాపముల విషయం పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందెను.

ఆలాగు తన యౌవన ప్రాయములోనే తన హృదయమును దేవుని కిచ్చెను. మోసం చేసి తెచ్చుకొన్న వస్తువులను తిరిగి ఇచ్చివేసి వారియొద్ద క్షమాపణ అడిగెను. అతని జీవితాన్ని ప్రభువుకు అంకితం చేసుకొనెను. తాను రక్షింపబడిన క్రొత్తలో 'జేమ్స్‌కాగరీ' అనే గొప్ప సువార్తికుడు చేసిన ప్రసంగాలను విన్న విలియంబూత్ లోతైన పరిశుద్ధత కొరకైన ఆకలి, ఆత్మల సంపాదన కొరకైన ఆరాటము పొందెను. అయితే, స్వతహాగా పిరికివాడైన బూత్ కూటములను జరిపించుటకు భయపడెను. అయినప్పటికి దేవుని వాక్యమును ఎక్కువగా పఠించుచు, ప్రార్థించుచు, దేవుని వాక్యము ప్రకటించుటకు సిద్ధపడెను. వీధిమూలలలో నిలువబడి వాక్యము చెప్పుచున్నప్పుడు మనుష్యులచే హేళన చేయబడెను. ఇటుకలతో కొట్టబడెను. అయినను నిరుత్సాహపడని విలియంబూత్ సువార్త సేవలో ఇతరులతో కలిసి ముందుకు సాగెను. 17 సంవత్సరముల వయస్సులోనే ప్రసంగీకునిగా పేరు పొందెను.

విలియంబూత్‌కు పేద ప్రజలమధ్య సేవ చేయాలని గాఢమైన వాంఛ! విలియంబూత్ యొక్క జాలిగుండె, ఎంత ప్రయాస పడినా ఆకలి తీరని ఆ పేద ప్రజల పరిస్థితిని చూచినపుడు, భారముతో వారి కొరకు ప్రార్థించి, వారికి మంచి స్నేహితునిగా మెలిగెను. ఆ పేద ప్రజలు త్రాగుడు, వ్యభిచారము, జూదము వంటి దురలవాట్లకు బానిసలై మరింత పేదలగుట విలియంబూత్ గమనించి నప్పుడు వారికొరకు మరింత భారము కలిగి నశించిన దానిని వెదకి రక్షించుటకు వచ్చిన యేసయ్య ప్రేమను వారిమధ్య చూపించుచు, వారిమధ్య ఒక ప్రత్యేకమైన సేవ చేయాలని వాంఛించెను.

విలియంబూత్‌కు అన్ని రీతులా తనతో సేవలో సహకరించే భక్తి కలిగిన కేథరిన్‌తో వివాహం ఆయెను. కేథరిన్, విలియంబూత్‌లు ఇద్దరూ జాన్‌వెస్లీ మొదలగు భక్తుల జీవితాలను చదువుచు, పరిశుద్ధ పరచబడిన జీవితము, హృదయశుద్ధి అను ప్రాముఖ్యమైన అంశములను ధ్యానించి, బోధించుచుండిరి. విలియంబూత్ పేద ప్రజలమధ్య సువార్తను ప్రకటించుటకు ఆసక్తి కలిగిన మరికొంత మంది క్రైస్తవులతో కలిసి మిషనెరీగా పనిచేయుటకు ప్రారంభించెను.

ఆయన భార్య కేథరిన్ కూడా సేవలో తనకు సరైన సహకారిగా ఉండెను. వీరికి 8 మంది పిల్లలు. వారందరు క్రీస్తుచే వాడబడాలని ప్రార్థించెడివాడు. ఈయన సేవలో మారుమనస్సు పొందినవారిలో అనేకులు విద్య లేనివారే గాని, వారి

సాక్ష్యములు శక్తి కలిగినవై అనేకులను మార్చుచుండెను. ఆయనతో ఉన్నవారు వాయిద్యములు చక్కగా వాయించగలిగి యుండిరి. వారందరు క్రీస్తు సైన్యముగా బయల్దేరి వీధులలోనికి వెళ్ళి సాతాను హస్తాలలో ఉన్న ఆత్మలను విడిపించి తెచ్చుచుండిరి.

విలియంబూత్ "రక్షణ సైన్యము" అను సంస్థను స్థాపించెను. ఈయన ఒకే ఆలయములో గాక ఆయా స్థలములకు తిరిగి సువార్తను విత్తుచుండెను. కొన్ని సార్లు గుడారములు వేసి ఉజ్జీవ కూటములు జరిపినప్పుడు అనేకులు రక్షింపబడు చుండిరి. "Soup-soap-salvation" (ఆహారము–శుభ్రత–ఆత్మరక్షణ) అనే ధ్యేయంతో ఆయన సువార్త చెప్పుటయే గాక ఆ ప్రజలపట్ల శ్రద్ధ చూపించి వారి దేహ అవసరతలను తీర్చవలసిన బాధ్యత కూడా మనకుంది అని నిరూపించాడు. విలియంబూత్ పేదలను గూర్చి ఆలోచిస్తూ, వారి అవసరతలను గూర్చి ప్రార్థించెడి వాడు.

ఈయన భార్య కేథరిన్ ఈయనకు సేవలో అన్ని విధములా సహకరించెను. వీధుల్లో బోధించుట, బహిరంగ కూటములు, స్త్రీల మధ్య పరిచర్య వీరి దినములలో బహుగా కొనసాగుచుండెడివి. తల్లి–తండ్రి అని పిలువబడే బూత్ దంపతుల ద్వారా వేల వేల ఆత్మలు రక్షణలోనికి నడిపించబడిరి. వీరు అనేక పట్టణములు, గ్రామములు తిరిగి ప్రభువును ప్రకటించిరి. వీధులలోను, ఫ్యాక్టరీలలోను, మురికి వాడలలోను వీరి పరిచర్యలు విస్తరించెను. ఈ గొప్ప సేవ నేటికిని 90 దేశాలలో కొనసాగుచున్నది.

విలియంబూత్ గొప్ప సువార్తికుడుగాను, దేవుని ప్రేమను ప్రకటించువాడు గానే కాక, దేవుని ప్రేమను క్రియలలో చూపించెను. 1890 అక్టోబరు 4 వ తారీఖున, సేవలో తనకు కుడిభుజమువలె ఉన్న కేథరిన్ తనను విడిచి ప్రభువు సన్నిధికి వెళ్ళినప్పటికిని, ప్రభువు సేవలో ముందుకు సాగుటకు నిశ్చయించుకొనెను. విలియంబూత్ తన వృద్ధాప్యములో 1904 నుండి 1907 వరకు ఇంచుమించు 5 వేల మైళ్ళు ప్రయాణం చేసి 400 మీటింగులలో ప్రసంగించెను. అంతము వరకు ప్రభువు కొరకు జీవించెను. చివరిగా విలియంబూత్ తన 83 సంవత్సరముల వయస్సులో 1912 ఆగష్టు 20 వ తేదీన తనను ప్రేమించిన ప్రభువు సన్నిధికి వెళ్ళెను. ఇంచుమించు అరువది వేల మంది ఆయన శరీర భూస్థాపన కార్యక్రమములో పాలుపొందిరి.

✝

# (17) హడ్సన్ టేలర్

[1832-1905]



**పూర్తి పేరు :**
**జేమ్స్ హడ్సన్ టేలర్**

**జన్మస్థలం :**
ఇంగ్లాండ్‌లోని 'యారూషైగి'

**తల్లిదండ్రులు :**
జేమ్స్ టేలర్, అమీలియా

**భార్య పేరు :**
మేరీ డైర్

**జననం :**
1832 మే 21

**మరణం :**
1905 డిశంబరు 22

**రక్షణానుభవం :**
14 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
**చైనా దేశములో సువార్త ప్రకటించి 'చైనా ఇన్‌లాండ్ మిషన్' ను స్థాపించెను.**

జేమ్స్ హడ్సన్ టేలర్ 1832 మే 21వ తేదీన ఇంగ్లాండ్‌లోని "యారూషైగి" అనే స్థలంలో జన్మించెను. "ప్రథమ ఫలము నాది" అన్న ప్రభువు మాటలకు విధేయతగా హడ్సన్ తల్లిదండ్రులు చిన్నప్పుడే ఇతనిని దేవుని సేవకు సమర్పించిరి. అయితే హడ్సన్ చిన్నప్పట్నుంచి చాలా బలహీనుడిగా ఉండేవాడు. అందువల్ల ఇతడు పాఠశాలకు కూడా వెళ్ళక ఇంటివద్ద చదువుకొనుచుండెను. అయినను నాలుగు సంవత్సరముల వయస్సులోనే తండ్రి వద్ద హెబ్రీ అక్షరములను నేర్చుకొనెను. ఈయన తల్లిదండ్రులు చిన్నప్పట్నుంచి ఈయనను భక్తిలో పెంచుచుండిరి. అందువల్ల హడ్సన్ చిన్నప్పుడే "నేను పెద్దవాడనైన తర్వాత చైనా దేశంకు మిషనెరీగా వెళ్తాను" అంటుండేవాడు.

చైనా దేశంలోని ప్రజలు మూర్ఖపు ఆచారాలతో విసిగిపోయి యున్నారు; యేసుక్రీస్తు యొక్క ప్రేమ సువార్త వారికి ఎంతో అవసరము అను విషయాలను

విశదీకరించి, పీటర్ పారే వ్రాసిన పుస్తకాన్ని హడ్సన్ చదివిన తర్వాత మరింత ఆశతో చైనా దేశానికి వెళ్లగోరెను.

తన 14 సంవత్సరముల వయస్సులో పాఠశాలకు వెళ్లుట ప్రారంభించెను. పాఠశాల వాతావరణం అతని భక్తి జీవితాన్ని దిగజార్చెను. చిన్నప్పుడే దేవునికి సమర్పించబడిన ఈ కుమారుడు బాల్యములోనే రక్షించబడాలనే భారంతో ఈయన తల్లి, చెల్లి ప్రార్థించేవారు. ఒకరోజు వారు మోకాళ్ళూని, హడ్సన్ రక్షణ కొరకు భారంతో ప్రార్థించుచుండగా, ఆ ప్రార్థనకు జవాబుగా ఇంచుమించు 80 మైళ్ళ దూరంలో ఉన్న హడ్సన్ "సమాప్తమైనది" అనే కరపత్రికను చదువుచుండెను. దేవుని ఆత్మ ఆయనను ఆవరించగా, తన పాపాల కొరకు పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందెను.

ఆ తర్వాత తన 17 వ సంవత్సరములో– "ప్రభువా నా జీవితం విషయమై నీ చిత్తం ఏమని" ప్రార్థించుచుండగా; "నా కొరకు చైనా దేశం వెళ్ళుము" అనే స్వరాన్ని వినెను. అప్పటి నుండి మిషనెరీ సేవకు తన్ను తాను సిద్ధపరచుకొనెను. చైనా భాష నేర్చుకొనుచు, చైనా భాషలో ఉన్న లూకా సువార్తను గంటల తరబడి చదువుచుండేవాడు. కఠినమైన శరీర శ్రమలను అలవర్చుకొని, ఎటువంటి సుఖాసక్తులకు స్థలమియ్యక, తన్ను తాను క్రమపరచుకొంటూ ప్రతి పని తానే చేయుట నేర్చుకొనెను. చైనా దేశంలో మిషనెరీగా ఉండుటకు వైద్య విద్యను కూడా నేర్చుకొనుటకు కాలేజీలో చేరెను. అక్కడ తాను ఎదుర్కొన్న కష్టాలు, పేదరికము ప్రభువుకు మరింత సన్నిహితమవుటకు సహాయపడెను. ఆదాయములో మూడువంతులు దేవునికి ఇచ్చి, ప్రతిరోజు కాలేజీకి 8 మైళ్ళు నడచి వెళ్ళుచు; ఉదయం, రాత్రి ఒక రొట్టె ముక్క తిని సరిపెట్టుకొనేవాడు.

చివరికి దేవుని పిలుపుకు లోబడి తన 22 వ ఏట అనగా 1853 లో ఒక ఓడలో బయలుదేరి 5 1/2 నెలలు సముద్రంలో ప్రయాణించి "షాంగై" పట్టణం చేరెను. అయితే చైనాలో అది యుద్ధ సమయం అయినందున సువార్తను ప్రకటించుటకు అవకాశం లేకపోయెను. అయినను నిరుత్సాహపడక దినమునకు 5 గంటలు చైనా భాషను నేర్చుకొంటూ "అందరికి అన్ని విధములవాడనై యుంటిని" అన్న పౌలువలె, హడ్సన్ చైనా జాతీయ, వేష, భాషలను అనుసరించెను. వైద్యం చేయుట ద్వారా కొందరికి సువార్తను ప్రకటించెను. నివసించుటకు సరియైన ఇల్లు, తినుటకు ఆహారము లేకపోయినందున ఆరోగ్యము క్షీణించుచున్నప్పటికి, "ప్రభువు నన్ను ఒక్కొక్క అడుగే నడిపిస్తున్నాడు; ఆయన సన్నిధిలో కనిపెట్టి విశ్వాసంతో అడిగినప్పుడు, ఆయన సమస్తమును ఇచ్చుచున్నాడు" అని అనెడివాడు.

ఒక దినము చైనాలో ఉన్న "మేరీడైర్" అను క్రైస్తవ ఉపాధ్యాయురాలిని కలిసికొనెను. ఆమె కూడా చైనాలో క్రీస్తు కొరకు నిలబడెను. పెద్దల అంగీకారం ప్రకారంగా దేవుని చిత్తములో ఆమెను వివాహము చేసికొనెను. వీరు యిరువురు కలిసి రోగుల సేవ, వాక్య పరిచర్య చేయుచుండిరి. విస్తారమైన సేవ, ప్రయాణముల వలన హడ్సన్ ఆరోగ్యము దెబ్బతినెను. 7 సంవత్సరముల సేవ తర్వాత అనారోగ్యుడైన హడ్సన్ విశ్రాంతి కొరకు, చికిత్స కొరకు ఇంగ్లాండు చేరెను.

లండన్‌లో ఉండగా తాను సమయమును వృథా చేయక చైనా దేశపు పటమును తన గదిలో గోడకు తగిలించుకొని, అప్పటి ఆ దేశములోని 11 రాష్ట్రముల కొరకు, 38 కోట్ల జనుల కొరకు ప్రార్థించుచుండెడివాడు. ఆ దేశమునకు 24 మంది మిషనెరీలు కావాలని భారముతో ప్రార్థించి "చైనా ఇన్‌లాండ్ మిషన్"ను ప్రారంభించెను. ప్రార్థనా ఫలితంగా 11 నెలల తర్వాత 16 మంది మిషనెరీలతో మరల చైనాకు బయలుదేరెను. దేవుడు వారి సేవను అభివృద్ధి పరచెను. చైనా-ఇన్‌లాండ్ మిషన్‌ను స్థాపించిన 20 సంవత్సరములకు అందులో 225 మంది మిషనెరీలు పనిచేయుచుండిరి.

సేవలో అభివృద్ధి సాధించిన హడ్సన్ వ్యక్తిగతంగా ఎన్నో నష్టాలను భరించెను. 12 సంవత్సరములు ఆయన సేవలో ఆయనకు తోడుగా ఉన్న ఆయన భార్య మేరీడైర్, వారి ముగ్గురు కుమార్తెలు ఆ దేశములోని అనారోగ్య పరిస్థితులను బట్టి మరణించారు. తన వెన్నెముక గాయమై కొన్ని నెలలు పడకలో ఉండవలసి వచ్చెను. పడకలో ఉండి కూడా చైనా కొరకు ప్రార్థించేవాడు. తను ప్రారంభించిన సేవ కొరకు ఎవరినీ ఆర్థిక సహాయాన్ని ఎప్పుడూ అర్థించలేదు గాని ప్రతి అవసరతను ప్రభువుకి తెలియజేసేవాడు. "దేవుని చిత్తములో చేసిన దేవుని సేవకు దేవుని సహాయము తక్కువ కాదు" అని అనుచుండెడివాడు.

ఈ మిషనెరీ 1905 వ సంవత్సరములో 11 వ సారి చైనాకు బయలుదేరాడు. నూతనముగా సేవ ప్రారంభించిన రాష్ట్ర రాజధాని చంగ్‌షా అనే పట్టణంలో సువార్తను ప్రకటించి అనేక ఆత్మలను సంపాదించెను.

ఒకసారి హడ్సన్ టేలర్‌ను ఒకరు "నీలాంటి వాడు ఇంతటి గొప్ప కార్యాలను సాధించడానికి ఎలా సాధ్యమయ్యింది?" అని ప్రశ్నించారట! అందు కాయన ఎంతో నమ్రతతో, "ఆ ప్రభువు ఎంత శక్తిమంతుడో, నేనెంత బలహీనుడనో నిరూ పించేందుకు ఆయనే తన కృప ద్వారా బలహీనుడనైన నావలన ఆయన బలమైన కార్యములు జరిగించెను" అని జవాబు ఇచ్చెను.

చివరికి 1905 లో డిసెంబరు 22 న ఈ దైవజనుడు చైనా దేశములో మరణించి ప్రభువు సన్నిధికేగి ప్రభువు ఇచ్చు బహుమానమును పొందెను. †

# (18) డి.యల్. మూడీ [1837-1898]



**పూర్తి పేరు :**
డ్వైట్ లైమన్ మూడి

**జన్మ స్థలం :**
అమెరికాలోని 'నార్త్ ఫీల్డ్'

**తల్లిదండ్రులు :**
ఎడ్విన్ మూడీ, బెట్స్

**భార్య పేరు :**
ఎమ్మా రేవెల్

**జననం :**
1837 ఫిబ్రవరి 5

**మరణం :**
1898 డిశంబరు 22

**రక్షణానుభవం :**
17 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
గొప్ప ప్రసంగీకుడుగా పేరు పొందెను. కోటి మందికి సువార్తను అందించెను.

డి.యల్. మూడీ అమెరికాలోని మసాచూసెట్స్ ప్రాంతానికి చెందిన నార్త్ ఫీల్డ్‌లో ఒక సామాన్యమైన కుటుంబంలో 1837 ఫిబ్రవరి 5వ తేదీన జన్మించెను. చిన్న వయస్సులోనే ఈయన తండ్రి ఎడ్విన్ మూడీ మరణించుట వలన, భక్తి కల్గిన బెట్స్ అనే ఈయన తల్లి ఎంతో కష్టపడి పనిచేసి బిడ్డలను పెంచనారంభించెను. కుటుంబ పరిస్థితులను బట్టి మూడీ చిన్న వయస్సులోనే చదువుకు స్వస్తి చెప్పి, పొరుగువాని ఆవులు మేపుట ద్వారా కొంత డబ్బు సంపాదించి, తల్లికి సహకరించు చుండెను.

ఇంచుమించు 17 సంవత్సరముల వయస్సులో బోస్టన్ అనే ప్రాంతానికి వెళ్ళి అచ్చట ఉన్న తన మేనమామ చెప్పుల దుకాణములో పనికి కుదిరెను. ఆ సమయములో ఎడ్వర్డ్ కింబెల్ అనే సండేస్కూలు టీచర్ ద్వారా యేసుని గురించిన సువార్తను విని ఆత్మ రక్షణ యొక్క ఆవశ్యకతను గుర్తించి, పాపములను ఒప్పుకొని, యేసుక్రీస్తుని సొంత రక్షకునిగా అంగీకరించెను.

తన రక్షణ అనుభవమును గూర్చి మూడీ ఇలా వ్రాసుకున్నాడు. "నేను రక్షించబడిన ఉదయం ఇంటి నుండి బయటకు రాగా నాకు అంతా క్రొత్తగా కనిపించెను. సూర్యుడు మరింత తేజస్సుతో ప్రజ్వలిస్తూ నన్ను చూసి నవ్వుచున్నట్లు అనిపించెను. చెట్లమీద పక్షులు స్తుతిగీతాలు పాడుచున్నట్లు, సర్వసృష్టి నా రక్షణ విషయమై ఆనందించుచున్నట్లు అనిపించెను. ఇది నేను మరువలేని అనుభవము."

యౌవనకాలంలో రక్షించబడ్డ డి.యల్.మూడీ తాను రక్షించబడ్డ వెంటనే ఈ గొప్ప రక్షణను ఇతరులకు కూడా అందించ ఆశించెను. ప్రతి ఆదివారం తనతో పాటు కనీసం ఐదుగుర్ని అయినా ఆలయానికి తీసుకొనివెళ్ళేవాడు. అంతేగాక వీధుల్లో అల్లరిగా తిరిగే పిల్లలందర్ని సమకూర్చి యేసుప్రభువును గూర్చి చెప్పేవాడు. ఆ తరువాత మురికివాడలలో నివసించే పేదలయొద్దకు వెళ్ళి, త్రాగుడుకు, వ్యభిచారమునకు, మరనేక రకములైన దురలవాట్లకు లోనైన జనులకు యేసుక్రీస్తు ఇచ్చే విడుదలను గురించి చెప్పి, ప్రార్థించి వారిని ప్రభువు బిడ్డలుగా మార్చేవాడు. ఈలాగు 3 సంవత్సరాల్లో ఇంచుమించు 1000 మందిని సమకూర్చ గలిగెను.

1862లో మూడీ "ఎమ్మా రేవెల్" అను కన్యకను వివాహము చేసుకొనెను. ప్రభువు వారికి ముగ్గురు బిడ్డలను అనుగ్రహించెను. అప్పటికి మూడీ చేయుచున్న చెప్పుల వ్యాపారం బాగా వృద్ధిలోనికి వచ్చెను గాని ఆత్మలను సంపాదించాలనే అతని ఆరాటం వ్యాపారాన్ని పూర్తిగా విడిచిపెట్టి యేసుప్రభువు సేవ చేయుటకు సమర్పించుకొనునట్లు చేసెను. ఆర్థికమైన ఇబ్బందులు కలిగినప్పటికిని మనుష్యులను ఆశ్రయింపక దేవునియందు విశ్వాసం ఉంచినందున దేవుడే ఆయన పరిచర్యను దీవించి, అభివృద్ధి పరచెను. మూడీ, దేవుని సన్నిధిలో అనేక గంటలు ప్రార్థించి, అనేక సంగతులను సేకరించి, తన వర్తమానమును అందించేవాడు.

డి.యల్. మూడీగారి జీవితము ద్వారా మనము నేర్చుకొనవలసిన మొదటి సంగతి– ఆయనలో ఉన్న ఆత్మల సంపాదన కొరకైన ఆరాటం! రెండవది– ఆయనలో ఉన్న తగ్గింపు! ఒకరోజు వర్తమానము అయిన తర్వాత ఒకతను వచ్చి "నీవు బహిరంగ కూటములలో బోధించుటకు తగవు. నీ భాషలో అనేక వ్యాకరణ దోషములున్నవి" అని కఠినంగా అన్నాడు. అందుకు మూడీగారు కోపగించుకొనక బహు దీనతతో "అవునండీ! చిన్నతనంలో నాకున్న పేదరికాన్ని బట్టి నేను ఎక్కువ విద్యను అభ్యసించుటకు అవకాశం దొరకలేదు. అయినను నాకున్న కొద్ది విద్యాజ్ఞానమును ఉపయోగించి, దేవుని ప్రేమను వివరించుటకు ప్రయత్నించు చున్నాను. మీకు వ్యాకరణం బాగా తెలుసు గదా! మరి మీరు దేవునికి

సమర్పించుకొని సువార్త ప్రకటించవచ్చు గదా!" అని అనగా అవతల వ్యక్తి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయెను.

ఒకరోజు మూడీ ప్రసంగం ముగించిన వెంటనే ఒకాయన పరుగెత్తుకొని వచ్చి "ఆహా! ఎంత గొప్పగా ప్రసంగము చేసారండి" అని కరచాలనము చేయగా, మూడీ, "సోదరా! నేను వేదిక దిగక ముందే సాతాను ఈ మాటలు చెప్పినది. నేను చేసే బోధ నాది కాదు, నన్ను పంపినవానిదే. నేను కేవలము ఆయన వాక్యమును వినిపించే బూరను మాత్రమే" అనెను. మూడీ విమర్శకు కృంగెడివాడు కాదు; పొగడ్తలకు పొంగెడివాడు కాదు. "దేవునికి సంపూర్ణముగా సమర్పించుకున్న ఒక వ్యక్తి జీవితములో అతని ద్వారా, అతని కొరకు, దేవుడు ఎన్ని గొప్ప కార్యములు చేయునో ఇంకనూ లోకము చూడలేదు. నేను సంపూర్ణముగా దేవునికి సమర్పించు కొన్న వ్యక్తిగా ఉండి, దేవుని గొప్ప కార్యాలను చూడాలనుంది" అని మాటిమాటికి చెప్పెడివాడు.

ఒకరోజు రాత్రి చికాగోలో మూడీ దేవుని ఆలయములో క్రీస్తు ఇచ్చు రక్షణ గురించి మంచి వర్తమానమును అందించిన తరువాత, "ఈ క్రీస్తును మీ సొంత రక్షకునిగా అంగీకరిస్తారా? తృణీకరిస్తారా? మీరే నిశ్చయించుకొని వచ్చే ఆదివారం తెలియజేయండి" అని చెప్పి ఆరాధన ముగించెను. కాని, ఆ రాత్రి గొప్ప అగ్ని ప్రమాదం సంభవించి ఆ ఆలయము, ఆరోజున మీటింగులో ఉన్న అనేకుల గృహములు కాలిపోయినందున అనేకులు చనిపోయిరి. మూడీ– 'అయ్యో! ఈ రోజే క్రీస్తును అంగీకరించండి' అని నేను బోధించియుంటే అనేకులు క్రీస్తును అంగీకరించి యుందురు గదా! అప్పుడు వారు చనిపోయినప్పటికి దేవుని రాజ్య వారసులై యుండి యుందురు గదా! అని గ్రహించి; అప్పటి నుండి ఇదే అనుకూలమైన సమయం, ఇదే రక్షణ దినం అని ప్రకటించుట మొదలు పెట్టెను. మూడీ ఈలాగు తనను, తన బోధను దిద్దుకొనుచు దేవునికి ఇష్టమైన, యోగ్యమైన సేవను చేయుటలో ముందుకు సాగుచుండెను.

ఈలాగు మూడీ భక్తుడు తన జీవిత కాలములో రేడియో, టి.వి. సహాయము లేకుండానే ఇంచుమించు ఒక కోటిమందికి సువార్తను అందించెనని అంచనా వేసారు! అంతేగాక మూడీ బైబిల్ ఇన్‌స్టిట్యూట్‌ను, పుస్తక శాలలను స్థాపించెను. మాస పత్రికను కూడా నడిపించెను. ఇంకను అనేక రీతులుగా ఆయన ఆత్మల రక్షణార్థమై ప్రయాసపడెను. "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభం" అంటూ ఒకరోజు మూడీ చనిపోయాడనే ప్రకటన మీరు పేపరులో చదువుతారు

గాని దానిని మీరు నమ్మకండి. 1837 లో పుట్టిన నా మట్టి శరీరము మట్టయిపోయినా 1855 లో తిరిగి పుట్టిన నా ఆత్మ నిరంతరము పరలోక రాజ్యములో జీవించును" అనెడివాడు.

ఈలాగున 44 సంవత్సరములు ప్రభువు సేవలో అరిగిపోయిన మూడీ తన మరణపడకపై ఉండి, "ఆహా! ఇదే నా విజయమ్ము. ఇదే నా పట్టాభిషేకపు సుదినము" అని తన చివరి మాటలు చెప్పి 1898 డిశంబరు 22 న ప్రభువు సన్నిధికేగి ప్రభువు ఇచ్చు బహుమానము పొందెను.



*(వివిధ భంగిమలలో నవ్వించి, కవ్వించి, గద్దించి, బుద్ధి చెప్పుచున్న డి.యల్. మూడీ ప్రసంగములు అనేకులను రక్షణలోనికి నడిపించేవి.)*

✝

# (19) మేరీ స్లెస్సర్

[1848-1915]



**పూర్తి పేరు :**

**మేరీ స్లెస్సర్**

**జన్మ స్థలం :**

స్కాట్లాండ్ దేశములోని 'అవర్థన్' పట్టణము

**జననం :**

1848 వ సంవత్సరము

**మరణం :**

1915 వ సంవత్సరము

**రక్షణానుభవం :**

11 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**

**ఆఫ్రికా ప్రజల మధ్య సేవ చేసి, అనేకమంది మొరటు ప్రజలను మార్చగలిగెను.**

మేరీ స్లెస్సర్ స్కాట్‌లాండ్ దేశములోని ఆవర్థన్ పట్టణములో 1848 వ సంవత్సరమున డిశంబరు 2వ తారీఖున ఒక పేద కుటుంబములో జన్మించెను. తండ్రి చెప్పులు కుట్టుకొనేవాడు. తల్లి నూలు మిల్లులో పని చేసేది. తల్లి భక్తి కలిగిన స్త్రీ. గాని తండ్రి త్రాగుడుకు బానిస. వారికి కలిగిన ఏడుగురు సంతానంలో ఈమె రెండవ కుమార్తె. మేరీ తన పదకొండు సంవత్సరముల వయస్సులోనే ఒక నూలు మిల్లులో పనిచేస్తూ ఒక్క పూట మాత్రమే చదువుకొనేది.

మేరీ ఒక పరిశుద్ధురాలి సహవాసంలో లోతైన రక్షణానుభవమును పొంది, యేసుక్రీస్తును తన స్వంత రక్షకునిగా అంగీకరించెను. ఆమె మారుమనస్సు పొందిన తరువాత తనకున్న కొద్ది చదువుతో బైబిలును, ఆధ్యాత్మిక పుస్తకములను చదువుచుండెడిది. పగలంతా పనిలో, రాత్రి సమయమంతా చదువుటలో శ్రద్ధ వహించేది. మిషనెరీల చరిత్రలు చదివెడిది.

అనాగరికులైన ఆఫ్రికా జనుల మధ్యకు మిషనెరీగా వెళ్ళిన డేవిడ్ లివింగ్‌స్టన్ జీవిత చరిత్ర ఆమెనెంతగానో కదిలించెను. తాను అటువంటి జనుల మధ్య సువార్తను ప్రకటించాలని ఆశించెను. మొదట ఆమె ఉన్న స్థలములో మురికివాడలలో నున్నవారిని ప్రభువులోనికి నడిపించుటకు ప్రయాసపడెను. ఆత్మల రక్షణకై ఆవేదనతో ప్రార్థిస్తూ, సండే స్కూలు టీచర్ బాధ్యతను కూడా వహించెను.

1873 లో డేవిడ్ లివింగ్‌స్టన్ యొక్క మరణవార్త ఆమెను కలవరపరచెను. అప్పటికి మేరీ వయస్సు కేవలము 24 సంవత్సరములు మాత్రమే. అయినను "తెల్లవారి సమాధి" గా పేరొందిన ఆఫ్రికా దేశమునకు మిషనెరీగా వెళ్ళుటకు తెగించి స్కాట్‌లాండ్ దేశములో యునైటెడ్ ప్రెస్బిటేరియన్ చర్చి వారి సహాయంతో 1876 ఆగష్టు 5 న ఆఫ్రికా దేశంలో "కెలబార్" అనే ప్రదేశమునకు ప్రయాణమయ్యెను.

మేరీస్లెస్సర్ ఆఫ్రికా దేశములోని స్త్రీలను పరామర్శించుచు, పిల్లలకు విద్య నభ్యసింపజేయుచు, వారి కష్ట సుఖాలను అర్థం చేసుకొంటూ, వారి పట్ల సానుభూతితో వ్యవహరించేది. వారి స్థానిక భాషయైన 'ఎఫిల్' ఎంతో ఆసక్తితో నేర్చుకొని కలిసి జీవిస్తూ, వారికి క్రీస్తును గురించి బోధించేది. భయంకరమైన విగ్రహారాధన, నరబలులతో కూడిన, మూర్ఖులైన ఆ జనుల మధ్య, క్రూర జంతువులతో నిండియున్న ఆ అడవిలో ప్రభువు కొరకు నిలబడడానికి ఆమె ఎంతగానో ప్రార్థించి, ప్రభువుపై ఆధారపడి జీవించేది. పన్నెండు సంవత్సరములు వారి మధ్య నిర్విరామ కృషి చేసి అనేకులను ప్రభువు పాదములయొద్దకు నడిపించెను.

ఆ తర్వాత ఆమె మరింత భయంకరమైన 'ఓకోయాంగో' కు వెళ్ళడానికి ఆశించింది. వారియొద్దకు అంతవరకు ఎవరును వెళ్ళలేదు. వారు బహు క్రూరులు, మూర్ఖులు, వారు చేసే అమానుష రాక్షసకృత్యాలు వినడానికి కూడా ఎంతో భయంకరముగా యుండేవి. ఎటువంటి దయాదాక్షిణ్యములు లేని, నరమాంస భక్షకులు వారు. అటువంటి వారి మధ్య సేవ చేయుటకు 1888 ఆగష్టు 3వ తేదీన 'ఎంకేంగే' అను గ్రామమునకు తాను పెంచుకున్న ఐదుగురు అనాథ బిడ్డలతో బయలుదేరెను. ఆ పన్నెండు సంవత్సరములు ఆమె యొక్క ప్రేమను, దయగల హృదయమును చవిచూచిన ఆ కెలబార్ ప్రజలు ఆమె నరమాంస భక్షకుల మధ్య సేవ చేయుటకు వెళ్ళుచుండగా కన్నీటితో సాగనంపిరి.

మేరీ తాను ఎదుర్కొనబోవు కష్టములను లెక్కచేయక క్రీస్తువైపు చూచుచు ఒక పూరి గుడిసెలో నివాసమేర్పరచుకొని విశ్వాసముతో, పట్టుదల ప్రార్థనలతో పాపులను ప్రేమించి, క్షమించి, రక్షించగల యేసుప్రభువుని గూర్చి చెప్తూ ఉంటే ఆ దుష్టప్రజలు ఆశ్చర్యపోవుచుండిరి. మేరీ స్లెస్సర్ క్రీస్తు ప్రేమతో ఎటువంటి హృదయాన్నైనా అట్లే ఆకర్షించేది. అప్పటి జనుల హృదయాలలో దేవుడు, కనికరం, జాలి అనే మాటలకు స్థలమే లేకపోయినా వారి హృదయాలను కరిగించి, వారి అజ్ఞాన కార్యములనుండి వారిని తొలగించి వారి నివాసములలో నివసిస్తూ, వారి ఆహారమును భుజిస్తూ ఎండకు ఎండి, వానకు తడుస్తూ సేవ చేసింది ఈ మేరీ స్లెస్సర్. ఒక క్రొవ్వొత్తిలా తాను హరించుకుపోతున్నా, ఇతరులకు వెలుగునిస్తూ క్రీస్తు ప్రేమను చూపించింది.

ఈ ఓకోయాంగోలోని ప్రజలు బహు మూర్ఖులు. వీరిలో ఎవరైనా ముఖ్యుడు మరణిస్తే, అతని ఆత్మ శాంతి కొరకు కొందరు మనుష్యులను బలిచ్చేవారు. ఒక భర్త మరణిస్తే, అతని భార్యను లేక కొన్నిసార్లు అతనికున్న ఇద్దరు లేక ముగ్గురు భార్యలను అతనితోపాటే సజీవ సమాధి చేసేవారు. వీరికి కవల పిల్లలు పుడితే అది శాపమని తలంచి ఆ పిల్లలను చంపేసేవారు. ఆ తల్లిని తరిమేవారు లేక చంపేసేవారు. మేరీస్లెస్సర్ ఇలాంటి మూర్ఖమైన అలవాట్లనుండి వారిని తప్పిస్తూ, అలాంటి వారికి ఆశ్రయమిచ్చెను.

పది సంవత్సరములలో ఓకోయాంగో ప్రాంతము పూర్తిగా మారిపోయింది. నరబలులు, దురాచారములు, త్రాగుడు మొదలగు దురలవాట్లు మాని అనేకులు యేసుక్రీస్తును స్వరక్షకునిగా అంగీకరించి ఆత్మశాంతిని, ఆత్మానందమును పొందిరి. భయంకరమైన ప్రాంతంగా పేరుపొందిన ఓకోయాంగో సమాధాన నిలయంగా మారింది. "మా తగవులు తీర్చండి, మా సమస్యలు పరిష్కరించండి" అంటూ అనేకులు మేరీ యొద్దకు పరుగెత్తుకు వచ్చెడివారు. మేరీ ఓపికతో వారి సమస్యలను విని పరిష్కార మార్గాలను వారి భాషలోనే తెలియజేసెడిది. అప్పటికామె వయస్సు 50 సంవత్సరములు. ఆమె అనేక బలహీనతలకు, కీళ్ళ వాతమునకు గురియయ్యెను. అయినను ఆమె స్వదేశమునకు వెళ్ళి విశ్రాంతి తీసుకొనక ఒక చక్రాల కుర్చీలో కూర్చొని సేవను కొనసాగించెను.

అనేక మంచి పాఠశాలలను, ప్రార్థనా మందిరములను కట్టించినప్పటికి తాను, తనతోనున్న అనాథలతో చిన్న గుడిసెలలో నివసిస్తూ నిరాడంబరముగా యుండేది. అధిక సమయాన్ని ప్రభువు సేవలో వ్యయపరస్తూ ఆదివారము

ఇంచుమించు పది మైళ్ళకు పైగా ప్రయాణిస్తూ పన్నెండు స్థలములలో బోధించేది. ఆమె ఈ స్థలంలో పనిచేసిన 40 సంవత్సరములలో కేవలం మూడుసార్లు మాత్రమే బహు కొద్ది సమయం తన దేశానికి వెళ్ళి వచ్చింది. ఆమె మాటలు, జీవితము ఎప్పుడూ క్రీస్తుకే ఘనత తెచ్చునట్లుగా ఉండేవి. "ఈ ఆటవికులు క్రీస్తు శిష్యులయ్యారంటే ఇది నా ప్రజ్ఞ కాదు: ఇది ప్రభువు కృపే, మరియు మీ ప్రార్థనల ఫలితం. రక్షింపబడిన ఈ ఆత్మల ద్వారా ప్రభువే ఘనపరచబడును గాక!" అంటూ ఉండేది. తరువాత ఆమె అరణ్య ప్రాంతములో ముందుకు సాగుతూ 'ఐటు' అనే ప్రాంతములోనికి, ఆ తరువాత మారుమూలల్లో ఉన్న మరికొన్ని ప్రాంతాలకు వెళ్ళి సువార్తను ప్రకటించింది.

సమస్త సుఖ సాధనములకు దూరముగా యుండి ఏకాకిగా 40 సంవత్సరములు అహర్నిశలు ఆత్మల రక్షణార్థమై పోరాడి ప్రభువు కొరకై తన జీవితమును వాడిన మహనీయురాలు ఈ వీరనారి. జీవితాంతం వరకు ఆఫ్రికాలోనే పరిచర్య చేయాలని నిశ్చయించుకొనిన ఈమె ఎంతో అనారోగ్యమునకు గురైనను తన స్వదేశమైన స్కాట్లాండ్‌కు వెళ్ళే తలంపే రానివ్వలేదు. వృద్ధాప్యము వలన కదల్లేని పరిస్థితులు ఏర్పడినప్పటికిని ప్రభువు సేవలోనే ఉండెను. తన చివరి దినములలో పడకలో ఉన్నప్పటికి కూడా పరలోకము గురించి ఆలోచిస్తూ ప్రార్థించుచుండెను. మేరీ 1915 వ సంవత్సరములో జనవరి 13వ తారీఖున తన 67వ యేట అక్కడే తన పోరాటమును ముగించి ప్రభువిచ్చు కిరీటమును పొందుటకు మహిమలో ప్రవేశించెను.

ఆమె మరణించినప్పుడు ఆమె సేవలో ఆమెకు మార్గదర్శిగా ఉండిన ఆమె బైబిలులో ఆమె వ్రాసుకొన్న అనేక వాగ్దానములు ఉండెను. మరియు అనేక సంవత్సరములు ఆమె ప్రభువు పరిచర్యలో కొనసాగినను ఆమె ఈ లోకంలో మిగుల్చుకొన్న ఆస్తి–కొన్ని పాత బట్టలు, పుస్తకములు, ఒక పెద్ద ఉత్తరాల కట్ట! ఆమె పరిచర్య ఎంత నిరాడంబరమైనదో, నిస్వార్థమైనదో మనము గుర్తించవచ్చు! అయితే ఆమె పరలోకములో దేవుడిచ్చు కిరీటమును, సింహాసనమును సంపాదించెననుటకు సందేహము లేదు. ఆమె నిస్వార్థమైన సేవ ద్వారా మార్పు పొందిన వేలాది మొరటు ప్రజలు ఆమె లేనిలోటుకెంతో విలపించిరి. ఆమె పెంచిన అనాథలు తల్లడిల్లిరి. అయితే ఆమె మరణించినను ఆ పాప దుర్గంధ పూరితమైన ఆ అనాగరిక జనుల మధ్య ఆమె వెదజల్లిన క్రీస్తు పరిమళం ఈనాటికీ పరిమళిస్తూనే ఉంది. పాప చీకటిలో ఆమె వెలిగించిన సువార్త వెలుగు తన ఉజ్వలకాంతిని వెదజల్లుతూనే యుంది. ఆహా! ఈమె ఎంతటి ధన్యజీవి? ✝

# (20) పండిత రమాభాయి

[1858-1922]



**పూర్తి పేరు :**
**పండిత రమాభాయి సరస్వతి**

**జన్మ స్థలం :**
భారతదేశంలోని కర్ణాటక రాష్ట్రము (మంగుళూరు దగ్గర)

**తల్లిదండ్రులు :**
అనంత శాస్త్రి, లక్ష్మీబాయ్

**భర్త పేరు :**
బిబిన్ బిహారీ

**జననం :**
1858 ఏప్రిల్ 23

**మరణం :**
1922 ఏప్రిల్

**రక్షణానుభవం :**
30 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
విధవరాండ్రకు, దగాపడిన స్త్రీలకు 'శారదా సదన్'ను స్థాపించెను. అంధులకు, అనాథలకు, విధవరాండ్రకు, పతనమైన స్త్రీలకు సువార్తను బోధించి; 'ముక్తి మిషన్' ను స్థాపించెను. బైబిలును మరాఠీ భాషలోనికి తర్జుమా చేసెను.

పండిత రమాభాయి సరస్వతి 1858 ఏప్రిల్ 23 వ తేదీన కర్ణాటక రాష్ట్రములో ఒక నిష్ఠ గలిగిన బ్రాహ్మణ కుటుంబములో జన్మించెను. ఈమె తండ్రి పేరు అనంతశాస్త్రి. బాల్యం నుండియే రమాభాయి తండ్రితో అనేక పుణ్య క్షేత్రములకు వెళ్ళుచుండెడిది. 12 సంవత్సరముల వయస్సులోనే 18,000 శ్లోకములు కంఠోపాఠంగా చెప్పగలిగినందున ఈమెకు కూడా పండితులు 'పండిత' అను బిరుదునిచ్చారు. ఈమె 6 సంవత్సరముల పరిధిలో తనకత్యంత ప్రియులైన అయిదుగురు వ్యక్తులను పోగొట్టుకొంది. కరువులో తల్లి, తండ్రి, సహోదరుడు మరణించారు. వివాహమైన 19 మాసాల్లోనే కలరాకు గురియై భర్త మరణించాడు. కన్నకుమార్తె కూడా మరణించింది.

ఆ సమయములో హిందూ మత గ్రంథ సారాంశము బాగుగా ఎరిగి యుండియు మనశ్శాంతి లేనిదై జీవితముపై విరక్తి చెందింది భారత దేశపు స్త్రీల అభ్యున్నతి కొరకు ఏదో చేయాలనే పట్టుదలతో రమాభాయి కొన్ని విద్యార్థతల్లి,

శిక్షణను పొందాలనే ఆశతో ఇంగ్లాండ్ వెళ్ళినది. అక్కడ చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ సోదరీల ద్వారా క్రీస్తు ప్రేమ అనగా ఎట్టిదో చవి చూచి, భారత దేశపు స్త్రీల దీనావస్థను క్రీస్తు ప్రభువే మార్చగలడని నమ్మి, యేసుని అడుగుజాడలలో నడవాలని నిశ్చయించుకొని బాప్తిస్మము పొందెను. అలాగు ఆమె ఇంగ్లాండ్, అమెరికా దేశములు తిరిగి, మరల భారతదేశము చేరెను. అయితే ఆ తరువాత క్రీస్తు ప్రభువు సిలువలో బలియై తన స్థానమును తీసుకొనెనని, తనకు రావలసిన పాపశిక్షను ఆయన భరించెనని తెలుసుకొనెను. ఆయనయందలి విశ్వాసమును బట్టి క్రీస్తు రక్తముచేత శుద్ధీకరించబడి పాపక్షమాపణ, రక్షణ నిశ్చయతలను పొంది శాంతి, సమాధానములు సంపాదించుకొని లోతైన ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందెను. క్రైస్తవ మతాన్ని ఎరిగాను కాని, ఆ మతానికి జీవనాడియైన క్రీస్తును నేనిప్పుడే రుచి చూస్తున్నాను అనెను.

నెల్సన్ గ్రేగ్సన్ అను బోధకుడు "నేను క్రీస్తుతోకూడ సిలువ వేయబడి యున్నాను" అను విషయమును గూర్చి బొంబాయిలో చేసిన ప్రసంగము ఆమెను మొదట కదలించెను. పరిశుద్ధాత్మ ప్రసన్నత ఆమెకు కలిగెను. "యేసుక్రీస్తు మూలముగా రక్షించబడితిని" అనుటకు ఎలాంటి సందేహము లేదని ఆమె చెప్పెను.

తన రక్షణ సాక్ష్యము ద్వారా ప్రారంభములోనే 15 మంది ఆత్మీయ పిల్లలను పొందెను. ఒకనాడు ఉదయ కాలము ప్రార్థించుచుండగా పరిశుద్ధాత్మావేశం వలన 125 మందికి రక్షణాశ్రయం ఇవ్వవలసినదిగా ప్రభువుచే ప్రేరేపించ బడినది. ఆమె దేవుని యొద్ద ప్రార్థించి, ఆయన యొద్దనుండి వాగ్దానములను పొందు చుండెడిది. ఈమె జార్జిముల్లర్ స్థాపించిన అనాథ ఆశ్రమములను, దేవుని మీద విశ్వాసముతో చేయుచున్న ఆయన సేవను చూచి "శక్తిచేతనైనను, బలముచేతనైనను గాక, నా ఆత్మచేతనే ఇది జరుగును" అను మాటలయందు విశ్వాసముంచి 1889 లో విధవరాండ్రకు, జీవితంలో కాలుజారి దగాపడిన స్త్రీల కొరకు 'శారదా సదన్'ను స్థాపించెను. పూనా దగ్గరలో ఉన్న కెడ్‌గామ్ అనే ప్రాంతములో అంధులకు, అనాథలకు, విధవరాండ్రకు, పతనమైన స్త్రీలకు సువార్తను బోధిస్తూ, విద్య నేర్పించి వారికొక ఉపాధి కల్పిస్తూ "ముక్తిమిషన్" స్థాపించి వారిని శారీరకముగానే కాక, ఆధ్యాత్మికంగా కూడా పోషిస్తూ రక్షణలోనికి నడిపించెను. సామాజికంగా త్రోసివేయబడిన పతితలైన స్త్రీలకు తల్లిగా, స్నేహితురాలిగా, గురువుగా ఉంటూ; వారిని ఆదరిస్తూ, సలహాలిస్తూ మంచి శిక్షణను, ఆధ్యాత్మిక బోధను యిచ్చుచుండెను. ఆమె ప్రేమను, సానుభూతిని అనుభవించిన స్త్రీలు ఆమెలో క్రీస్తును చూడగలిగిరి. పండిత రమాభాయి ఎద్దుల బండిలో పరిసర గ్రామాలకు వెళ్ళుచు, అనేకులకు క్రీస్తు సందేశాన్ని యివ్వటమే గాక; పేదలను ఆదరించి, పరామర్శించేది!

హిందూ దేవాలయములలో దేవదాసీలుగా మగ్గిపోతున్న వారిని విడిపించి, చేరదీసి, ఆదరించేది! అట్టివారికి చేతి పనులను నేర్పి, వారిని వారే పోషించు కొనునట్లు చేసేది! అట్టివారిలో అనేకులు నర్సులుగా, టీచర్లుగా, గృహిణులుగా మారి సమాజములో గౌరవనీయమైన జీవితములు గడుపునట్లు చేసెడిది! విరామము లేకుండా ఆయా సభలలో వాక్యోపదేశము చేస్తూ, రాత్రింబగళ్ళు ఆత్మల సంపాదన కొరకు ప్రయాసపడుతూ ప్రభువు కొరకు ఎంత చేసినా చాలదు అంటుండేది!

ఆమెకు ఒక బైబిలు, కొన్ని వస్త్రములు తప్ప మరేమియు లేవు. అయినను ప్రభువు ఐశ్వర్యవంతుడని, ఆయన ధనాగారము సదా నిండియుండునని, తన బిడ్డలకు అవసరమైన వాటినన్నింటిని ఆయన పంపగలడని విశ్వసించి విశ్వాసముతో జయము పొందెను.

ఈమె భాషాంతరీక వీరులలో ప్రథమ స్త్రీ. ఈమె చేసిన గొప్ప పని బైబిలు గ్రంథమును మరాఠి భాషలోనికి తర్జుమా చేయుట! దానికై దాదాపు తన జీవిత కాలమంతయు ఖర్చు పెట్టెను. ఇందుకై హెబ్రీ, గ్రీకు భాషలను నేర్చుకొనెను. ప్రతి దినం ఉదయం 4 గంటల కంటె ముందుగా లేచి ధ్యానము, ప్రార్థన, తర్జుమా మున్నగు కార్యముల యందు మునిగి యుండెడిది. ఈమె శక్తి సామర్థ్యములకు రహస్యము వాక్యధ్యానము, ప్రార్థనలే! ఆశ్రమములో ఉన్నవారికి క్రీస్తును గూర్చి ప్రకటింపక మునుపు వారికొరకు మహావేదనతో ప్రార్థన చేయు చుండెడిది. ఈమె కల్వరి ప్రేమతో నిండి యుండెడిది. ఒకసారి ఈమె చేసిన శక్తిగల ప్రసంగమును బట్టి విక్టోరియారాణి కదలింపబడెను.

ఈమె ఆశ్రమములో 300 మందిని పోషించు భారము 1500 మందికి పెరిగెను. వీరందరికి భోజన, వస్త్రపానాదులను ఏర్పాటు చేయుటయే కాక వారిని క్రీస్తు కొరకు తర్ఫీదు చేయుచుండెను. రమాభాయి విశ్వాసము విషయంలో పలు విధములుగా పరీక్షింపబడెను. క్రీస్తుకొరకు శ్రమననుభవించి, విశ్వాసముతో జయించి, చివరిగా 1922 ఏప్రిల్‌లో తన 64వ యేట పండిత రమాభాయి ప్రభువు నొద్దకు వెళ్ళిపోయినది.

రమాభాయి మనస్సు, దృష్టి మనుష్యుల మీదను, మిషనెరీల మీదను కాక; ప్రభువైన యేసుక్రీస్తు మీద ఉండుటవలన ఈమె తాను స్థాపించిన రక్షణాశ్రమమును దిగ్విజయముగా కొనసాగించెను. ఇప్పటికి 82 సంవత్సరముల క్రిందట ఈమె లోకమును విడిచినను, ఈమె స్థాపించిన ఆశ్రమం ఇంకనూ అనేకమందికి ఆశ్రయ స్థానముగా నున్నది. ఆమె మరాఠీ భాషలో వ్రాసిన అనేక క్రైస్తవ భక్తి గీతాలు ఈనాటికీ వాడుకలో ఉన్నవి. ఆమెలో ఉండిన ప్రేమ, భారము, విజ్ఞాపన, ప్రార్థన, వేదన నేడు మనకు మాదిరిగాయున్నవి. మనము కూడా విశ్వాసంతో క్రీస్తు కొరకు గొప్ప కార్యములు చేయుదమా? ✝

# (21) స్మిత్ విగ్గెల్స్‌వర్త్ [1859-1947]



**పూర్తి పేరు :**
స్మిత్ విగ్గెల్స్ వర్త్

**జన్మ స్థలం :**
ఇంగ్లాండ్ దేశము

**భార్య పేరు :**
పాలీ

**జననం :**
1859 జూలై 10

**మరణం :**
1947 మార్చి 12

**రక్షణానుభవం :**
8 సంవత్సరములు

**సేవా ఫలితం :**
ఫలభరితమైన పరిచర్యను చేసెను. దేవుని ఆత్మ కార్యములు, అద్భుతములు జరిగించెను.

స్మిత్ విగ్గెల్స్‌వర్త్ ఇంగ్లాండు దేశమందు 1859 జూలై 10 వ తేదీన ఒక నిరుపేద కుటుంబములో జన్మించెను. చిన్న వయసులోనే పనికి వెళ్ళుచున్నందున స్కూలుకి వెళ్ళి చదువుకోలేకపోయెను. పెద్దవాడైన తర్వాత సంతకం చేయడం మాత్రం నేర్చుకొనెను. తన ఎనిమిది సంవత్సరముల వయస్సులో వాళ్ల నాయనమ్మతో పాటు ఒక సువార్త మీటింగ్‌కి వెళ్ళి యేసుక్రీస్తుకు తన హృదయమును అప్పగించుకొనెను. అప్పటినుండి ఇతరులను కూడా రక్షణలోనికి నడపాలనే ఆశ అతనికి కలిగెను. మొదటిగా తన తల్లిని రక్షణలోనికి నడిపించుకొనెను.

1882 వ సంవత్సరములో పాలీ అనే భక్తి, సామర్థ్యములు కలిగిన స్త్రీని వివాహము చేసుకొనెను. చదువుకున్న తన భార్య ద్వారా స్మిత్ కూడా బైబిల్ చదువుట నేర్చుకొనెను. స్మిత్ ప్రసంగించుచున్నప్పుడు అతనికి నత్తి ఉండుటవలన, సరిగా చదువుకోనందున, వాగ్ధాటిలేని మూలాన, అతని ప్రసంగం వినువారు

విసుగుకొనుచుండెడివారు. అయితే నిరుత్సాహ పడని స్మిత్ ప్రార్థనాపరురాలైన తన భార్యతో పాటు పిల్లల మధ్య సేవ ప్రారంభించి వారికి బైబిల్ కథలు నేర్పించి రక్షణలోనికి నడిపించెడివాడు. కొన్నిసార్లు స్మిత్ భార్య అయిన పాలీ ఆయన పక్షమున ప్రసంగించెడిది.

అయితే స్మిత్-సత్తి పెదవులు గల మోషేను వాడుకున్న దేవా! ఆది అపొస్తలులపై నీ ఆత్మను కుమ్మరించి వాక్ శక్తిని ఇచ్చిన దేవా! నన్ను బలపరచవా? నన్నును వాడుకొనవా? అని చేసిన ప్రార్థనా ఫలితముగా ఆత్మ నింపుదలను పొందెను. అద్భుతముగా దేవుడాయనకు శక్తినిచ్చి ప్రసంగించుటకు వాడుకొనెను. పాపులు రక్షించబడుట, దయ్యములు పట్టిన వారు విడిపించబడుట ఆయన సేవలో కనబడెను. ఒక రోజు బస్‌లో వెళ్ళుచున్నప్పుడు స్మిత్ నోరు తెరచి బిగ్గరగా సువార్తను ప్రకటించెను. ఆ ప్రసంగము విన్న ఆ బస్‌లోని వారందరు కన్నీరు కార్చి పశ్చాత్తాప పడిరి. స్మిత్ వారందరి కొరకు చేతులుంచి ప్రార్థించెను.

స్మిత్ విగ్గిల్స్‌వర్త్ త్వరగా కోపపడే తత్వం కలిగినవాడు కాని ప్రభువు సన్నిధిలో గోజాడి ప్రార్థించగా ప్రభువు అతనిని సాత్వికునిగా మార్చెను. స్మిత్ దీనుడు, నిరాడంబరజీవి. తాను కోరుకొంటే ఆడంబరముగా జీవించవచ్చును. గాని తన సమస్తమును ప్రభువుకు సమర్పించి సాధారణమైన, శుభ్రమైన వస్త్రములను ధరించి, గంభీరముగాను, పరిశుద్ధునిగాను జీవించెను. స్మిత్ విగ్గిల్స్ ప్రభువుపై గాఢమైన ప్రేమను, ప్రజలపై కనికరమును కలిగియుండెడివాడు.

ప్రతి 15 నిమిషముల కొకసారి బైబిల్ చదువకపోయినచో నేనుండలేను. బైబిల్ లేనిదే నా వస్త్రధారణ సంపూర్తి అయినట్లు నేను తలంచను, అని స్మిత్ మాటి మాటికి అనేవాడు. రోజుకు ఎంతసేపు మీరు ప్రార్థన చేస్తున్నారు అని ఆయనను అడిగినప్పుడు, "నేను దినమెల్లా ప్రార్థనలోనే ఉన్నాను. ప్రతి అరగంటకు ఒకసారి అయినా మోకరించి ప్రార్థించకుండా నేను ఉండలేను. ప్రార్థనే నా జీవితం. ప్రార్థనే నా ఊపిరి" అని అంటుండేవాడు. ప్రార్థనా భారాలతో ఆయనకు అందిన ప్రతి ఉత్తరాన్ని చదివి మనుష్యుల కష్టములను, పాపబంధకములను గురించి గ్రహించి, వారిపై ప్రేమతో, హృదయం పగిలినవాడై కన్నీటితో వారికొరకు విజ్ఞాపన ప్రార్థన చేసేవాడు.

ఒకసారి రైలులో ప్రయాణించి వెళ్ళుచున్నప్పుడు వ్యాధిగ్రస్థులైన ఒక తల్లిని, బిడ్డను చూచెను. మీ వ్యాధికి నా దగ్గర మంచి మందున్నది అని స్మిత్ చెప్పినప్పుడు,

అయ్యా! ఆ మందు మాకివ్వండి అని వారు అడిగిరి. అప్పుడు స్మిత్ తన సంచిలో నుంచి బైబిల్ తీసి (నిర్గమ 15:26) చదివి వారికొరకు ప్రార్థించెను. వెంటనే వారు స్వస్థత పొందిరి. ఈలాగు దేవుడు అయనను స్వస్థపరచుటకు, దయ్యములను వెళ్ళగొట్టుటకు, మనుష్యులను రక్షణలోనికి నడిపించుటకు వాడుకొనుచుండెను.

అకస్మాత్తుగా 1913వ సంవత్సరము జనవరి 1 వ తేదీన స్మిత్ సతీమణి అయిన పాలీ నూతన సంవత్సరపు ఆరాధనలో ప్రసంగించుచున్నప్పుడే హఠాత్తుగా మరణించెను. ఈ సంగతి తెలుసుకొన్న స్మిత్ యేసునామంలో మరణాన్ని గద్దించి తన భార్యను బ్రతికించుకొనెను. అయితే బ్రతికి కూర్చున్న భార్య నన్ను ఎందుకు పిలిచారు. నేను ఈ లోకంలో నా పరిచర్యను ముగించుకొన్నాను. నా ప్రభువు నన్ను పిలుచుచున్నాడు నన్ను పోనివ్వండి అనెను. అయితే స్మిత్ ఇంకనూ ఆమె జీవము కొరకు దేవునితో పోరాడుచుండగా, “కుమారుడా! నీ భార్య ఈ లోకంలో తన పరుగును కడముట్టించెను. నేను ఆమెను చేర్చుకొనుచున్నాను” అన్న దేవుని మెల్లని స్వరం విని తన భార్యను దేవునికి అప్పగించెను.

ఆ తర్వాత తన 72 వ సంవత్సరంలో తన అయుష్షు పూర్తి అయినట్లు ప్రభువు బయలు పరచెను. గాని స్మిత్, “ప్రభువా! ఇంకా ఎంతోమంది నశించుచున్నారు. ఇంకా నేను నీ కొరకు చేయవలసిన పని ఎంతో ఉంది. హిజ్కియాను కనికరించినట్లుగా నాకును ఇంకా 15 సంవత్సరాలు ఆయుష్షు నిచ్చునట్లు కనికరించుమ”ని గోజాడి ప్రార్థించెను. ఆయన ప్రార్థనవినిన ప్రభువు మరొక 15 సంవత్సరములు కంటి చూపు తగ్గకుండా, ఒక్క పన్ను కూడా ఊడకుండా స్మిత్‌ను కాపాడి అతనిని వాడుకొనెను.

ఆయన ఫలభరితమైన పరిచర్యకు, ఆత్మ కార్యములకు ముఖ్య కారణములు- ఆయన దేవుని వాక్యమును అధికముగా ప్రేమించి, పఠించి, ధ్యానించువాడు; తన స్వంతశక్తి మీద ఆధారపడక, దేవునిపై అచంచల విశ్వాసము కలిగియుండెడి వాడు; ఆయన సువార్తసేవతో పాటు సువార్తికులను సమకూర్చి వారందరు ఎల్లప్పుడు ఐక్యత గలిగి ఏకమనస్సుతో పరిచర్య చేయాలని, అప్పుడు పరిశుద్ధాత్మ కార్యాలను చూడగలమని చెప్పుచుండెడివాడు.

అలాగు ఆయన వృద్ధాప్యములో అనగా దేవుడు ఇచ్చిన కృపాకాల ఆయుష్షుతో కలిపి 88 సంవత్సరములు యుద్ధవీరునివలె జీవించి, 1947 వ సంవత్సరము మార్చి 12 వ తేదీన ప్రభువు సన్నిధికి వెడలి పోయెను. ✝

# (22) ఛార్లెస్. టి. స్టడ్ [1862-1931]



**పూర్తి పేరు :**
ఛార్లెస్ టి. స్టడ్
**జన్మస్థలం :**
ఇంగ్లాండ్‌లోని విల్ట్‌షైర్
**తల్లిదండ్రులు :**
ఎడ్వర్డ్ స్టడ్ దంపతులు
**భార్య పేరు :**
ప్రిస్కిల్లా స్టేవార్డ్
**జననం :**
1862 వ సంవత్సరము
**మరణం :**
1931 వ సంవత్సరము
**సేవ చేసిన కాలం :**
46 సం॥లు కావచ్చు
**సేవా ఫలితం :**
క్రికెటర్‌గా మంచి పేరును పొంది, కోటీశ్వరుడై నప్పటికి, క్రీస్తు కొరకు వాటన్నిటిని విడిచి చైనా, ఆఫ్రికా దేశాలలో సువార్తను ప్రకటించి అనేకులను ప్రభువు కొరకు సంపాదించెను.

ఛార్లెస్. టి. స్టడ్, ఎడ్వర్డ్ అనే ఒక ధనవంతుని కుమారుడు. చిన్నప్పటి నుండి ఎంతో సౌఖ్యముగా, ఆడంబరముగా పెరిగినవాడు. వేటయందు, క్రికెట్ నందు, గుఱ్ఱపు పందెములయందు ఆసక్తి కలిగినవాడు. తన 16 ఏళ్ళ వయస్సులోనే క్రికెట్ ఆటలో ప్రవీణుడయ్యాడు. స్టడ్ అందమైన, దృఢమైన శరీరం కలవాడు. తన ఆట నేర్పరితనమును బట్టి అతిశయించినవాడు. అనేక గంటలు అద్దం ముందు గడిపేవాడు. ఈలోగా డి.యల్. మూడీ అనే దైవజనుడు జరిపించిన కూటముల ద్వారా స్టడ్ తండ్రి పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందెను. స్టడ్ తండ్రి 'ఎడ్వర్డ్' గుఱ్ఱపు పందెములను, ఆడంబరములను వదిలిపెట్టి క్రీస్తు కొరకు జీవించ నిర్ణయించుకున్నాడు.

తన ఇంటిలో ఒక పెద్ద గదిని ఖాళీ చేసి, సువార్త ప్రకటించుటకు వాడు చుండెను. తన ముగ్గురు కుమారులు కూడా రక్షించబడాలని ప్రార్థించాడు. స్టడ్,

మూడీగారి ద్వారా సువార్తను విన్నప్పుడు కదిలించబడెను. గాని తన హృదయాన్ని ప్రభువుకిచ్చుటకు వెనుకాడుచుండెను. ఈలోగా స్టడ్ సహోదరుడైన 'జార్జి' బహు వ్యాధిగ్రస్థుడై పడక మీద ఉండుట చూచినప్పుడు ఛార్లెస్‌కు గొప్ప కనువిప్పు కలిగెను. ఈ లోకపు అందచందాలు, ఆస్తి పాస్తులు తాత్కాలికమైనవని; ఆధ్యాత్మిక జీవితము ఎంతో విలువైనదని గ్రహించుకొనెను. ఆ సమయంలో డి.యల్.మూడీ గారు జరిపిస్తున్న ఒక విద్యార్థుల కూటములకు హాజరై అచ్చట తన జీవితమును క్రీస్తునకు పూర్తిగా అప్పగించెను.

అప్పటికి అతను బి.ఏ. ముగించి తానొక న్యాయవాదినవ్వాలనే కోరికతో ఉండెను. కాని అతను రక్షించబడిన తర్వాత, "ప్రపంచంలో వేలకొలది ఆత్మలు నశించుచుండగా, లోక ఘనతను, ఆనందమును ఆశించి, నా జీవితమును ఎట్లు వృథాపరచుకొనగలను?" అనుకొని, క్రీస్తుకొరకు మిషనెరీగా వెళ్ళగోరెను. తన క్రికెట్ ఆటను, చదువును, తల్లిదండ్రులను, ఆస్తిని విడిచిపెట్టి యేసును వెంబడించ నిశ్చయించుకొనెను. క్రికెట్ ఆటలో ప్రఖ్యాతి గడించిన వారు, స్టడ్ నెరిగిన వారు అనేకులు ఉండిరి. గనుక స్టడ్ వారియొద్దకు వెళ్ళి యేసుక్రీస్తు తనను ఏలాగు మార్చెనో సాక్ష్యమిచ్చుచుండగా అనేకులు విని ఆశ్చర్యపడుచుండిరి. తన జీవితములో మిషనెరీగా ఎక్కడికి వెళ్ళవలెనో ప్రార్థించుచుండగా "నన్నడుగుము జనములను నీకు స్వాస్థ్యముగాను, భూమిని దిగంతముల వరకు సొత్తుగాను ఇచ్చెదను" (కీర్తన 2:8) అను స్వరమును మాటి మాటికి వినుచుండెను. సువార్త అందని కోట్ల కొలది ప్రజలు ఉన్న చైనా దేశమునకు దేవుడు తనను వెళ్ళమను చున్నాడన్న గ్రహింపు కలిగెను.

అయితే అతని తల్లిదండ్రులు, స్నేహితులు, అతడు ఇంగ్లాండు దేశములోనే సేవ చేయవలెనని ఎంతో బ్రతిమిలాడినప్పటికిని తాను దేవుని చిత్తము చేయవలెనని స్టడ్ బయలుదేరి 1885 ఏప్రిల్ 1వ తేదీన చైనా దేశం చేరెను. ఆ దేశంలో షాంగై పట్టణం చేరి, దినమునకు 7 గంటలు కష్టపడి చైనా భాషను నేర్చుకొనెను. ప్రతి రోజు ఇంచుమించు 40 మైళ్ళ చొప్పున నడచి సువార్త ప్రకటించెను. తన పాశ్చాత్య మార్గాలను వదలి; వస్త్రధారణలోను, భోజన విషయాలలోను చైనా దేశస్థులను అనుసరించెను.

విశ్వాసముతో ఎన్నో కష్టాలను ఓర్చుకొనుచు ఆత్మల రక్షణార్థమై ప్రయాస పడుచుండెను. ఈలోగా తన తండ్రి మరణించెననియు, ఆస్తిలో తనకు వచ్చిన భాగము విడిచిపెట్టి వెళ్ళెననియు ఉత్తరం వచ్చెను. స్టడ్ ఆ ధనమును ప్రేమించక,

"నీకు కలిగినది అమ్మి బీదలకిమ్ము" అన్న దేవుని మాటకు విధేయతగా, తన ఆస్తిలో కొన్ని వేల డాలర్లను తాను రక్షించబడుటకు కారణమైన డి.యల్. మూడీగారి సేవకు, మరికొన్ని వేల డాలర్లు అనాథ పిల్లలకు సేవ చేయుచున్న జార్జి ముల్లరుగార్కి, మరికొన్ని డాలర్లను పేద ప్రజల మధ్య సేవ చేసే విలియంబూత్ స్థాపించిన రక్షణ సైన్యమునకు, మరి ఇతర సేవకులకు పంచి ఇచ్చెను. ఇయ్యుడి మీకియ్యబడుసన్నట్లుగా ఆయనే ఒక చిన్న మిషనెరీగా ఉండి అనేక సేవకులకు ఇచ్చినందున దేవుడాయనను అత్యధికంగా దీవించెను. ఆయన పరిచర్యలలో ఎప్పుడూ, ఏ లోటు కలుగలేదు.

స్టడ్ చైనా వెళ్ళిన 3 సంవత్సరముల తర్వాత "ఐరిష్" దేశమునకు చెందిన మిషనెరీ అయిన "ప్రిస్కిల్లా స్టేవార్డ్" అనే భక్తి కలిగిన యువతిని వివాహం చేసుకొనెను. దేవుడు వారిని దీవించి 5 గురు బిడ్డలనిచ్చెను. అనేక కష్ట నష్టాల నోర్చుకొని చేయుచున్న 7 సంవత్సరముల పరిచర్య తర్వాత 800 మంది స్త్రీలు, పురుషులు రక్షించబడిరి. ఈ లోగా ఆయన ఆరోగ్యం బహుగా దెబ్బ తిన్నందున వ్యాధిగ్రస్థుడైన స్టడ్ ఇంగ్లాండు దేశమునకు తిరిగి వెళ్ళవలసి వచ్చెను. అలాగు 6 సంవత్సరములు ప్రార్థనలో గడిపెను. ఆయన ఆరోగ్యము కుదుటపడిన తర్వాత తిరిగి ఆయన దక్షిణ భారతదేశమునకు మిషనెరీగా వచ్చి అక్కడ కొంత పరిచర్య చేసెను. మిషనెరీ సేవలో ఉన్న అనేక ఇబ్బందులను బట్టి, సరైన ఆహారము, నీరు సమయానికి దొరకనందున, విశ్రాంతి లేనందున మరల వ్యాధిగ్రస్థుడై తన దేశమునకు చేరి విశ్రాంతి తీసుకొనుచుండెను.

ఆ రోజుల్లో మనుష్యులను తినే ఆఫ్రికా వారికి మిషనెరీ కావలెననే ప్రకటన చూచెను. ఆఫ్రికాకు ఎంతో మంది ఆఫీసర్లు (సైనికాధికార్లు), వ్యాపారస్థులు వెళ్తున్నారు. మరి యేసుని గూర్చి చెప్పుటకు ఎవరూ వెళ్ళడము లేదెందుకు? అని ఆలోచిస్తుండగా "నీవు వెళ్ళు" అనే స్వరము స్టడ్‌కు వినిపించింది. 'ప్రభువా! నేను వృద్ధుడను, 15 సంవత్సరముల నుండి వ్యాధిగ్రస్థుడనై బాధపడుచున్నాను' అని అనగా "నేను నిన్ను స్వస్థపరచగలను! ఆఫ్రికా లాంటి చీకటి ఖండానికి నీవే వెళ్ళాలి" అని ప్రభువు స్వరము మరల వినిపించెను. చేతిలో చాలినంత డబ్బు లేకపోయినా శరీరంలో ప్రయాణం చేసేటంత ఆరోగ్యం లేకపోయినా తన ప్రాణాన్ని పానార్పణంగా యేసు కొరకు ధారపోయుటకే "స్టడ్" తెగించి, యేసు కొరకు తన యౌవనమును, ఉన్నత స్థితిని ఒకప్పుడు త్యాగం చేసెను; చైనా కొరకు, ఇండియా కొరకు తన ఆస్తినంతా త్యాగం చేసెను; ఇదిగో, ఇప్పుడు మనుష్యులను తినే

ఆఫ్రికా ప్రజల కొరకు తన ప్రాణాన్ని త్యాగం చేస్తానంటూ సిద్ధపడెను. "జూదమనేది మహా పిచ్చి, కాని దానికంటె యేసు పిచ్చి మరీ గొప్పది. జూదగాడు జూదములో సమస్తమును కోల్పోయినట్లే, యేసు కొరకు మనకున్నదంతా త్యాగం చెయ్యాలి అనేవాడు సి.టి. స్టడ్.

ఆఫ్రికా వెళ్ళనివ్వకుండా, అనేకులు ఆయనను ఆటంకపరిచారు. గాని 'ప్రభువు నన్ను వెళ్ళమని చెప్పాడు. నేను వెళ్తున్నాను. అక్కడ నేనేమి చేయలేక పోయినా ఇకమీదట రాబోయే మిషనెరీలకు ఒక మార్గదర్శిగా ఉంటాను. నా సమాధి సేవకులకు మొట్టమొదటి మెట్టుగా ఉండనివ్వండి. తన ప్రాణాన్ని కాపాడుకొనేవాడు దానిని తప్పక పోగొట్టుకుంటాడు' అన్నాడు.

స్టడ్ ఆఫ్రికా వెళ్ళి దేవుని కృప వలన మరి 20 సంవత్సరాలు సేవ చేసెను. వేలకొలది ప్రజలను యేసువద్దకు నడిపించెను. బైబిలును అనువదించెను. చివరికి వృద్ధాప్యములో 69 వ ఏట ఆఫ్రికాలో తన చిన్న గుడిసెలోనే మరణించి, ప్రభువు సన్నిధికి వెళ్ళెను. "సైనికుడు, పరిశుద్ధుడు" అను మాటలు వ్రాయబడిన వస్త్రము సి.టి. స్టడ్ దేహముపై కప్పిరి. ✝

"ఐగుప్తు ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొనెను"



సి.టి. స్టడ్ కోటీశ్వరుని కుమారునిగా జీవించినప్పుడు నివసించిన పెద్ద బంగ్లా
క్రీస్తు కొరకు సర్వము విడిచి వృద్ధాప్యములో ఆఫ్రికాలో నివసించిన చిన్న గుడిసె (ఇన్‌సెట్‌లో)

# (23) జాన్ హైడ్

[1865-1912]



**పూర్తి పేరు :**
**జాన్ హైడ్**

**జన్మ స్థలం :**
అమెరికాలోని 'కారల్‌టన్' పట్టణము

**తల్లిదండ్రులు :**
స్మిత్ హోరిస్ హైడ్ దంపతులు

**జననం :**
1865 నవంబరు 9

**మరణం :**
1912 ఫిబ్రవరి 17

**సేవా ఫలితం :**
**శారీరకంగా బలహీనుడైనప్పటికి తన శక్తివంతమైన, అధిక గంటలు చేసిన ప్రార్థన అనేకులను లోతైన పశ్చాత్తాపంలోనికి నడిపించగలిగెను.**

అమెరికాలోని "ఇల్లినాస్" రాష్ట్రములోని "కారల్‌టన్" పట్టణమునందు 1865 నవంబరు 9వ తేదీన జాన్‌హైడ్ జన్మించెను. ఈయన తల్లిదండ్రులు ప్రార్థనాపరులు. వారి గృహమును ఎల్లప్పుడు ప్రార్థన ద్వారా ప్రభువు సన్నిధితో నింపుకొనుచుండిరి. చిన్న వయస్సు నుండి వారి బిడ్డలను ప్రార్థనలోను, క్రమ శిక్షణలోను పెంచిరి.

జాన్‌హైడ్ 1892వ సంవత్సరములో మిషనెరీగా భారతదేశమునకు వచ్చెను. ఈయన శారీరకంగా బలహీనుడుగా యుండుటవలన ఈయనను ఎవరూ ఒక మిషనెరీగా భావించలేక పోయిరి. ఈయన చాలా మెల్లగా మాట్లాడేవాడు. మాటలు తడుముకొంటూ మాట్లాడవల్సి వచ్చేది. వినికిడి కూడా కొంచెం తక్కువ! గట్టిగా కేకలు వేస్తూ ఉత్సాహముగా పరుగులెత్తి ప్రయాస పడలేక పోయేవాడు. ఎప్పుడూ ప్రశాంతముగా, సాధువుగా యుండే ఈయనను చూచిన వారనేకులు

ఇంత శాంతపరుడు మిషనెరీ పని ఏమి చేయగలడు? అనుకొనేవారు. అవును, ఒక మిషనెరీకి ధైర్యసాహసములు, వాగ్ధాటి, చురుకుదనము, శరీర ధృఢత్వము ఎంతో అవసరమే కావచ్చును. అయినను జాన్‌హైడ్ విషయములో అది వేరుగా యున్నది. ఇవేమియు జాన్‌హైడ్‌కు లేకున్నను ఈయనలో యున్న ప్రత్యేకత మోకాళ్ళ ప్రార్థన.

మోకాళ్ళపై గంటల తరబడి ప్రార్థించుట ద్వారా జాన్‌హైడ్ పరలోకపు శక్తిని, ప్రభావమును భూలోకమునకు దింపెడివాడు. 'నేను ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను, నన్ను బలపరచు వానియందు నేను సమస్తమును చేయగలను' అన్న పౌలువలె బలహీనుడైన ఈయన దేవుని కొరకు బలమైన కార్యములు చేసెడివాడు. ఈయన ప్రార్థనా గది చెంత నిలుచువారు ఎడతెగని ఈయన ప్రార్థనా విజ్ఞాపనలను, నిట్టూర్పులను గంటల తరబడి వినగలరు. ధారలుగా కారు కన్నీటిని చూడగలరు. అన్న పానములు మాని సమయమును కూడా లెక్కించకుండా ప్రభుపు సన్నిధిలో ప్రార్థిస్తూ, విలపిస్తూ తన హృదయమును కుమ్మరించి గోజాడుచుండెడి వాడీ జాన్‌హైడ్.

ఈ రోజులలో కొందరికి ప్రార్థన అలవాటుగా యున్నది. వారు ఏవో అలవాటు ప్రార్థనలు చేస్తూ, ఏదో భక్తి మార్గమును పాటిస్తున్నామని తృప్తి చెందుచున్నారు. కొందరు ప్రార్థనను అభ్యాసముగా ఎంచి అనుదినము ప్రార్థనకు కొంత సమయమును కేటాయించి ఆ తరువాత తమ ఇష్టానుసారముగా జీవిస్తుంటారు. కొందరు తమకు కావలసినవి దేవుని దగ్గరనుండి పొందుటకు ప్రార్థనను ఒక మార్గముగా ఎంచుతారు. మరికొందరు ప్రార్థనను ఒక నియమముగా ఎంచి ప్రార్థిస్తారు. కాని జాన్‌హైడ్ ప్రార్థననే తన జీవితముగా మార్చుకొని ప్రభువుతో సహవాసం చేస్తూ ఆయన సన్నిధిలో ఉల్లసించేవాడు. ఒంటె మోకాళ్ళ ప్రార్థనావీరుడని ఈయనకు పేరుకలదు. ఎడతెగక మోకరించుటవలన ఆయన మోకాళ్ళు కాయలు కట్టి ఒంటె మోకాళ్ళవలె కనబడెడివి. ఆయన వేసుకొనిన ఫ్యాంట్స్ కూడా మోకాళ్ళ దగ్గర నలిగి చినిగియుండెడివి.

మన దేశమునకు మిషనెరీగా వచ్చిన జాన్‌హైడ్ అనేక సమస్యలను, కష్టములను ఎదుర్కొనెను. మన దేశములోని ఎండ వేడిమికి తట్టుకొనలేక పోయెడివాడు. మన దేశభాషలు నేర్చుకొనుటలో ఎంతో శ్రద్ధ చూపించినను వినికిడి మందమైనందున, ఎదుటివారి మాటలు తేటగా వినలేక పోయినందున మన దేశభాషలు నేర్చుకొనుట బహు కష్టతరమాయెను.

ఎటూతోచని ఈ మిషనెరీ ఒంటరిగా కూర్చొని దేవుని వాక్యములోని మర్మములు నేర్చుకొనుట ప్రారంభించెను. రాత్రింబగళ్ళు బైబిలు చదివి, పరిశీలించి, ప్రార్థించి ధ్యానించుచుండెడివాడు. అది చూచిన కొందరు “మిషనెరీగా వచ్చిన మీరు సువార్త సేవ చేయకుండా ఎప్పుడూ బైబిలు చదువుతూ కూర్చుంటే ఎలాగండి?” అనెడివారు. అందుకాయన దీనంగా నేను బైబిలులోని సువార్తను బోధించడానికి వచ్చాను, నిజమే! అయితే, బోధించుటకు ముందు దేవుని వాక్యమును మొదట నేను సరిగా చదివి అర్థం చేసుకోవద్దా? అనేవాడు.

ఒకసారి మన దేశములోని పంజాబ్ రాష్ట్రములో ‘సియల్‌కోట్’ అను స్థలములో ఉజ్జీవ కూటములో ప్రసంగించుటకు ఆహ్వానించబడిరి. అది ఒక గొప్ప బాధ్యతగా ఎంచిన జాన్‌హైడ్ తన తోటి దైవదాసులతో కలిసి ఆసక్తిగా ప్రార్థించుటయే కాక దేవుని ఆత్మ ఆ కూటములలో కుమ్మరించబడు నిమిత్తమును, దేవుడు తనను ఒక బలమైన పనిముట్టుగా వాడుకొను నిమిత్తమును 21 దినములు రాత్రింబగళ్ళు దేవుని సముఖమునందు పడియుండెను. నశించిన ఆత్మలు రక్షించబడాలనే భారముతో ప్రార్థించెను. ఆ ఉజ్జీవ కూటములలో మొదటి కూటములో ప్రసంగించవలసిన జాన్‌హైడ్ తన ప్రార్థనా గదిని విడిచి పెట్టుటకు ఆలస్యమాయెను.

ప్రశాంతమైన ఆయన ముఖములో ప్రజలు దేవుని వెలుగును చూడగలిగిరి. ఆయన మెల్లగా లేచి తన ప్రార్థనానుభవములను కొంతచెప్పి, పాపమును జయించుటకును, జయజీవితము జీవించుటకును యేసుప్రభువు ఏలాగు సహాయము చేయునో వివరిస్తూ ఒక 15 నిమిషములు ప్రసంగించిన తరువాత మనమిక ప్రార్థన చేయుదమని ప్రార్థనకు తలలు వంచిన వెంటనే పరిశుద్ధాత్మ పందిరిలోని ప్రజల మీదికి దిగెను. జనులు దేవుని సన్నిధిలో తమ పాపముల నొప్పుకొనుచు ఏడ్చుచుండిరి. పశ్చాత్తాపముతో కూడిన కేకలతోను, కన్నీటితో కూడిన విజ్ఞాపనలతోను పందిరంతయు నిండెను.

ప్రసంగము 15 నిమిషములలో ముగిసింది గాని, ఆ ప్రార్థన కొన్ని గంటలు కొనసాగింది. దాని ఫలితముగా అనేక ప్రార్థనా గుంపులు ప్రారంభమయ్యెను. ప్రజలు లోతైన ఆత్మీయానుభవముతో జయ జీవితమును అనుభవించిరి. ఈనాటి మన ఉజ్జీవ కూటములలో ఇటువంటి ఉజ్జీవము చూడలేక పోవుటకు కారణము ప్రార్థనా లేమియే! పాటలకు, ప్రసంగములకు ఇచ్చిన సమయములో కొంతైనను ప్రార్థనకు ఇవ్వకపోవడము ఎంత విచారం!

జాన్‌హైడ్ పెద్దపెద్ద ప్రసంగములను మంచి సామర్థ్యముతో చేయలేక పోయినా, దేవుని సన్నిధి ప్రజల మధ్యకు తెచ్చు మార్గము ప్రార్థనేయని గుర్తించ గలిగెను. కాబట్టే తన జీవితములో ప్రార్థనకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చెను. ప్రార్థన ద్వారా గొప్ప జయములను చూచెను. ఆయన రాత్రింబగళ్ళు ప్రార్థనా గదిని విడువక అన్న పానములు కూడా మరచిపోయెడివాడు. 'అయ్యా! భోజనమునకు వస్తారా?' అని అడిగితే 'ఆకలి లేదు– నన్నింకా కొంచెం సేపు ఆత్మల కొరకు అలమటించనివ్వండి' అనేవాడు. ఆత్మల భారమును బట్టి చిక్కి వంగి బలహీనుడై తన గదిలో నేల మీదపడి దొర్లుచూ ప్రార్థించు ఆయనను చూచిన వారు 'మీ నిమిత్తమై మరల నాకు ప్రసవ వేదన కలుగుచున్నది' అన్న పౌలు మాటలను జ్ఞాపకం చేసుకొనెడివారు.

జాన్‌హైడ్‌కు ప్రభువు సన్నిధిలో ప్రార్థించుచు, స్తుతించుచు, ప్రభువును ఆరాధించుట ప్రథమ పరిచర్యగా యుండెను. దానితోపాటు 'ప్రభువా! రోజుకొక ఆత్మనైనా ఇమ్ము' అని ప్రార్థించెడివాడు. ప్రభువు అలాగే ఆత్మలను ఇచ్చుచున్నప్పుడు 'ప్రభువా! రెండు, మూడు, నాలుగు, అయిదు ఆత్మలను ఇమ్మ'ని ప్రార్థించు కొలది ప్రభువు అనేక ఆత్మలను రక్షించు భాగ్యము నిచ్చెను.

మన దేశంలో ఆయన చేసిన సేవంతా కలిపితే 19 సంవత్సరములు మాత్రమే. కాని, అనేక వేల ఆత్మలను ప్రభువు కొరకు సంపాదించెను. ఈయన సేవలో ప్రాముఖ్యం ప్రార్థన. తరువాతే ప్రసంగము. ఈయన జీవితములో ప్రథమ గురి క్రీస్తును ఆరాధించుట! ఆ తరువాత ఆత్మలను సంపాదించుట. ఈలాగు 19 సంవత్సరములు పలు ప్రాంతములు తిరిగి సేవ చేయుటవలన బలహీనుడాయెను. ఈయన ప్రార్థనలో బహువేదన పడుచుండినందున ఈయన గుండె ఎడమవైపు నుండి కుడివైపుకు జరిగినది. వైద్యులు కొంత విశ్రాంతి తీసుకొన వలయునని ఎంత చెప్పినా ప్రార్థన మానలేదు. నిద్రాహారములు మాని, రాత్రింబగళ్ళు ప్రార్థనా పరిచర్యలో సాగిపోవుచుండెను. "నేను పడక మీద లేవలేని స్థితిలో ఉన్నను; విశ్రాంతికి బదులు విజ్ఞాపన కార్యమును సాగించుచున్నాను. ఆహా! క్రీస్తు యొక్క మాటలలోను, కార్యములలోను ఎంత పరిశుద్ధత యున్నది! క్రీస్తుతో నిత్య ముండుటకు త్వరలో పోవుచున్నాను గదా!" అనుచుండెను.

పరిశుద్ధుడుగా, ప్రభువు కిష్టుడుగా యుండుటయే తన జీవిత ధ్యేయముగా చేసుకొనిన హైడ్ తన్ను ప్రేమించి ప్రాణం పెట్టిన ప్రియ రక్షకుని యొద్దకు చేరుటకు ఆశ కలిగి, తన 47 వ ఏట తన పరిచర్యను ముగించి దేవుడిచ్చు మహిమ శరీరము పొందుటకు 1912 ఫిబ్రవరి 17 న పరమ పదించెను. ✝

# (24) అమీకార్ మైఖేల్ [1867-1951]



**పూర్తి పేరు:**
**అమీకార్ మైఖేల్**

**జన్మ స్థలం:**
నార్తర్న్ ఐర్లాండ్‌లోని 'కౌంట్‌డౌన్'

**జననం:**
1867 డిశంబరు 16

**మరణం:**
1951 జనవరి 18

**రక్షణానుభవం:**
19 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం:**
**జపాన్, చైనా, శ్రీలంక, ఇంగ్లాండ్‌లలో సేవ చేసి చివరికి ఇండియాలో కాలుమోపి దేవదాసీల రక్షణార్థమై ప్రయాసపడెను. 35 పుస్తకములను రచించెను. ఈమె స్థాపించిన 'దోనా ఊర్ ఫెలోషిప్' పరిచర్యలు నేటికిని కొనసాగుచున్నవి.**

అమీకార్ మైఖేల్ 1867 డిశంబరు 16 న నార్తర్న్ ఐర్లాండులోని 'కౌంట్‌డౌన్'లో జన్మించెను. ఈమె తల్లిదండ్రులు అనేక పిండి మిల్లులు కలిగి యుండిరి. చిన్న వయస్సులో సంతోషకరమైన, సమృద్ధిగల కుటుంబములో పెరిగెను. 1883 లో వెస్లియన్ మెథడిస్ట్ స్కూల్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే యేసు ప్రభువును రక్షకుడిగా అంగీకరించెను. 1886 లో గ్లాస్కోలో జరిగిన కెస్విక్ సభలలో లోతైన రక్షణ అనుభవము పొంది పరిశుద్ధ పరచబడిన జీవితములోనికి ప్రవేశించెను. ఈమె అనేక కూటములకు వెళ్ళి రకరకాల ప్రసంగాలు వినడంలో సంతోషించక, ఇతరులకు క్రీస్తు నందించు విషయములో భారము కలిగి, వారి పిండిమిల్లులో పనిచేసే అమ్మాయిలకు దగ్గరలో ఉన్న చర్చిలో కూటము ప్రారంభించి ప్రభువు చిత్తము కొరకు ప్రార్థించుచుండగా, ప్రభువు ఆమెను ప్రత్యేకమైన సేవకు నడిపించి ఒక కట్టడమును కూడా కట్టుటకు సహాయము చేసెను. ఆ కట్టడములో జరిగిన కూటములలో అనేక మంది రక్షింపబడిరి. అంతేకాదు బాధలలో ఉన్నవారు,

దిక్కులేనివారు, నలిగినవారు, అనేకులు వచ్చి క్రీస్తు ప్రేమను రుచి చూచి ఆదరణ పొంది రక్షింపబడుచుండిరి.

ఒక దినము ఆమె ప్రార్థించుచుండగా, ఆమె– 'నీ జీవితమును మిషనెరీ సేవకు సమర్పించి నా చిత్తప్రకారము నడువు' మన్న దేవుని స్వరము వినెను. 1892 జనవరి 13వ తేదీన ప్రభువు మరల మాట్లాడెను. ఆమె ప్రార్థించుచుండగా దేవుడు మార్గము తెరచి 1893 మార్చి 3 వ తేదీన కెస్విక్ కన్వెన్షన్ తరఫున మొదటి మిషనెరీగా జపాన్‌కు పంపబడెను. జపాను దేశమునందు సేవలో అనేక అనుభవములను పొందెను. గాని ఆమె వ్యాధికి గురి అయినందున విశ్రాంతి కొరకు స్వదేశమునకు తిరిగి వచ్చి, ఆ తరువాత చైనాకు, శ్రీలంకకు చివరికి 1894లో తిరిగి ఇంగ్లాండుకు వెళ్ళెను.

అయితే ప్రభువు ఆమెను 1895 లో నవంబరు 9 వ తారీఖున ఇండియాకు రప్పించెను. 1901 మార్చి 6 వ తేదీన 'ప్రీన' అనే 7 సంవత్సరముల అమ్మాయి ఆమె యొద్దకు పరుగెత్తుకొని వచ్చి ఏడ్చెను. ఆమె తలిదండ్రులు దేవదాసిగా ఉండటానికి ఆమెను ఎట్లు ఒక గుడికి అమ్మి వేసిరో ఆ బిడ్డ కన్నీటితో చెప్పినపుడు అమీకార్ మైఖేల్ హృదయము ద్రవించెను. వారినెట్లు వేశ్యలుగా (దేవదాసిలుగా) ఆ గుడులలో ఉంచుచున్నారో ఎరిగినపుడు ఆమె మోకాళ్లపై కన్నీటితో వారి ఆత్మల కొరకు, శరీరముల కొరకు ప్రార్థించెను. అటువంటి పిల్లలను ఆ భయంకరమైన స్థితి నుండి విడిపించుటలో ఆమె, ఆమె అనుచరులు బెదిరింపులకు, బంధింపులకు లోను కావలసి వచ్చెను. అయినను 1904 వ సంవత్సరానికి 17 మంది పిల్లలు, క్రీస్తు ప్రేమను చూపించే ఈ అమ్మను చేరుకొని సువార్త విని రక్షింపబడిరి.

అమీకార్ మైఖేల్ చిన్నతనంలో తన కన్నులు తన తల్లి కన్నులవలె ఊదా రంగులో లేవని చింతతో బాధపడి ప్రార్థన ద్వారా తన నల్లనికండ్లు ఊదారంగుగా మారతాయని విశ్వాసంతో ఒక రోజంతా ప్రార్థించసాగెను. అయితే ప్రభువు ఆమె ప్రార్థన విని ఆమె కండ్ల రంగు మార్చలేదుగాని, ఆమెతో– కుమారీ! వద్దు! అని చెప్పెను. అనేక సంవత్సరముల తరువాత భారత దేశమునకు మిషనెరీగా వచ్చినప్పుడు భారతీయ బాలికల కండ్లు నల్లగా ఉండుట చూచి, ఆమెకు ఎక్కడలేని ఆనందము కలిగెను. చిన్నతనములో దేవుడు తన ప్రార్థనకు జవాబు ఇవ్వని రహస్యమును గ్రహించెను.

ఆమె స్థాపించిన ఆశ్రమము కొరకు ఎవరినీ ఆర్థిక సహాయాన్ని అడిగేది కాదు. ఒక బిడ్డను మేము పోషిస్తామని ఎవరైనా ముందుకు వచ్చినను, ఆమె

ఒప్పుకొనక అన్ని కానుకలను ప్రభువు చేతిలో పెట్టి ప్రభువు నడిపింపు ప్రకారము చేసెను. ఆమెతో పనిచేసేవారిని చాలా జాగ్రత్తగా ఎన్నుకొనేది. వారికి జీతముల పద్ధతి లేదు. కాబట్టి త్యాగముతో పరిచర్యచేసే వారు మాత్రమే ఆమెతో ఉండెడివారు. 60 సంవత్సరముల సేవలో ఆమె ఎప్పుడును తన దేశానికి వెళ్ళి నిధుల కొరకు, డబ్బు కొరకు తన వారిని అడుగలేదు. అయినను ఎన్నడూ ఆ సేవ లోటు పడలేదు. అప్పులపాలు కాలేదు.

భారతీయ వస్త్రధారణ ధరించి ప్రాంతీయ భాషలు నేర్చుకొని తమిళనాడులోని తంజావూరు ప్రాంతములో సేవ చేసెను. "సేవలో ముమ్మరంగా ఉండి వ్యక్తిగత ప్రార్థనా సమయము పోగొట్టుకోవద్దు అని, ప్రార్థనా కూటములలో ప్రార్థనను మాని భక్తి మాటలు చెప్పుకొనే విషయములో జాగ్రత్తగా ఉండమ"ని ఆమె తన సహాయకులను హెచ్చరించేది. ఆమెచే విడిపించబడి రక్షించబడిన వారనేకులు ఆమెతో పాటు బహు నమ్మకస్థులుగా సేవ చేసిరి. ఆమె గంటలు తరబడి బైబిలు చదవడమే గాక మిషనెరీల అనుభవాలను అధికముగా చదువుచుండెడిది. ఈమె ఇంచుమించు అనేక రకములైన 35 పుస్తకములను రచించెను.

మనుష్యులను సంతోషపెట్టి, వారి ఆదరాభిమానములను, ధనమును సంపాదించుకోవాలని ఈమె ఎప్పుడూ ఆశించక; దిన దినము, క్షణ క్షణము ప్రభువుపై ఆధారపడి ప్రార్థించినందువల్ల ఆమె స్థాపించిన "డోనాఊర్ ఫెలోషిప్" పరిచర్యలు ఇంకను దక్షిణ భారత దేశములో కొనసాగించబడుచున్నవి.

ఈమె మంచి ప్రార్థనాపరురాలు! "ప్రభువా, నీ కిష్టమొచ్చినట్లు నన్ను చేసుకో! నీ నామములో నీవు ప్రేమించిన వారికి పరిచర్య చేయుటకు తగిన వ్యక్తిగా నన్నేమైనా చేసుకో" అని ఒక దినం భారంతో ప్రార్థించినది. ఆ మధ్యాహ్నం ఆమె కాలు తడబడి పడటం వలన కాలు విరిగినది. ఆమె అప్పటికి 36 సంవత్సరములు పరుగులెత్తుతు చేసిన పరిచర్య కూడా ఆగినది! అయితే ఆ తరువాత 20 సంవత్సరములు ఆమె తన గదిలోనే పడకపై పరుండవలసి వచ్చినను వేలాది ఉత్తరములు వ్రాయుట ద్వారా, పుస్తకములు వ్రాయుట ద్వారా ఆ 20 సంవత్సరములు మరింత గొప్ప విశ్వాస పరిచర్యను కొనసాగించెను. 1948 లో మరింత వ్యాధిగ్రస్థురాలై పడకను విడువలేక పోయినప్పటికిని ప్రభువును ప్రార్థించుచుండెను. చివరికి తన 84 వ ఏట అనగా 1951 జనవరి 18 వ తేదీన ప్రభువు సన్నిధికి వెళ్ళెను ఈ యోధురాలు. ✝

# (25) సాధు సుందర్ సింగ్ [1889]



**పూర్తి పేరు :**
**సాధు సుందర్ సింగ్**

**జన్మ స్థలం :**
భారతదేశంలోని 'రాంపూర్' అనే గ్రామం

**తల్లిదండ్రులు :**
సర్దార్ షేక్ సింగ్ దంపతులు

**జననం :**
1889 సెప్టెంబర్ 3

**రక్షణానుభవం :**
16 సం॥ల వయస్సులో

**సేవా ఫలితం :**
రక్తము కారుచున్న పాదాలతో అనేకులకు, ముఖ్యముగా టిబెట్ ప్రాంత ప్రజలకు సువార్తను ప్రకటించెను.

సాధు సుందర్ సింగ్ 1889 సెప్టెంబర్ 3వ తేదీన పంజాబ్‌లోని 'రాంపూర్' అనే గ్రామంలో మత వైరాగ్యముతో నిండిన సిక్కు కులమునందు పుట్టెను. ఆయన తండ్రి పాటియాలా సంస్థానమందున్న "రాంపురం" అను పట్టణము నందు ప్రసిద్ధి గాంచిన సర్దార్ షేక్ సింగ్ అను ధనవంతుడైన ఒక భూస్వామి. సుందరుడు ఏడేండ్ల వాడైనప్పుడు సంస్కృతములో భగవద్గీతను పల్లించెను. క్రైస్తవ పాఠశాలలో చదువుచున్నప్పటికి ఈయన తన సిక్కు మత వైరాగ్యంతో నిండియుండెను. మతాభిమానముచే ఆ పాఠశాలలో క్రీస్తును ద్వేషించిన ఇతర బాలురకు నాయకుడాయెను. క్రైస్తవ పాఠశాలలో సుందర్ సింగ్‌కు ఇచ్చిన బైబిల్ గ్రంథాన్ని అతడు చించి, కాల్చి వేసెను.

అయితే బైబిల్‌ను కాల్చిన దినము నుండి అతని హృదయములో గొప్ప కలవరం కలిగెను. నిజదేవుని తెలుసుకోవాలనే తృష్ణ ఆయనలో బయలుదేరెను. ఒక తెల్లవారుజామున లేచి చన్నీళ్ళ స్నానం చేసి గదిలోనికి వెళ్ళి తనకు తెలిసిన

దేవుళ్ళన్నిటి పేర ప్రార్థించుట మొదలుపెట్టెను. తనకు ఏ దేవుడు కనిపించక పోగా, తన ప్రార్థనకు జవాబు రాకపోగా విసిగిన సుందర్ రైలు పట్టాలమీద పరుండి, ఆత్మహత్య చేసుకోదలచెను. కాని చివరగా అసలు దేవుడంటూ ఒకడుంటే నాకు కన్పించమని పట్టుదలతో ప్రార్థించెను. అప్పుడా గది ప్రకాశమానమైన వెలుగుతో నిండెను. ప్రభువైన యేసు యొక్క మహిమగల ముఖము కనిపించెను. మేకులతో గాయపరచబడిన తన హస్తములు చాచి "ప్రియుడా! నీ కొరకు నా ప్రాణము పెట్టితిని, నన్నెందుకు హింసించెదవు?" అన్న ప్రభువు మాటలు వినెను. ఆ మాటలు విన్న మరుక్షణమే ఆయన హృదయములో మెరుపులాగా వెలుగు పుట్టెను. పరమానందము కలిగెను. అతని హృదయము మారిపోయెను. గొప్ప సంతోషంతో గంతులు వేయుచు నేను ప్రభువును చూచితిని, యేసుప్రభువే నిజమైన రక్షకుడు అని కేకలు వేసెను.

నేను యేసుప్రభువును చూచితిని అనుచు పట్టలేని సంతోషంతో, గంతులు వేయుచు గదిలో నుండి బయటకు వచ్చిన సుందర్‌సింగ్‌ను చూసిన అతని తండ్రి ఆశ్చర్యపడి, మూడు దినముల క్రితమే గదా! నీవు బైబిల్ కాల్చితివి మరిప్పుడు నీవు చేయునదేమనగా, సుందర్-నేను యేసుప్రభువును చూచితిని. నా హృదయములో గొప్ప సమాధానమును పొందితిని. నేను ఇక మీదట ఆయన బిడ్డగా జీవించెదను అనెను. కొంతకాలము సుందర్ సింగ్ మాటలు పెద్దగా పట్టించుకోని తండ్రి, నేను క్రైస్తవుడను అని మాటిమాటికి అనుచున్న సుందర్‌తో నీవు యేసును అంగీకరించినచో నా కుమారునిగా ఉండుటకు వీలులేదు. ఈ ఇంటిలో నీకిక స్థానం లేదు పొమ్మనెను. పరలోకపు తండ్రియందు విశ్వాసముంచిన సుందర్ సింగ్ ఇల్లు వదలిపెట్టి, క్రీస్తు సాక్షిగా ఉండుటకు బయలుదేరెను.

ఒకరోజు సుందర్‌సింగ్ తల్లిదండ్రులు వీడెక్కడున్ననూ ఫలానా వారి కుమారుడని అనిపించుకొని; మాకు, మా కులమునకు సిగ్గు తెచ్చుననుకొని, వీడు చచ్చుటయే మేలని తలంచి, సుందర్ సింగ్‌ను ప్రేమతో పిలిచి విషము కలిపిన ఆహారమును పెట్టిరి. ఆ ఆహారమును భుజించిన సింగ్ ఒక ఫాదిరిగారి ఇంటి దగ్గరకు వెళ్ళగా అక్కడ స్పృహ తప్పి పడిపోయెను. వెంటనే ఆ ఫాదిరిగారు సుందర్ సింగ్‌ను తన గృహములోనికి చేర్చుకొని ప్రార్థన చేయగా, ఆ విషము విరిగిపోయెను. ఆ విష ప్రభావము నుండి పూర్తిగా కోలుకొని స్వస్థత పొందెను. తరువాత సుందర్ తన 16వ ఏట, బహిరంగముగా క్రీస్తును అంగీకరించి బాప్తిస్మము పొందెను. ఎన్ని శ్రమలు, శోధనలు వచ్చినప్పటికి యేసుని వెంబడించుటలో వెనుదీయని సుందర్‌సింగ్, ముందుకే కొనసాగుచు క్రీస్తును గురించి సాక్ష్యమిచ్చుచుండెను.

అతనిని ఏదోరీతిగా వెనుకకు లాగవలెనని ప్రయాసపడిన సుందర్ బంధువు ఒకరు ఒకరోజు సుందర్ సింగ్‌తో ప్రేమగా మాట్లాడి, తన ఇంటికి తీసుకొనివెళ్లి, తన ఆస్తి వివరాలన్నీ వివరముగా తెలియజేసి, తన యొద్దనున్న వెండి బంగారాలన్నీ చూపించి- "ఈ ఆస్తి అంతా నీకే! ఈ వెండి బంగారాలన్నీ నీకే ఇస్తాను. అయితే, నీవు చేయవలసిందేమంటే యేసుక్రీస్తును విడిచిపెట్టు! మరల మన సిక్కు కులమును వెంబడించు" అనెను. అందుకు సుందర్ సింగ్ చిరునవ్వుతో "నీ ఆస్తి నీవే ఉంచుకో! నీ వెండి, బంగారములు నా కక్కరలేదు. ఈ అల్పమైన వాటి కొరకు అత్యున్నతమైన దేవునిని, ఆయన ఇచ్చు పరలోక రాజ్యమును నేనేలాగు పోగొట్టుకొందును? క్రీస్తు ఉండగా నాకు ఈ లోకంలోనిది ఏదియు అక్కరలేదు" అని ముందుకు సాగిపోయెను. థామస్ కెంపస్ వ్రాసిన "క్రీస్తు అనుకరణ" అను పుస్తక పఠనము సుందర్‌సింగ్‌ను ఎంతగానో ప్రభావితం చేసినది. క్రీస్తు శ్రమలలో పాలిభాగస్థుడు కావాలనే వాంఛతో పరిశుద్ధ పరచబడిన జీవితము కొరకు ఉపవాస ప్రార్థనలు చేసెను.

'యేసుతో వెళ్ళ నే తీర్మానించితిని-వెనుదీయను; లోకము నా వెనుక, సిలువ నా ముందు; యేసుతో వెళ్ల నే తీర్మానించితిని నే వెనుదీయను!' అని పాడుచూ బైబిలును, ఒక దుప్పటిని మాత్రము వెంటబెట్టుకొని తన జీవితంలో ముందుకు సాగిపోయెను. హిమాలయ పర్వతాల్లో మంచుగడ్డలపై కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా నడుస్తూ, "టిబెట్" ప్రాంతములో మూర్ఖులైన జనులకు, క్రీస్తు ప్రేమను గురించి ప్రకటించెను. సువార్త సేవలో ఎన్నో కష్టములు, ఎదిరింపులు, శ్రమలు, చివరికి అనేకసార్లు ప్రాణాపాయములు కలిగినను యేసువైపు చూచుచు ముందుకే సాగెను ఈ సుందర్ సింగ్. ఒకసారి నీరు లేని ఒక పాడుబడిన బావిలో పడవేయ బడినప్పటికి ప్రభువు మరణము నుండి అతనిని ఆశ్చర్యముగా తప్పించెను.

సువార్త ప్రకటన నిషేధింపబడిన నేపాల్‌లో సుందర్‌సింగ్‌ను సువార్త ప్రకటిస్తున్నాడనే నేరంతో పట్టుకొని జైలులో వేసిరి. అక్కడ తోటి ఖైదీలకు వాక్యం బోధిస్తున్నందున అతని కాలు చేతులు కట్టి, జలగలను తెచ్చి శరీరంపై వేసారు. జలగలు రక్తం పీలుస్తున్నా ఆ బాధలో కూడా ప్రార్థిస్తూ, పాటలు పాడుతున్న సుందర్‌సింగ్‌ను పిచ్చివాడనుకొని జైలునుండి పంపేసారు. శ్రమల్లో ఆనందించే నీ భక్తి రహస్యమేమిటని అడిగినప్పుడు నా శ్రమల్లో, బాధల్లో క్రీస్తు సిలువే నాకు ఆదరణ కలుగజేసి నిరీక్షణ నిస్తున్నది. నా కొరకు నా యేసు ప్రభువు పరలోక మహిమను వదలి, సిలువను సహించగా; ఆయన కొరకు ఆత్మలను సంపాదించుటకై నేను నా సిలువను మోయుటలో గొప్పతన మేమీ లేదని చెప్పెడివాడు.

కాషాయ అంగీ, తలకు పాగా, గడ్డంతో సాధువుగా కనిపించే సుందర్ సింగ్ యొక్క ముఖములో క్రీస్తు యొక్క తేజస్సు, ప్రేమ, కనికరములు ప్రజ్వలించు చుండెడివి. అనేకులు ఆయనలో క్రీస్తును చూచుచుండిరి. దేవునితో ముఖాముఖిగా మాట్లాడుట, దేవుని ప్రేమను ఇతరులకు వెల్లడి చేయుట, యేసుప్రభువు నామంలో అనేక స్వస్థతలు, అద్భుతములు చేయుట ద్వారా అనేకులను ప్రభువువైపు త్రిప్పెను. హిమాలయ పర్వతాలలో కాలినడకన సంచరిస్తూ, అనేక చోట్ల తిరుగుచు గొప్ప పరిచర్య చేసెను. అనేక పట్టణములు, ప్రాంతములు, దేశములు ప్రయాణము చేసి, సువార్తను ప్రకటించి అనేక ఆత్మలను రక్షణలోనికి నడిపించెను.

ఈయన ప్రసంగములు బహు సులభశైలిలో ప్రతివారు గ్రహించుకొన గలుగునట్లు ఉపమానములతో, సువార్త సత్యములతో నిండి యుండెడివి. సుందర్‌సింగ్ యొక్క పరిచర్య ప్రభావము భారతదేశపు ఎల్లలు దాటింది. ఐరోపా, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల వరకు ఆయన పయనించి, సువార్తను బోధించెను. పాశ్చాత్య దేశాల భక్తి కేవలం ఇహ సంబంధమైనది గాను, ఆధ్యాత్మిక విలువలు లేనిదిగాను ఉండుట చూచి ఎంతో బాధపడెను. మరియు క్రైస్తవ సంఘములు విభజించబడిన సిద్ధాంతములతో ఉండుటను, ఐక్యత లేకుండుటను చూచి, వ్యసనపడి– "భూలోకములో కలిసి ఉండలేని ఈ క్రైస్తవులు పరలోకములో ఏలాగు కలిసి ఉండగలరు!" అనెను.

సువార్త ద్వారములు మూయబడిన టిబెట్ దేశములో సువార్త ప్రకటించుటకు కాలినడకన హిమాలయ కొండలలో ప్రయాణం చేసి అచ్చటి బౌద్ధమతస్థులకు సువార్తను ప్రకటించుటకు భారము కలిగిన సుందర్‌సింగ్ అనేకసార్లు వ్యాధిగ్రస్థు డయ్యెను. ఒకసారి ఇంచుమించు మూడు సంవత్సరములు సిమ్లా కొండలలో విశ్రాంతి తీసుకొనవలసిన పరిస్థితి ఏర్పడగా; ఆ సమయములో కొన్ని పుస్తకములను వ్రాసెను. అవి నేటికినీ అనేకులకు ఆశీర్వాదకరముగా ఉన్నవి.

చివరిసారిగా టిబెట్‌కు ఒంటరిగా కాలినడకన ప్రయాణమైన సుందర్‌సింగ్ మరల తిరిగి రాలేదు. ఒకవేళ తాను వెళ్లదలచుకొన్న ప్రాంతానికి వెళ్ళి, అక్కడ సువార్త విరోధుల చేతుల్లో హతసాక్షి అయెనో; లేక మార్గంలోనే చనిపోతే దేవుడు మోషేని సమాధి చేసినట్లు, ఆయనను సమాధి చేసెనో; లేక 'నా రాకడ వరకు అతడు మరణం చూడడు' అన్నట్లు ఆ హిమాలయ కొండలలో ఏదో ఒక ప్రాంతంలో విజ్ఞాపన చేయుచు ఉండెనో మనమెరుగము. అయితే, సుందర్‌సింగ్ మన భారత దేశంలో పుట్టి, రక్తము కారుచున్న పాదములు కల్గిన గొప్ప సువార్తికుడుగా పేరు పొంది, క్రీస్తువలె జీవించి అనేక ఆత్మలను సంపాదించెను. "క్రీస్తును లోకానికి ప్రకటించుటయే నా ధ్యేయం" అన్న సుందర్‌సింగ్ సువార్త కొరకే చివరివరకు పయనించెను. †